ఏప్రిల్
2026

240

సంపుటి : 21 సంచిక : 11

వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

### ఈ సంచికలో........

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడి:
భౌగోళిక రాజకీయ ప్రభావం

పశ్చిమాసియా పటంలో పెను మార్పులు రానున్నాయా?

మోడీ ఇజ్రాయిల్ పర్యటన: ఇరాన్‌పై యుద్ధం

అనియత భారత్...అస్థిర ఉపాధి

మధ్యయుగాల సంస్కృతి

సాంస్కృతిక అక్షరాశ్యత పెంచాలి

ఎప్‌స్టీన్ ఫైల్స్: పెట్టుబడిదారీ వ్యవస్థ దిగజారుడుకు దర్పణం

కార్పొరేట్ల కోసం డేటా సెంటర్లు - ప్రజల వనరులపై దాడి

అభివృద్ధి కోసమే భూములను 22-ఎ జాబితా నుండి తొలగించారా?

ఆయుధ బేహారుల్లో అమెరికా నెం.1

# ఆయుధ బేహారుల్లో అమెరికా నెం.1

అనీష్ ఆనంద్

ప్రపంచ వ్యాపితంగా ఆయుధాలు అమ్ముకుని బ్రతుకుతున్న దేశాల్లో అమెరికా మొదటి స్థానం ఆక్రమిస్తున్నది. 2021-2025 మధ్య ప్రపంచ వ్యాపితంగా అమ్ముడైన ఆయుధాల్లో 42 శాతాన్ని అమెరికానే అమ్మింది. దాని తరువాతి స్థానంలో ఫ్రాన్స్, రష్యా, జర్మనీలు నిలుస్తున్నాయి. ఫ్రాన్స్ 10 శాతం, రష్యా 7 శాతం ఆయుధాలు అమ్ముతున్నాయి. జర్మనీ ఇటీవలనే ఆయుధాల అమ్మకంలో చైనాను మించిపోయి నాలుగో స్థానంలోకి వచ్చింది. దక్షిణ కొరియా ప్రపంచ వ్యాపితంగా ఆధునిక ఆయుధ వ్యవస్థల ఎగుమతుల్లో శీఘ్రంగా అభివృద్ధి చెందుతున్నదని ప్రపంచ వ్యాపితంగా ఆయుధాల ఉత్పత్తి, ఎగుమతి, దిగుమతులపై పరిశోధన చేసే సంస్థ 'సిప్రి' (ఎస్ఐపిఆర్ఐ) తెలియజేసింది.




మొత్తం ప్రపంచ ఆయుధాల ఎగుమతి అంతా కొద్ది దేశాల వద్ద కేంద్రీకరించిబడి ఉంది. అందులోనూ అమెరికా ఆయుధాల అమ్మకంలో ఇతర దేశాలన్నిటినీ మించిపోయింది. తరువాతి స్థానంలో ఉన్న ఫ్రాన్స్ అమ్మకాల వాటా కాన్న అమెరికా నాలుగు రెట్లు అధికంగా అమ్ముతోంది. నాలుగో స్థానంలో ఉన్న జర్మనీ (6 శాతం) తరువాత చైనా (6), ఇటలీ (5), ఇజ్రాయిల్ (4), బ్రిటన్ (3), దక్షిణ కొరియా (3), స్పెయిన్ (2) శాతాలు చొప్పున ఆయుధాలు అమ్ముతున్నాయి. ఇవి కాకుండా ప్రపంచంలోని ఇతర దేశాలన్నీ కలిసి 12 శాతం ఆయుధాలు ఎగుమతి చేస్తున్నాయి. దీన్ని బట్టి చూస్తే అమెరికా తన తరువాతి ఏడు దేశాలు అమ్మే ఆయుధాలు మొత్తం కన్నా ఎక్కువగా అమ్ముతున్నది.

ఆధునిక జెట్ విమానాలు, క్షిపణి రక్షణ వ్యవస్థలు, నిఘా వ్యవస్థలను రూపొందించడంతోపాటు, నిత్యం యుద్ధాలు, ఘర్షణలలో మునిగి ఉండడం వల్ల, అంతర్జాతీయంగా వివిధ దేశాల మధ్య ఘర్షణలు సృష్టించి ఆయుధాలు అమ్ముకోవడం వల్ల అమెరికా ఈ రంగంలో అగ్రగామి స్థానాన్ని నిలుపుకుంటోంది. దానికి తోడు నాటోతో కూటమి కట్టడం, ఆసియా, మధ్య ప్రాచ్యం తదితర ప్రాంతాల్లో వివిధ దేశాలతో రక్షణ ఒప్పందాలు కుదుర్చుకోవడం కూడా అమెరికా ఆయుధాల ఆధిపత్యానికి మరో కారణం.

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగే కొద్దీ అనేక దేశాలు ఆధునిక ఆయుధ వ్యవస్థల కోసం అమెరికా వైపు చూస్తున్నాయి. విశేషమేమంటే తగాదా పడే రెండు పక్షాలకూ ఒక్కోసారి అమెరికానే ఆయుధాలు సరఫరా చేస్తుంది.

నాలుగేళ్ల క్రితం ఉక్రెయిన్-రష్యా మధ్య ఘర్షణ తలెత్తిన తరువాత ప్రపంచ వ్యాపితంగా ఆయుధాల అమ్మకం 10 శాతం పెరిగింది.

ఇటీవలి కాలంలో జర్మనీ ఆయుధాల అమ్మకంలో చైనాను అధిగమించడం ఒక విశేషంగా చెప్పవచ్చు. ప్రపంచ ఆయుధాల సరఫరాలో జర్మనీ నేడు 6 శాతం వాటా కలిగి ఉంది. చైనా కన్నా స్వల్పంగా అధికంగా ఉంది. ఉక్రెయిన్-రష్యా యుద్ధం వల్ల జర్మనీలోనే కాకుండా మొత్తం ఐరోపాలోనే ఆయుధాల అమ్మకాలు, కొనుగోళ్లు పెరిగాయి.

చైనా ఆయుధాలను ప్రధానంగా ఆసియా, ఆఫ్రికా, కొంతవరకు మధ్య ప్రాచ్య దేశాలకు ఎగుమతి చేస్తున్నది. ఇటీవలి కాలంలో దక్షిణ కొరియా ఆయుధాల వ్యాపారంలో వేగంగా ముందుకొస్తున్నది. ఇది ప్రధానంగా ట్యాంకులు, ఫిరంగులు, ఫైటర్ జెట్ విమానాలను ముఖ్యంగా తూర్పు యూరప్, ఆగ్నేయాసియా దేశాలకు అమ్ముతున్నది. ఆధునిక ఆయుధాలను చౌకగా అమ్మడం ద్వారా దక్షిణ కొరియా ఆయుధ వ్యాపార రంగంలో ముందుకు పోతున్నది.

**ఆయుధాల దిగుమతుల్లో ఉక్రెయిన్ తరువాత భారత్**

2021-2025 సంవత్సరాల్లో ప్రపంచ వ్యాపితంగా ఆయుధాల దిగుమతుల్లో ఉక్రెయిన్ ప్రథమ స్థానంలో ఉండగా భారత దేశం రెండో స్థానాన్ని ఆక్రమిస్తోంది. రష్యాతో యుద్ధం వల్ల ఉక్రెయిన్ ఇటీవలి కాలంలో ఆయుధాల దిగుమతిలో అగ్రస్థానానికి వచ్చింది. భారత్, సౌదీ అరేబియా, కతర్, పాకిస్థాన్‌లు ఆయుధాల దిగుమతుల్లో వరుసగా మొదటి అయిదు స్థానాల్లో ఉన్నాయి. భారత దేశం ఆయుధాలను ప్రధానంగా రష్యా, ఫ్రాన్స్, అమెరికాల నుండి దిగుమతి చేసుకుంటున్నది. ఇటీవలి కాలంలో ఇజ్రాయిల్ నుండి కూడా అధికాధికంగా ఆయుధ వ్యవస్థలు దిగుమతి చేసుకుంటున్నది. భారత్‌తో పోటీగా పాకిస్థాన్ కూడా ఆయుధాలను దిగుమతి చేసుకుంటున్నది. ఈ దేశాల మధ్య వైరం ప్రపంచంలో అతి పేదలు ఎక్కువగా ఉన్న ఈ రెండు దేశాలు డబ్బును అన్నపానాల మీద కాకుండా ఆయుధాలమీద ఖర్చు చేయడానికి కారణమవుతోంది.

*

## ఈ సంచికలో...


**1. ఆయుధ బేహారుల్లో అమెరికా నెం.1**
అనీష్ ఆనంద్.......2

**2. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడి: భౌగోళిక రాజకీయ ప్రభావం**
ప్రకాశ్ కరత్.......4

**3. పశ్చిమాసియా పటంలో పెను మార్పులు రానున్నాయా?**
ప్రబీర్ పుర్కాయస్థ........8

**4. మోడీ ఇజ్రాయిల్ పర్యటన: ఇరాన్‌పై యుద్ధం**
ఇఫ్తికర్ జిలాని......11

**5. అనియత భారత్...అస్థిర ఉపాధి**
జీన్ షావుల్......14

**6. మధ్యయుగాల సంస్కృతి**
ఎంవిఎస్ శర్మ......17

**7. సాంస్కృతిక అక్షరాశ్యత పెంచాలి**
మనోజ్ కుమార్ ఝా......21

**8. ఎప్‌స్టీన్ ఫైల్స్: పెట్టుబడిదారీ వ్యవస్థ దిగజారుడుకు దర్పణం**
ఎ కోటిరెడ్డి .....26

**9. కార్పొరేట్ల కోసం డేటా సెంటర్లు - ప్రజల వనరులపై దాడి**
కవితా కబీర్ .....29

**10. అభివృద్ధి కోసమే భూములను 22-ఎ జాబితా నుండి తొలగించారా?**
ఎ కోటిరెడ్డి .....31



**సంపాదకుడు :**
**ఎస్.వెంకట్రావు**

**సంపాదక వర్గం :**
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్.వెంకట్రావు**
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# వినాశకాలం

వినాశకాలే విపరీత బుద్ధి అన్నారు పెద్దలు. అమెరికా ఇటీవలి కాలంలో సార్వభౌమ దేశాలపై జరుపుతున్న దాడులు, ప్రపంచ దేశాలపై ఆంక్షల పేరుతో సాగిస్తున్న వికృత చేష్టలు చూస్తుంటే దానికీ, దాని సామ్రాజ్యవాద ఆధిపత్యానికీ వినాశకాలం దగ్గరలోనే ఉందనిపిస్తోంది. ఇవి కేవలం ఒక దుష్ట శక్తికి పెట్టే శాపనార్థాలు మాత్రమే కాదు, ప్రపంచ రాజకీయ పండితులు చేస్తున్న విశ్లేషణలు కూడా.

సోవియట్ పతనానంతరం అమెరికా నాయకత్వంలో ఏర్పడిన ఏకధృవ ప్రపంచం నుండి ఈ భూగోళ రాజకీయాలు ఏనాడో బహుళధృవ ప్రపంచంలోకి అడుగుపెట్టాయి. ఆ విషయాన్ని ప్రపంచమంతా గమనిస్తోంది. కానీ కళ్లకు సామ్రాజ్యవాద ఆధిపత్యపు బైర్లు కమ్మిన అమెరికాకూ, దాని అధిపతి డొనాల్డ్ ట్రంప్‌కు మాత్రం ఇంకా స్పష్టంగా కనిపిస్తున్నట్లు లేదు. అందుకే ఆయుధాలతో మదమెక్కిన ఆంబోతులా ఒక్క నెలలోనే రెండు దేశాలపై దాడికి తెగబడ్డాడు. మరిన్ని దేశాలపై దాడి చేస్తానని హూంకరిస్తున్నాడు.


జనవరి 3వ తేదీన అమెరికా సైన్యం వెనిజులాపై దాడి చేసి అధ్యక్షుడు నికొలాస్ మదురోను, ఆయన సతీమణినీ కిడ్నాప్ చేసి డ్రగ్స్ సరఫరా చేశారన్న తప్పుడు ఆరోపణలపై ఆయనపై న్యూయార్క్‌లో 'విచారణ' జరుపుతున్నారు. ఒక సార్వభౌమ దేశాధినేతను ఇంకో దేశం అపహరించుకు పోయి తన దేశ చట్టాల ప్రకారం విచారించడం అనేది నాగరిక సమాజంగానీ, అంతర్జాతీయ చట్టాలు గానీ అంగీకరించని విషయం. కానీ ఆయుధబలం, అర్థ బలంతో మదమెక్కిన ట్రంప్‌ముందు ఈ చట్టాలేవీ పనికిరావు. రాజుగారు చెప్పిందే చట్టం అన్నట్లు వ్యవహరిస్తున్నారు. నెలరోజులు తిరక్కుండానే ఫిబ్రవరి 28వ తేదీన యూదు-దురహంకార ఇజ్రాయిల్‌తో కలిసి ఇరాన్‌పై అకస్మాత్తుగా దాడిచేసి దేశ అధినేత ఖమేనీని, 40 మందికి పైగా ఉన్నతాధికారులను హత్యచేసింది. రాజులను చంపి రాజ్యాలు కబళించే నిరంకుశ రాచరికపు భావజాలాన్ని పుణికి పుచ్చుకున్న ట్రంప్ ఇరాన్‌లో తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని ప్రతిష్టించడమే ఏకైక లక్ష్యమని బహిరంగంగానే ప్రకటించాడు. అమెరికా, ఇజ్రాయిల్‌ల దుష్టకూటమి ఇరాన్‌పై నిత్యం బాంబుల వర్షం కురిపిస్తోంది. చిన్నపిల్లల పాఠశాలలు, ఆసుపత్రులు, జనావాసాల మీద కూడా బాంబులు వేసి వేలాది మందిని బలితీసుకుంటున్నది. పోర్టులు, పరిశ్రమలు, చమురు కేంద్రాలను ధ్వంసం చేస్తున్నది.

అయితే తనకున్న పరిమిత వనరులతోనే ఊహించని ప్రతిఘటనకు పూనుకున్న ఇరాన్, అమెరికన్ సామ్రాజ్యవాద పరిమితులేమిటో ట్రంప్‌కు కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. స్వయంగా తయారుచేసుకున్న క్షిపణులు, డ్రోన్లతో మధ్య ప్రాచ్యంలోని అమెరికా స్థావరాలను ధ్వంసం చేసింది. శక్తివంతమైన ఇజ్రాయిల్ క్షిపణి రక్షణ వ్యవస్థలను ఛేదించుకుని ఆ దేశానికి ఎన్నడూ ఎరుగనంతటి నష్టం కలుగజేసింది. తన బాధ ఏమిటో ప్రపంచానికి చెప్పడం కోసం ప్రపంచ చమురు సరఫరాల జీవనాడి వంటి హార్ముజ్ జలసంధిని మూసివేసింది. దాంతో నేడు ప్రపంచమంతా చమురు సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. త్వరలోనే ఈ చమురు సంక్షోభం ఆర్థిక సంక్షోభంగా, సామాజిక సంక్షోభంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరాన్‌పై పనికిమాలిన యుద్ధానికి పాల్పడిన అమెరికా అధ్యక్షుడు ఇప్పుడు సమస్యకు పరిష్కారం చూపమని ప్రపంచ దేశాలను వేడుకుంటున్నాడు. నాటో మిత్ర దేశాలు ఆయనకు అండగా నిలబడకపోగా ఆయన తెలివితక్కువతనాన్ని తెగనాడుతున్నాయి. దేశం లోపల కూడా అమెరికన్ ప్రజలనుండి నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. మార్చి 28న అమెరికాలోని 50 నగరాల్లో యుద్ధానికి వ్యతిరేకంగా జరిగిన 'నో కింగ్స్ డే' ర్యాలీల్లో సుమారు 80 లక్షల మంది ప్రజలు పాల్గొన్నారంటేనే ట్రంప్ రేటింగ్ అమెరికన్లలో ఎంతగా పడిపోయిందో అర్థమవుతుంది.

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడి విషయంలో ప్రధాని నరేంద్ర మోడీ వ్యవహరించిన తీరు భారత దేశపు పరువు ప్రతిష్టలను దిగజార్చే విధంగా ఉంది. యుద్ధానికి రెండు రోజుల ముందు ఇజ్రాయిల్ వెళ్లి ఆ దేశానికి మద్దతు ప్రకటించి వచ్చిన మోడీ, మరోవైపు ఇరాన్ అధినేత హత్యను ఖండించకపోగా కనీసం సంతాపం కూడా తెలియజేయలేదు. అమెరికా అధ్యక్షుని ఆదేశాల మేరకు రష్యా నుండి చమురు కొనడం ఆపేసిన మోడీ అమెరికా అనుమతివ్వడంతోనే రష్యా నుండి మళ్లీ చమురు కొనుగోలు ప్రారంభించారు. మోడీ మన విదేశాంగ విధానాన్ని అమెరికాకు ఎలా దాసోహం చేశాడో గల్ఫ్ యుద్ధం మనకు మరింత స్పష్టంగా చూపెడుతోంది. మోడీ బాటలోనే ఆంధ్రప్రదేశ్‌లోని అధికార ప్రతిపక్ష పార్టీలు నడుస్తున్నాయి. యుద్ధం ఫలితంగా సామాన్యులు ఎన్నో బాధలు పడుతున్నప్పటికీ ఇటు అధికాపక్షం గానీ, ప్రధాన ప్రతిపక్షం గానీ యుద్ధానికి కారణమైన అమెరికా దురాక్రమణ దారీ పోకడలను ఖండించలేకపోతున్నారు. ఇప్పుడిక యుద్ధానికి వ్యతిరేకంగా ప్రజలను కదిలించి దేశ ప్రయోజనాలను రక్షించాల్సిన బాధ్యత ప్రధానంగా వామపక్ష ప్రజాతంత్ర శక్తులమీదనే ఉంది.

**ఈ మాసం ముఖ్యాంశం**

# ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడి: భౌగోళిక రాజకీయ ప్రభావం



రచయిత సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ప్రధాన కార్యదర్శి

**ప్రకాశ్ కరత్**

**('21వ శతాబ్దంలో సామ్రాజ్యవాదం – అంతర్జాతీయ పరిణామాలు' అన్న అంశంపై భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్ర ప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో మార్చి 27వ తేదీన విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఒక రోజు సదస్సు జరిగింది. ఈ సదస్సులో పార్టీ అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్ "ఇరాన్‌పై దాడి – అమెరికా, ఇజ్రాయిల్ సామ్రాజ్యవాద దురహంకారం' అన్న అంశంపై ప్రసంగించారు. ఆయన ప్రసంగం పూర్తి పాఠాన్ని మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం... సంపాదకుడు)**

ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దురాక్రమణ దాడి ప్రారంభమై నెలరోజులు దాటింది. యుద్ధం తీవ్ర రూపం దాల్చింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్‌లో బాంబు దాడులతో విరుచురకు పడుతున్నాయి. ఇరాన్ తన శక్తి కొద్దీ యుద్ధాన్ని ఎదుర్కొంటున్నది.

అమెరికా, దాని మిత్రుడైన ఇజ్రాయిల్‌లు ఎందుకు ఈ సరికొత్త దురాక్రమణ దాడికి పాల్పడుతున్నాయి? దాని భౌగోళిక రాజకీయ పర్యవసానాలేమిటి? మన భారత దేశంపైనా, ఇతర వర్ధమాన దేశాలపైనా దీని ప్రభావం ఎలా ఉంటుంది అన్న విషయాలను మనం అర్థం చేసుకోవాలి. అలాగే ఈ యుద్ధానికి వ్యతిరేకంగా మనం ఇక్కడ ఏం చేయాలి, ప్రపంచవ్యాపితంగా సామ్రాజ్యవాదం పదేపదే చేస్తున్న ఈ దురాక్రమణ చర్యలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని ఎలా సమీకరించాలి అనే విషయాలను కూడా మనం చర్చించాలి.

ఈ రోజు సామ్రాజ్యవాదం మూడు సవాళ్ల నెదుర్కొంటున్నది. మొదటిది, సామ్రాజ్యవాద శిబిరానికి నాయకత్వం వహిస్తూ, ప్రపంచం మీద పెత్తనం చేస్తున్న అమెరికా ఆర్థిక శక్తి గత రెండు మూడు దశాబ్దాలుగా తగ్గుతూ వస్తోంది. అందువల్ల రెండు దశాబ్దాల క్రితంతో పోలిస్తే ఈనాడు ప్రపంచంపై దాని ఆధిపత్య ప్రభావం కూడా తగ్గింది. ఆ విధంగా తగ్గుతున్న సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని తిరిగి పునరుద్ధరించడం కోసం అమెరికన్ సామ్రాజ్యవాదం అనేక విధాలుగా నేడు ప్రయత్నిస్తోంది.

నయా–ఉదారవాదం ఎదుర్కొంటున్న సంక్షోభం సమ్రాజ్యవాదం ఎదుర్కొంటున్న సవాళ్లలో రెండోది. నయా–ఉదారవాదం అనేది ద్రవ్య పెట్టుబడి చేత నడిపించబడే పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ రూపం అనే విషయం మనకు తెలుసు. 1990 దశకంలో సోవియట్ కూలిపోయిన తరువాత నయా–ఉదారవాదం మరింత ప్రముఖంగా ముందుకు వచ్చింది. అది నేడు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ముఖ్యంగా 2008 ప్రపంచ ద్రవ్య సంక్షోభం తరువాత ఇది మరింత తీవ్రం అయింది. అప్పటినుండి నయా–ఉదారవాదాన్ని పునరుద్ధరించడానికి అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల లేదా సామ్రాజ్యవాద దేశాల పాలక వర్గాలు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ అది మళ్లీ పుంజుకోవడం జరగలేదు. ఈ సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో లేదా సామ్రాజ్యవాద శిబిరంలో అనేక వైరుధ్యాలకూ, అలజడులకూ కారణమైంది.

సామ్రాజ్యవాద దేశాల్లో ప్రజల మధ్య, పేద ధనిక దేశాల మధ్య తీవ్రమైన అసమానతలు పెరగిపోవడం ఈ సంక్షోభపు ప్రధానాంశాల్లో ఒకటి. దీనివల్ల సంపద ఒక చోట పోగుపడి శతకోటీశ్వరులు పెరగిపోవడమే కాకుండా వారు సామ్రాజ్యవాద పరిపాలనా వ్యవహారాల్లో నేరుగా జోక్యం చేసుకుంటున్నారు. దాంతో సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ విధానం ప్రపంచ ప్రజల రక్తమాంసాలు పీల్చే దోపిడీని తీవ్రతరం చేసింది. నయా–ఉదారవాద విధాన సంక్షోభం నుండి బయటపడ్డం కోసం సామ్రాజ్యవాద వ్యవస్థ ప్రపంచ వనరులను నేరుగా కబళించడం, ప్రజలను మరింత తీవ్రంగా దోపిడీ చేయడం ప్రారంభించింది.

సామ్రాజ్యవాదం ఎదుర్కొంటున్న మూడో సవాలు, చైనా అభివృద్ధిలో అప్రతిహతంగా ముందుకు పోవడం. చైనా ఆర్థిక శక్తి పెరగడమే కాకుండా అది నేడు అమెరికా ఆధిపత్య ధోరణులను ఎదిరించి నిలబడుతోంది. అందువల్ల చైనా ఎదుగుదలను ఆపడానికి, దాని పురోగమనాన్ని నిలువరించడానికి అమెరికా ప్రభుత్వాలు – నేటి ట్రంప్ ప్రభుత్వమే కాకుండా దానికి ముందున్న ప్రభుత్వాలన్నీ తీవ్రంగా ప్రయత్నిస్తూ వచ్చాయి. చైనాకు సెమీకండక్టర్లు, చిప్స్, ఎఐ వంటి ఆధునిక టెక్నాలజీ అందకుండా కట్టడి చేశాయి. అయితే వాటి ప్రయత్నాలు ఫలించలేదు. నేడు చైనా సాంకేతిక రంగంలో అనేక కొత్త కొత్త ఆవిష్కరణలు చేస్తూ ముందుకు దూసుకుపోతున్నది. అంతే కాకుండా చైనా ఆర్థికంగా బలోపేతం అవడం వల్ల దాని ప్రభావం ప్రపచంలోని అనేక దేశాల్లో విస్తరిస్తోంది. ఇది కూడా సామ్రాజ్యవాదానికి నేడు పెద్ద సవాలుగా నిలిచింది.

ఈ నేపథ్యంలోనే ఇటీవల డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలో అమెరికా ప్రపంచ వ్యాపితంగా చేపడుతున్న బాధ్యరహితమైన, దురాక్రమణ దారీ చర్యలను మనం చూడాలి. అమెరికా ఈ సంవత్సరంలోనే రెండు దురాక్రమణదారీ దాడులు చేసింది. వెనిజులా మీద ఈ ఏడాది

మొదట్లో ఎలా దాడి చేసిందో మనం చూశాం. రాత్రికి రాత్రి దాడి చేసి వెనిజులా అధ్యక్షుణ్ణి, ఆయన భార్యను కిడ్నాప్ చేసి న్యూయార్క్‌కు తీసుకుపోయారు. అక్కడ ఆయనపై విచారణ చేపట్టారు. గత సంవత్సరం ఇజ్రాయిల్ 12 రోజుల పాటు ఇరాన్‌మీద వైమానిక దాడులు చేస్తే ట్రంప్ దానిలో భాగం కలిశాడు. క్యూబాపై ఏ క్షణంలోనైనా దాడి చేసి ఆ చిన్న దీవిని ఆక్రమించుకోడానికి సిద్ధపడ్డాడు.

ఇదంతా ఎందుకు జరుగుతోంది? సామ్రాజ్యవాదానికి నేడు ఇరాన్ ఎందుకు ప్రధాన లక్ష్యంగా మారిపోయింది. దాన్ని అర్థం చేసుకోవాలంటే చమురు పుష్కలంగా ఉన్న పశ్చిమాసియా ప్రాంతపు వ్యూహాత్మక ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలి. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత 1950 నుండి పశ్చిమాసియాపై ఆధిపత్యం కోసం అమెరికా ప్రయత్నిస్తోంది. ఈ ప్రాంతపు చరిత్ర మొత్తం లోకి పోకుండా 21శతాబ్దం ప్రారంభం నుండి ఏమైందో పరిశీలిద్దాం. ఈ కాలంలో పశ్చిమాసియా ప్రాంతంలో నాలుగు దేశాలు అమెరికా ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ వచ్చాయి. అవి లిబియా, ఇరాక్, సిరియా, ఇరాన్. వీటిలో మూడు దేశాలు లిబియా, ఇరాక్, సిరియాలు అరబ్ దేశాలు. ఇరాన్ ముస్లిం దేశం, కానీ షియా మెజారిటీ దేశం. ఈ నాలుగు దేశాలు ఇజ్రాయిల్‌నూ, దాని యూదు-దురహంకారపు విస్తరణ వాదాన్నీ వ్యతిరేకించాయి. వీటిలో మూడిటి మీద అమెరికా దాడులు చేసింది. 2003లో ఇరాక్‌పై అమెరికా ఎలా దాడి చేసి ఆక్రమించుకుందో చూశాం. సద్దాం హుస్సేన్‌ను గద్దె దించి అక్కడ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధ రిస్తామని అమెరికా చెప్పింది. కానీ నేడు ఇరాక్‌లో ఎం జరుగుతున్నదో మనం చూస్తున్నాం. అది నేడు ఒక విఫల రాజ్యంగా, సర్వ నాశనమైన రాజ్యంగా మిగిలింది. ఆ దేశాన్ని నేడు సాయుధ మిలిషియా గ్రూపులు ఏలుతున్నాయి. తరువాత అమెరికా లిబియా మీద దాడి చేసి గడాఫీని హత్య చేసి ఆ దేశాన్ని నాశనం చేసింది. ఈ నాటికీ లిబియా తీవ్రమైన అంతర్యుద్ధంలో కొట్టుమిట్టాడుతోంది. తరువాత వాళ్లు సిరియాను లక్ష్యంగా చేసుకున్నారు. సిరియాలో దీర్ఘకాలిక అంతర్యుద్ధం సాగింది. ఏడెనిమిది సంవత్సరాల అంతర్యుద్ధం తరువాత అక్కడ బషర్ అసద్ ప్రభుత్వాన్ని కూలదోశారు. ఇప్పుడిక ఇరాన్ మాత్రమే మిగిలి ఉంది.

ఈ ప్రాంతంలో అమెరికా ఆధిపత్యాన్ని, ఇజ్రాయిల్ యూదు-దురహంకార విస్తరణ వాదాన్ని వ్యతిరేకిస్తున్న ఏకైక ప్రధాన దేశం ఇరాన్ మాత్రమే. అమెరికా దాని మిత్రులు దాడి చేసి ఆక్రమించుకున్న ఇతర మూడు దేశాల్లో అంటే ఇరాక్, సిరియా, లిబియాల్లో వాళ్లు కోరుకున్నట్లు ఫలితాలు రాలేదు. ఇరాక్‌ను అమెరికా ఆక్రమించుకున్నాక అక్కడ ఏర్పడిన ప్రభుత్వం ఇరాన్‌కు మద్దతుగా ఉంది. ఎందుకంటే ఇరాక్ షియాలు మెజారిటీగా ఉన్న దేశం. అందువల్ల సద్దాం హుస్సేన్‌ను దించినందుకు అమెరికాకు ఏమీ ప్రతిఫలం దక్కలేదు. సిరియాలో అస్సద్ ప్రభుత్వాన్ని కూలగొట్టిన తరువాత, అక్కడ ఇస్లాం ఉగ్రవాద సంస్థ అయిన అల్ ఖైదా నాయకుని ప్రభుత్వాధి నేతగా నియమించింది. ఇక లిబియాలో కూడా గడాఫీ తరువాత దేశం ముక్కలైంది. దాన్ని అమెరికా సమైక్యంగా ఉంచలేకపోయింది. వివిధ రకాల మతఛాందస వాద గ్రూపులు ఒకదానితో మరొకటి నిత్యం కొట్లాడుకుంటున్నాయి. అందువల్ల అమెరికా ఎక్కడెక్కడ జోక్యం చేసుకుందో అక్కడల్లా మతఛాందసవాదులు, ఉగ్రవాద గ్రూపులు తలెత్తాయి. ఈ ఘటనలను నియంత్రించే పరిస్థితి అమెరికాకు లేదు.

“ ఇప్పుడు ఇజ్రాయిల్ ప్రోద్బలంతో ట్రంప్ ప్రభుత్వం ఇరాన్‌పై దాడి చేసింది. కానీ ఏం జరిగింది? అమెరికా ఇరాన్‌పై దాడి చేసి ముందుకు వెళ్లలేని, అలా అని వెన్ను రాలేని సందిగ్ధంలో చిక్కుకు పోయింది. ఆనాడు జార్జి బుష్ హయాంలో ఇరాక్‌పై దాడి చేసిన అమెరికా ఎనిమిదేళ్ల పాటు అక్కడ ఇరుక్కు పోయి బయటకు రాలేకపోయింది. ఈ రోజు ట్రంప్ కూడా అదే పరిస్థితిలో పడ్డాడు. ”

ఇప్పుడు ఇజ్రాయిల్ ప్రోద్బలంతో ట్రంప్ ప్రభుత్వం ఇరాన్‌పై దాడి చేసింది. కానీ ఏం జరిగింది? అమెరికా ఇరాన్‌పై దాడి చేసి ముందుకు వెళ్లలేని, అలా అని వెన్ను రాలేని సందిగ్ధంలో చిక్కుకు పోయింది. ఆనాడు జార్జి బుష్ హయాంలో ఇరాక్‌పై దాడి చేసిన అమెరికా ఎనిమిదేళ్ల పాటు అక్కడ ఇరుక్కు పోయి బయటకు రాలేకపోయింది. ఈ రోజు ట్రంప్ కూడా అదే పరిస్థితిలో పడ్డాడు. అయితే ఇరాన్, ఇరాక్ వంటి చిన్న దేశమూ కాదు, శక్తి లేని దేశమూ కాదు. పశ్చిమాసియాలో ఇరాన్ ఒక ప్రధాన మైన శక్తి. అది 9 కోట్ల మంది ప్రజలున్న దేశం. పారిశ్రామికంగా, సాంకేతికంగా అభివృద్ధి చెందిన దేశం. గొప్ప ప్రాథమిక సదుపాయాలున్నాయి. ఇరాన్ 5,000 ఏళ్ల నాగరికత గల దేశం. దాని నాగరికత ప్రభావం ఆసియా ఖండం అంతటా విస్తరించింది. భారత దేశంలో కూడా మధ్య యుగాల్లో ప్రభుత్వ వ్యవహారాల్లో పర్షియన్ భాషను అధికార భాషగా ఉపయోగించేవారు. ఇరాన్‌ను నాడు పర్షియా అనే వారు. నేటి పంజాబ్ వంటి ప్రాంతాల్లో పర్షియన్ భాష అధికారిక భాషగా ఉండేది. అందువల్ల ఇరాన్ లోతైన నాగరికత, ఉన్నతమైన సాంకేతిక పరిజ్ఞానం గల దేశం. ఈ రోజు ఇరాన్ బ్రహ్మాండమైన క్షిపణులను ప్రయోగిస్తున్న విషయాన్ని మనం చూస్తున్నాం. ఆ క్షిపణులేవీ రష్యా నుండో చైనా నుండో దిగుమతి చేసుకున్నవి కావు. వాటిని అది స్వంతంగా తయారు చేసుకున్నది. ఇరాన్ తను స్వయంగా తయారు చేసుకున్న సహీద్ డ్రోన్‌లను యుద్ధంలో ఉపయోగించడమేకాదు, వాటిని రష్యాకు ఎగుమతి కూడా చేస్తున్నది. ఈ రోజు రష్యా ఉక్రెయిన్‌పై ప్రయోగిస్తున్న డ్రోన్‌లు ఇరాన్‌లో తయారైనవే. ఇప్పుడా రెండు దేశాలూ కలిసి రష్యాలో ఉమ్మడిగా డ్రోన్‌లు తయారు చేస్తున్నాయి. అందువల్ల నేడు అమెరికా - ఇజ్రాయిల్‌లు యుద్ధం చేస్తున్న దేశం సామాన్యమైనది కాదు, అంత తొందరగా లొంగేదీ కాదు.

1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం వచ్చింది. అంతకు ముందు తమ దేశంపై అమెరికా రుద్దిన ‘షా’ కీలుబొమ్మ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ విప్లవం సంభవించింది. ఇరాన్‌లో ఉన్నది మతపరమైన ప్రభుత్వం, మత నాయకుల ప్రభుత్వం అన్న మాట వాస్తవం. కానీ వాళ్లంతా షియా మతం చేతా, అమెరికన్ సామ్రాజ్యవాదానికీ, అది తమపై రుద్దిన షా ప్రభుత్వానికీ వ్యతిరేకంగా సాగిన పోరాట సిద్ధాంతం చేత ఐక్యం చేయబడ్డారు. అందువల్ల అటువంటి దేశంలో దేశాధి నేత అయతుల్లాను, లేక కొంతమంది కమాండర్లను చంపేస్తే అక్కడి

**“ అందువల్ల అమెరికా సామ్రాజ్యవాదపు పరిమితులను ఈ యుద్ధం ప్రపంచానికి చాటి చెబుతోంది. ఈ యుద్ధం పర్యవసానాల్లో మరొకటి ఏమంటే రష్యా చమురు అమ్మకాలపై విధించిన నిషేధాన్ని అమెరికా ఎత్తివేయవలసి వచ్చింది. దాంతో రష్యా ఈ నెల రోజుల కాలంలో చమురు అమ్ముకుని పెద్ద ఎత్తున సొమ్ము చేసుకున్నది. ఇది అమెరికా నాటో మిత్ర దేశాలకు కడుపుమంట కలిగిస్తోంది. ”**

వ్యవస్థ కుప్పకూలిపోతుందనుకోవడం పొరపాటు. ట్రంప్ ఇప్పుడు అక్కడ అదే రకమైన పొరపాటు చేసినట్లు బాధపడుతున్నాడు. మనం ఇరాన్‌లోని మతగురువుల నిరంకుశ పాలనను సమర్థించం. కానీ ఒక విషయం మాత్రం మనం గుర్తించాలి. ఈ వ్యవస్థ ఇరాన్‌లో అంతర్గతంగా అభివృద్ధి చెందింది, బయటి నుండి ఎవరూ దానిపై రుద్ద లేదు. ఇరాన్ ఒక సార్వభౌమాధికార దేశం. అక్కడ ఏ రకమైన ప్రభుత్వం ఉండాలన్నదాన్ని ఆ దేశ ప్రజలు నిర్ణయించు కోవాలి. కానీ అమెరికా – ఇజ్రాయిల్‌లు అలా భావించడం లేదు. ఇరాన్‌లో ఉన్న వ్యవస్థను సర్వనాశనం చేయాలని ఇజ్రాయిల్ కోరుకుం టున్నది. ఎందుకంటే ఆ ప్రాంతంలో యూదు – దురహంకార ఇజ్రాయిల్ విస్తరణ వాదాన్నీ, గాజాలోనూ, లెబనాన్, సిరియా వంటి ఇతర ప్రాంతాల్లోనూ పాలస్తీనా భూభాగ దురాక్రమణనూ వ్యవరేకిస్తున్న ప్రధాన దేశం అదే కనుక. అందుకనే ఇరాన్‌లో వ్యవస్థను నాశనం చేయాలని ఇజ్రాయిల్ కోరుకుంటున్నది. కానీ వారుకున్నట్లు జరగబోదని ఈ నెలరోజుల యుద్ధం చెబుతునన్నది. నా దగ్గర అతి శక్తివంతమై వైమానిక రక్షణ వ్యవస్థ ఉంది, నన్నెవరూ ఏమీ చేయలేరు, శత్రు దేశ క్షిపణులు నా దేశాన్ని తాకలేవు అని ఇజ్రాయిల్ విర్రవీగింది. కానీ ఈనాడు ఇరాన్ క్షిపణులు ఇజ్రాయిల్ రక్షణ వ్యవస్థలను చీల్చుకుని వెళ్లి ఆ దేశం మీద పడుతున్నాయి. నాలుగు రోజుల క్రితం ఇరాన్ క్షిపణులు వెళ్లి ఇజ్రాయిల్ లోని డిమోనా నగరం మీద పడ్డాయి. డిమోనా అనేది ఇజ్రాయిల్ అణు ఇంధనానికి ఆయువుపట్టు వంటి ప్రదేశం. అక్కడ అనేక అణుబాంబులు న్నాయి. అటువంటి పట్టణం మీద ఇరాన్ క్షిపణులు పడ్డంతో ఇజ్రాయిల్ షాక్ తిన్నది. ఈ నగరం వరకు ఇరాన్ క్షిపణులు ఎలా రాగలిగాయో దానికి అందుపట్టడంలేదు. ఇక దీంతోపాటు ఇరాన్ గల్ఫ్‌లోని అన్ని అమెరికా స్థావరాల మీద బాంబులు వేసింది. సౌదీ అరేబియా, బెహ్రాయిన్, యుఎఇ, కతర్ వంటి దేశాలన్నీ అమెరికా మిత్ర దేశాలు. ఆ దేశాలన్నింటా అమెరికా సైనిక స్థావరాలు న్నాయి. గల్ఫ్ దేశాల్లో అమెరికాకు మొత్తం మీద 13 సైనిక స్థావరాలున్నాయి ఈ 13 సైనిక స్థావరాల మీదా ఇరాన్ బాంబులు వేసి ధ్వంసం చేసింది. ఈ స్థావరాలనుండి అమెరికా సైనికులందరూ ఖాళీ చేసి వెళ్లి దగ్గరలోని హొటళ్లలో ఉంటున్నారని న్యూయార్క్ టైమ్స్ పత్రిక రాసింది. అందువల్ల ఇరాన్ ఈ యుద్ధంలో చేతులెత్తేయ కుండా ఎదురుదాడి చేస్తున్నది. దాంతో ట్రంప్ సంకటంలో పడ్డాడు. ఆ ప్రాంతానికి సైన్యాన్ని పంపిస్తానని ప్రకటించాడు. అతను ఆపని చేసినా చేయకపోయినా ఈ యుద్ధం ట్రంప్‌కు చాలా ఖరీదైన యుద్ధంగా మారిపోయింది. ఈ యుద్ధ పర్యవసానాలు పెద్ద ఎత్తున ఉండబోతున్నవి.

హార్ముజ్ జలసంధిని ఇరాన్ తన అధీనంలోకి తీసుకున్నది. పర్షియన్ గల్ఫ్ నుండి అరేబియా సముద్రంలోకి వచ్చే నౌకా మార్గం ఈ హార్ముజ్ జలసంధి గుండా సాగాల్సిందే. కొద్దిపాటి కిలోమీటర్ల వెడల్పు ఉండే చిన్న సముద్ర మార్గం ఈ హార్ముజ్ జలసంధి. ఈ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో నేడు ప్రపంచ వ్యాపితంగా పెద్ద చమురు సంక్షోభం ఏర్పడింది. ప్రపంచ వ్యాపితంగా సరఫరా అయ్యే చమురులో 20 శాతం ఈ సన్నని హార్ముజ్ జలసంధిగుండా వెళ్లాల్సిందే. ఇరాన్ పరిధిలో ఉన్న ఈ జలసంధిని యుద్ధం ప్రారంభం కాగానే ఇరాన్ మూసేసింది. దాంతో ప్రపంచం ఇంధన షాక్‌కు గురయ్యింది. ఫలితంగా ప్రపంచ వ్యాపిత ఆర్థిక సంక్షోభం ముదిరే పరిస్థితి కనిపిస్తోంది. దీని పర్యవసానాలను మనం మన దేశంలో కూడా చూస్తున్నాం. రానున్న రోజుల్లో యుద్ధం కొనసాగితే ప్రపంచంలో అనేక రకాల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.

ఇక ఈ యుద్ధానికి సంబంధించిన భౌగోళిక రాజకీయాలను చర్చించాల్సి వస్తే, ట్రంప్ యుద్ధం ప్రారంభించడానికి ముందు తన మిత్ర దేశాలు వేటినీ సంప్రదించలేదు. ఇరాక్ యుద్ధ సమయంలో అది తన నాటో మిత్ర దేశాలన్నిటినీ సమీకరించింది. కానీ ఇరాన్‌పై యుద్ధానికి మాత్రం ఒంటరిగానే వెళ్లింది. తరువాత ఇప్పుడు మిత్ర దేశాలన్నీ తనతో కలిసి రావాలని పిలుపునిస్తోంది. హార్ముజ్ జలసంధిని తెరవడానికి ఆ దేశాలన్నీ కలిసి రావాలని ట్రంప్ కోరుతున్నాడు. కానీ ఒక్క నాటో మిత్ర దేశం కూడా ట్రంప్ పిలుపును పట్టించుకోవడం లేదు. రానున్న రోజుల్లో అమెరికాకూ, దాని నాటో మిత్ర దేశాలకూ మధ్య వైరుధ్యాలు మరింత పెరిగే అవకాశం ఉంది. అలాగే ఆసియాలో అమెరికా మిత్ర దేశాలైన జపాన్, దక్షిణ కొరియా తదితర దేశాలు కూడా అమెరికాకు తోడుగా యుద్ధంలోకి దిగడానికి సిద్ధపడ్డం లేదు. వాస్తవానికి ఈ దేశాలు అమెరికా సైనిక కూటముల్లో భాగస్వాములుగా కూడా ఉన్నాయి. అయినా అవేవీ ఇరాన్‌పై అమెరికా చేస్తున్న యుద్ధంలో భాగస్వాములవడానికి సిద్ధంగా లేవు.

అందువల్ల అమెరికా సామ్రాజ్యవాదపు పరిమితులను ఈ యుద్ధం ప్రపంచానికి చాటి చెబుతోంది. ఈ యుద్ధం పర్యవసానాల్లో మరొకటి ఏమంటే రష్యా చమురు అమ్మకాలపై విధించిన నిషేధాన్ని అమెరికా ఎత్తివేయవలసి వచ్చింది. దాంతో రష్యా ఈ నెల రోజుల కాలంలో చమురు అమ్ముకుని పెద్ద ఎత్తున సొమ్ము చేసుకున్నది. ఇది అమెరికా నాటో మిత్ర దేశాలకు కడుపుమంట కలిగిస్తోంది. ఎందుకంటే వాళ్లు ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా మరింత బలహీనపడిపోవాలని కోరుకుంటు న్నారు. కానీ ఆ పని జరగకపోగా రష్యా ఈ యుద్ధం వల్ల కనీవిని ఎరుగని రీతిలో లాభాలు గడిస్తోంది. ఇది ఒకపక్క జరుగుతుండగా మరో పక్క చైనా పరిస్థితి మరింత బలోపేతం అయింది. ఈ పనికిమాలిన యుద్ధంలో అమెరికా కోటానుకోట్ల డాలర్లు ఖర్చు చేసి జేబుకు చిల్లు పెట్టుకుంటోంది. ఇంకో 20,000 కోట్ల డాలర్లు యుద్ధ ఖర్చుల కోసం, మరిన్ని ఆయుధాలు కొనడానికీ, ఉత్పత్తి చేయడానికీ కావాలని ట్రంప్ ప్రభుత్వం పార్లమెంటును కోరింది. చైనా ఈ పరిణామాలన్నిటినీ నిశితంగా గమనిస్తోంది. యుద్ధం వల్ల చైనా ఆర్థిక వ్యవస్థ అంతగా దెబ్బతినలేదు. వాళ్లు కూడా చమురు దిగుమతులమీదనే ప్రధానంగా ఆధారపడి నప్పటికీ, గల్ఫ్ దేశాల నుండి వాటికి చమురు

దిగుమతి అవుతున్నప్పటికీ వాళ్లు ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకున్నారు. ముఖ్యంగా రష్యా నుండి వాళ్లు మరింత ఎక్కువగా చమురు దిగుమతి చేసుకోవడం ద్వారా లోటు పూడ్చుకుంటున్నారు.

అందువల్ల ప్రపంచ వ్యాపితంగా చూస్తే ఈ యుద్ధం వల్ల అమెరికా పరిస్థితి మరింత దిగజారింది, ప్రపంచ ఆధిపత్యం చెలాయించే శక్తి దానికి మరింత సన్నగిల్లింది. దాని మిత్ర దేశాలతో సంబంధాలు దెబ్బతిన్నాయి. ప్రస్తుత ప్రపంచంలో అమెరికా ఏక ఛత్రాధిపత్యం చెల్లడం లేదనీ, ప్రపంచం బహుళధ్రువ ప్రపంచ వ్యవస్థవైపు నడుస్తున్నదనీ మనం ఏదైతే చెబుతూ వస్తున్నామో ఆ బహుళధ్రువ ప్రపంచ వ్యవస్థ మరింత బలపడుతోంది, తిరుగులేని విధంగా స్థిరపడుతోంది.

చివరిగా ఈ పరిస్థితిని మన భారత దేశం ఏ విధంగా ఎదుర్కొంటున్నదో మనం పరిశీలించాలి. ఈ విషయంలో మోడీ ప్రభుత్వం మన విదేశాంగ విధానాన్ని సిగ్గుమాలిన విధంగా నిర్వహించింది. ఇరాన్ మనకు పొరుగు దేశం. ఆ దేశానికీ మనకు మధ్య చిన్న భూభాగం, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌లు మాత్రమే అడ్డుగా ఉన్నాయి. సార్వభౌమాధికారం గల ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్‌లు కలిసి ఏకపక్షంగా, అన్యాయంగా దాడి చేశాయి. కానీ ఈ దాడిపై మన ప్రభుత్వం ఒక నిరసనగానీ, ఒక వ్యతిరేకతగానీ తెలపకుండా మౌనంగా ఉండిపోయింది. యుద్ధం మొదటి రోజునే వాళ్లు ఇరాన్ అగ్రనేతను హత్య గావించారు. మన ప్రభుత్వం నిరసన తెలుపుతూ ఒక్క మాటకూడా మాట్లాడలేదు. ఆయతుల్లా ఖొమేనీ మృతికి సంతాపమూ తెలపలేదు. కానీ అమెరికా స్థావరాలున్న గల్ఫ్ దేశాలమీద ఇరాన్ దాడి చేస్తే మాత్రం ఇది తగని పని అని ప్రకటనలు చేస్తోంది. అందువల్ల ఈ యుద్ధం విషయంలో మన ప్రభుత్వం తప్పు చేస్తున్నదని నేను భావిస్తున్నాను. ప్రభుత్వం మౌనంగా ఉందని కొందరు అంటున్నారు. భయంతో నోరు రాక మౌనం వహిస్తున్నదని అంటున్నారు. కానీ నేను మాత్రం తప్పులో భాగస్వామిగా ఉంది గనుక అది నోరు మెదపలేకపోతున్నదని అంటున్నాను. ఎందుకంటే ఇజ్రాయిల్ దాడికి రెండు రోజుల ముందే మోడీ ఆ దేశాన్ని సందర్శించాడు. ఇజ్రాయిల్‌కు భారత దేశం అన్ని విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చి తిరిగి వచ్చిన రెండు రోజులకే అది ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపించడం ప్రారంభించింది.

**“ యుద్ధం మొదటి రోజునే వాళ్లు ఇరాన్ అగ్రనేతను హత్య గావించారు. మన ప్రభుత్వం నిరసన తెలుపుతూ ఒక్క మాటకూడా మాట్లాడలేదు. ఆయతుల్లా ఖొమేనీ మృతికి సంతాపమూ తెలపలేదు. కానీ అమెరికా స్థావరాలున్న గల్ఫ్ దేశాలమీద ఇరాన్ దాడి చేస్తే మాత్రం ఇది తగని పని అని ప్రకటనలు చేస్తోంది. అందువల్ల ఈ యుద్ధం విషయంలో మన ప్రభుత్వం తప్ప చేస్తున్నదని నేను భావిస్తున్నాను. ”**



ఇరాన్‌లోని బాలికల పాఠశాలపై అమెరికా చేసిన బాంబు దాడిలో మరణించిన పసిపిల్లల మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు


అందువల్ల ఈ రోజు మన దేశ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని మంటగలిపిన ప్రభుత్వం మనల్ని పాలిస్తున్నది. ఇది అమెరికా, ఇజ్రాయిల్ పంచన చేరిపోయింది. ఈ విధంగా అది సామ్రాజ్యవాద దురాక్రమణలకు వ్యతిరేకంగా నిలిచే, స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరించే మన దీర్ఘకాలిక సంప్రదాయాన్ని మంటలో కలిపింది. ఇప్పుడు కేంద్రంలో మనల్ని పరిపాలిస్తున్న హిందూత్వ మితవాద ప్రభుత్వం మన దేశాన్ని, మనల్ని ఈ దుస్థితికి తీసుకువచ్చింది.

అందువల్ల ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ జరుపుతున్న ఈ పచ్చి దురాక్రమణ దాడికి వ్యతిరేకంగా దేశ ప్రజలను సమీకరించాల్సిన బాధ్యత మన పార్టీపై పడింది. భారత ప్రభుత్వం అనుసరిస్తున్న దాన్ని భారత ప్రజలు నమ్మడం లేదని మనం ప్రపంచానికి చాటి చెప్పాలి. భారత స్వాతంత్ర పోరాటం నుండి వారసత్వంగా వచ్చిన సామ్రాజ్యవాద వ్యతిరేక విధానానికి భారత ప్రజలు ఇప్పటికీ కట్టుబడి ఉన్నారని మనం ప్రపంచానికి తెలియజేయాలి. అందువల్ల మనం నేడు సామ్రాజ్యవాద వ్యతిరేకతను వ్యక్తపరచడం అంటే సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజల్లో ప్రచారం చేయడం అన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. అన్ని రకాల వాస్తవాలు ప్రజల ముందు పెట్టడం ద్వారా సామ్రాజ్యవాదం ప్రపంచంలో ఎక్కడా దురాక్రమణకు పూనుకోకుండా నిలువరించే శక్తిగా వారిని మార్చాలి.

**(అనువాదం: ఎస్. వెంకట్రావు)**

**యుద్ధం**

# పశ్చిమాసియా పటంలో పెను మార్పులు రానున్నాయా?



రచయిత సాంకేతిక నిపుణుడు, ఢిల్లీ సైన్స్ ఫోరమ్ వ్యవస్థాపక సభ్యుడు, న్యూస్ క్లిక్ వెబ్ పోర్టల్ ఎడిటర్.

**ప్రబీర్ పుర్కయస్థ**

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ప్రారంభించిన యుద్ధం కొనసాగుతోంది. (ఈ వ్యాసం రాసే సమయానికి 12వ రోజుకు చేరుకుంది) ఈ యుద్ధం కారణంగా ఆ ప్రాంత నుండి లభించే చమురు, సహజవాయువు సరఫరాలోనే కాకుండా వ్యవసాయానికి అత్యంత కీలకమైన ఎరువుల ముడి పదార్థాల సరఫరాలో కూడా తీవ్రమైన కొరతను ప్రపంచం ఎదుర్కొంటోంది. ఇవన్నీ ఆసియాకు, ముఖ్యంగా భారత్‌కు అత్యవసరం. ఎందుకంటే భారత్ తన ఇంధన అవసరాలకు, ఎరువుల తయారీకి అవసరమైన ముడి పదార్థాల కోసం పశ్చిమ ఆసియాపై ఎక్కువగా ఆధారపడు తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో బ్యారెల్‌కు 60-65 డాలర్లుగా ఉన్న చమురు ధర యుద్ధం కారణంగా కొద్ది రోజుల క్రితం 150 డాలర్లకు పెరిగింది. యుద్ధం ముగింపు దశకు చేరిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటన తరువాత 90 డాలర్లకు తగ్గింది. అయినప్పటికీ యుద్ధానికి ముందు ఉన్న 60-65 డాలర్ల స్థాయికి ధరలు తిరిగి రావడం కష్టం. ఇది భారత్ వంటి దేశాలకు భారీ భారంగా మారుతుంది. అమెరికా ఆంక్షల మధ్య రష్యా చమురుపై ఆధారపడుతున్న భారత్, బ్యారెల్‌కు 20-25 డాలర్లు అదనంగా చెల్లించాల్సి రావచ్చు. రష్యా నుండి చమురు కొనుగోలుకు అమెరికా ఇచ్చిన అనుమతి ఒక నెల కాలానికి మాత్రమే, ఆ తరువాత కాదన్నది ఇక్కడ గమనార్హం. సహజ వాయువు పరిస్థితి మరింత తీవ్రమైంది, ఇప్పటికే భారత ప్రభుత్వం రెస్టారెంట్లు, ఇతర వాణిజ్య వినియోగదారులకు గ్యాస్ సరఫరాను పరిమితం చేసింది. ఈ సంక్షోభం కొనసాగితే, గృహ వినియోగదారులు, ఎల్‌పిజి సిలిండర్లు, లేదా పైప్ గ్యాస్ వినియోగదారులు కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. ఎందుకంటే ఎరువులు, ఇతర పారిశ్రామిక వినియోగదారులకు ప్రాధాన్యత ఇవ్వవల్సిన తప్పనిసరి పరిస్థితులు ఏర్పడతాయి.

ఇరాన్ ప్రతిఘటన, ముఖ్యంగా దాని డ్రోన్లు, క్షిపణులు, కేవలం ఇజ్రాయెల్, అమెరికాకు మాత్రమే కాకుండా ఆ ప్రాంతంలోని అమెరికా మిత్రదేశాలకు కూడా సమస్యలను సృష్టిస్తున్నాయి. వీటిలో అమెరికాకు సైనిక స్థావరాలు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఇచ్చిన అరబ్ దేశాలు కూడా ఉన్నాయి. ఇరాన్ మాటల్లో చెప్పాలంటే, అరబ్ దేశాల్లోని అమెరికా స్థావరాలు ఇరాన్‌పై క్షిపణులు ప్రయోగించడానికి ఉపయోగిస్తే, అవి ఇరాన్ ప్రతీకార దాడులకు చట్టబద్ధమైన లక్ష్యాలుగా మారుతాయి.

మరోవైపు అమెరికా మీడియా, ఇరాన్ డ్రోన్ దాడులు కొనసాగుతున్న తీరుపై వార్తలు రాస్తూనే ఉంది. అమెరికా థాడ్ (టెర్మినల్ హై ఆల్టిట్యూడ్ ఏరియా డిఫెన్స్), రాడార్ క్షిపణి వ్యవస్థలను ఇజ్రాయెల్, జోర్డాన్, ఖతర్, యూఏఈ, సౌదీ అరేబియాలో నిర్వహిస్తోంది. ఈ వ్యవస్థలలో ఎఎన్-టిపివై -2 రాడార్ ఉంటుంది. ఇది ఎక్స్ బ్యాండ్ పర్యవేక్షణ వ్యవస్థ ఆధారంగా నడుస్తుంది. ఇది థాడ్ వ్యవస్థ యొక్క కేంద్రీయ భాగం. ఇది లేకుండా థాడ్ వ్యవస్థ లక్ష్యాలను గుర్తించలేదు. క్షిపణిని అడ్డుకోవడానికి మార్గనిర్దేశం చేయలేదు. ఖతర్, గల్ఫ్ దేశాల్లో ఉన్న ఈ ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను కోల్పోవడంతో, ఇజ్రాయెల్ యొక్క ఐరన్ డోమ్, డేవిడ్స్ స్లింగ్, అమెరికా యాంటీ-మిసైల్ వ్యవస్థలు తమ సామర్థ్యాన్ని కోల్పోయాయి. ఒక థాడ్ రాడార్, యాంటీ మిసైల్ వ్యవస్థ విలువ సుమారు 110 కోట్ల డాలర్లు (అంటే సుమారు 11,000 కోట్ల రూపాయలు). రాడార్ వ్యవస్థ మాత్రమే కనీసం 50 కోట్ల డాలర్ల విలువ చేస్తుంది.

ఇవి ఖరీదైనవే కాకుండా తయారు చేయడానికి సుమారు 8 సంవత్సరాలు పడుతుందని అంచనా. అందుకే అమెరికా ఇప్పుడు దక్షిణ కొరియా నుంచి ఒక థాడ్ వ్యవస్థను పశ్చిమ ఆసియాకు తరలించింది. ఈ తరలింపుపై దక్షిణ కొరియా ప్రభుత్వం అభ్యంతరం తెలిపినా అమెరికా పట్టించుకోలేదు. సైనిక వ్యవహారాల నిపుణులు చేస్తున్న విశ్లేషణల ప్రకారం థాడ్ ముందస్తు హెచ్చరిక వ్యవస్థను ఇజ్రాయిల్, అమెరికా రక్షణ వ్యవస్థలు కోల్పోయాయి. ఫలితంగా ఇరాన్ చేస్తున్న డ్రోన్లు, క్షిపణి దాడులకు ప్రతిస్పందించడానికి లభించే సమయం 10-15 నిమిషాల నుంచి కేవలం 1-2 నిమిషాలకు తగ్గిపోయింది. అంతర్జాతీయ భద్రతా వ్యవహారాల నిపుణులు, ప్రొఫెసర్ కూడా అయిన థియోడోర్ పోస్టల్ ఒక యూట్యూబ్ వీడియోలో, ఇజ్రాయెల్ యాంటీ-మిసైల్ వ్యవస్థలు నెమ్మదిగా కదిలే డ్రోన్లను కూడా అడ్డుకోవడంలో ఎలా విఫలమౌతున్నాయో చూపించారు. దీంతో ఇరాన్ తక్కువ సంఖ్యలో క్షిపణులు ప్రయోగించినా అదే స్థాయి లక్ష్యాలను తాకుతున్నాయని అర్థమైంది. నిపుణులు చెబుతున్న దాని ప్రకారం తక్కువ ఖర్చుతో తయారు చేసే క్షిపణులు, డ్రోన్లను ఇరాన్ దీర్ఘకాలం ప్రయోగించగలదు. ఇరాన్ తన డ్రోన్ తయారీని భూగర్భంలోకి మార్చడంతో ఇజ్రాయెల్, అమెరికాలు వాటిని లక్ష్యంగా చేసుకోలేకపోతున్నాయి. దీంతో వీటి ఉత్పత్తి దీర్ఘకాలం కొనసాగే అవకాశం ఉంది.

దీని అర్థం ఇరాన్‌కు నష్టం జరగడం లేదని కాదు. ఇజ్రాయెల్, అమెరికా క్షిపణి, బాంబుల దాడుల్లో ఇరాన్ భారీ నష్టానికి గురయ్యింది. అయితే ఇజ్రాయెల్‌కు జరిగిన నష్టం వివరాలు మాత్రం పూర్తిస్థాయిలో వెల్లడి కాలేదు. హైఫా రిఫైనరీ తీవ్రంగా దెబ్బతిన్నట్లు కనిపిస్తోంది. అలాగే ఇజ్రాయెల్ క్షిపణి లాంచర్లు కూడా దెబ్బతిన్నాయి. నిజానికి ఈ యుద్ధంలో ఇజ్రాయిల్‌కు నష్టం కలిగించడం ఇరాన్‌కు అంత ముఖ్యమైన అంశం కాదు. దానికి బదులుగాహోర్ముజ్ జలసంధిని మూసివేయడం ద్వారా ప్రపంచంపై, ముఖ్యంగా పాశ్చాత్య

యూరప్‌లోని నాటో మిత్రదేశాలపైనా, అమెరికాకు, ఇజ్రాయిల్‌కు మద్దతు ఇస్తున్న దేశాలపైనా ఎంత ప్రభావం పడుతుందున్నదే కీలకం. లెబనాన్‌లోని హెజ్‌బొల్లా, యెమెన్‌లోని హూతీలు హోర్ముజ్ జలసంధి, ఎర్ర సముద్రం ద్వారా చమురు రవాణాను ఎంతకాలం అడ్డుకోగలరన్నది మరో ప్రశ్న! ఈ యుద్ధం కొనసాగితే, ఆసియా మాత్రమే కాదు, యూరప్ కూడా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది. రష్యాతో సంబంధాలను తెంచుకున్న యూరప్. దానికి మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇరాన్ ఎంత కాలం పోరాడితే అంత కాలం ఈ పరిస్థితి కొనసాగుతుంది. నిజానికి అదే ఇరాన్ బలం! ఈ యుద్ధం ద్వారా ఆ విషయాన్ని ఇరాన్ స్పష్టంగా తెలుసుకుంది.

దీంతో భారత్, దక్షిణాసియా, యూరప్ దేశాలు పెరిగిన చమురు ధరలు, సరఫరా సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. అప్పుడు ఈ దేశాలు ప్రపంచాన్ని నియంత్రించాలనుకునే సామ్రాజ్యవాద శక్తులపై ఎలా స్పందిస్తాయన్నది చూడాల్సిఉంది. అమెరికా తన విధ్వంసక శక్తిని ఉపయోగించి ప్రపంచ దేశాలను బ్లాక్‌మెయిల్ చేస్తూ, అవసరమైనదాన్ని దోచుకునే పరిస్థితిని ఈ దేశాలు ఎంతకాలం సహిస్తాయన్నది కీలక ప్రశ్న! ఇప్పటిదాకా నియమాల ఆధారంగా నడుస్తున్న అంతర్జాతీయ వ్యవస్థ నుండి అటవీ న్యాయానికి, అందులోనూ అమెరికా మృగరాజుగా ఉన్న వ్యవస్థకు ప్రపంచం మారిపోతుందా?

**"దీంతో భారత్, దక్షిణాసియా, యూరప్ దేశాలు పెరిగిన చమురు ధరలు, సరఫరా సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. అప్పుడు ఈ దేశాలు ప్రపంచాన్ని నియంత్రించాలనుకునే సామ్రాజ్యవాద శక్తులపై ఎలా స్పందిస్తాయన్నది చూడాల్సిఉంది. అమెరికా తన విధ్వంసక శక్తిని ఉపయోగించి ప్రపంచ దేశాలను బ్లాక్‌మెయిల్ చేస్తూ, అవసరమైన దాన్ని దోచుకునే పరిస్థితిని ఈ దేశాలు ఎంతకాలం సహిస్తాయన్నది కీలక ప్రశ్న!"**



అమెరికా–ఇజ్రాయిల్ దాడిలో ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో దెబ్బతిన్న నివాస ప్రాంతం

ఇరాన్, దాని ప్రజలు ప్రపంచ ఆధిపత్యాన్ని సవాలు చేసినందుకు భారీ మూల్యం చెల్లిస్తున్నారనడంలో సందేహం లేదు, అమెరికా రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఉన్నంత శక్తివంతంగా ఇప్పుడు లేకపోయినా, ఆ దేశ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికీ ప్రపంచంలో అతి పెద్దదే! మరోవైపు నాటో మిత్రదేశాలు, జపాన్, దక్షిణ కొరియా, తైవాన్‌లను కలిపిన పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు గతంలా ప్రపంచాన్ని ఏలడం లేదు. చైనా, భారత్, దక్షిణాసియా, లాటిన్ అమెరికాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందాయి. కొనుగోలు శక్తిని ఆధారంగా తీసుకుని చూస్తే బ్రిక్స్ దేశాలు ఇప్పుడు జి–7 దేశాలను అధిగమించాయి. అమెరికా యుద్ధాలకు దిగడం పశ్చిమ ఆసియాలో తన బలాన్ని చూపడానికి కాదు. తన దగ్గర ఏకైక ప్రధాన శక్తిగా మిగిలి ఉన్న సైనిక సామర్థ్యాన్ని ప్రదర్శించడం కోసమే!

**అమెరికా యుద్ధ బడ్జెట్ ఆ రంగంలో**

ఆమెరికా తరువాత స్థానంలో ఉన్న 9 దేశాల బడ్జెట్‌ను కలిపినంత ఉంటుంది.

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికా 30 దేశాలపై దాడి చేసింది. మరే దేశానికి ఇటువంటి రికార్డు లేదు. అంతేకాదు. ఈ విషయంలో అమెరికాకు దగ్గరగా వచ్చే మరే దేశం కూడా లేదు. 'దాడికి గురైనప్పుడు లేదా, దాడి ప్రమాదం ఉన్నప్పుడు మాత్రమే స్పందిస్తోందని ప్రజలను నమ్మించడమే ఈ క్రమంలో అమెరికా సాధించిన విజయం. సద్దాం హుస్సేన్ వినాశకర ఆయుధాలను పోగేస్తున్నాడంటూ ఇరాక్‌పై చేసిన యుదం గుర్తుందా? కొరియాలో యుద్ధం ...? వియత్నాంపై దాడి..? చిలీ ప్రభుత్వాన్ని కూలదోసి పినోచెట్ నియంతృత్వాన్ని నెలకొల్పడం? అలాగే సెర్బియాపై యుద్ధం? క్యూబాలో బే ఆఫ్ పిగ్స్ దాడి? లిబియాలో గడ్డాఫీని కూలదోయడం, వెనిజులాపై ఇటీవల చేసిన దాడి ..? ఇరాన్‌పై పాత, తాజా యుద్ధాలు? ఇలా చెప్పుకుంటూ పోతే ఈ జాబి తాకు అంతు ఉండదు. ఈ జోక్యాలతో అనేక దేశాల్లో ప్రభుత్వాలను కూలదోసి తొత్తు ప్రభుత్వాలను ఏర్పాటు చేయడమే కాకుండా, ఇరాక్ వంటి విఫల ప్రయోగాలను కూడా చేసింది. లిబియా ప్రస్తావనకు ప్రత్యేకత ఉంది.

అది అరబ్ ప్రపంచంలోనూ, ఉత్తర ఆఫ్రికాలోనూ అస్థిరతకు మూలంగా మారింది. 'లొంగిపోయి నూతన వలసగా మారు...లేకపోతే పూర్తిగా నాశనమవ్వు' అన్న నినాదాన్ని అమెరికా ఇచ్చింది.

కుర్దులు, బలూచీలు వంటి మైనారిటీలను ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటుకు ప్రేరేపించవచ్చని అమెరికా, ఇజ్రాయెల్‌లు ఆ ప్రాంతంలోని వాటి మిత్రదేశాలు భావించాయి. ఎందుకంటే ఆ ప్రభుత్వం ఒక మతాధికార పాలన (థియోక్రసీ) చేత నియంత్రించ బడుతోంది. నిజమే, ఇరాన్‌లో కొంతమంది ప్రజలు ప్రస్తుత పాలనను ఇష్టపడరు. అది ప్రజలపై విధినిషేధాలు విధిస్తోంది. దుస్తుల విషయాల్లోనూ బలవంతం చేస్తోంది. మతపెద్దలకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అయితే, పాశ్చాత్య దేశాలు తమతో ఇలాంటి ఆటలు ఎన్నోసార్లు ఆడాయని కుర్దులు బాగా తెలుసుకున్నారు. రాష్ట్ర హోదా ఇస్తామని హామీ ఇచ్చి, తమ యుద్ధ

> **❝ ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేయడం ద్వారా ప్రపంచం ఎంత పరస్పర సంబంధంతో నడుస్తోందో నిరూపించింది. దీని నుండి పశ్చిమ ఆసియాను వేరుచేయడం సాధ్యం కాదు. మనకు అక్కడి నుంచి కేవలం చమురు, సహజ వాయువు మాత్రమే రావడం లేదు. అక్కడ పనిచేస్తున్న భారతీయ వలస కార్మికులు మన దేశానికి విదేశీ కరెన్సీ ప్రవాహాన్ని పంపుతున్నారు. ఇప్పుడు ఆ ఆదాయం కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉంది. ❞**




**ఖమేనీ హత్యకు నిరసగా టెహ్రాన్‌లో ఇరాన్ ప్రజల భారీ ర్యాలీ**

లక్ష్యాలు నెరవేరిన తర్వాత అనేకసార్లు వారిని వదిలేశారు. తాజా ఉదాహరణ సిరియా. ఇరాక్‌లో కూడా ఇదే జరిగింది. కాబట్టి, కుర్దులు మళ్లీ అమెరికా ఉచ్చులో పడుతున్నట్టు కనిపించడం లేదు. వారికి ఇరాన్ ప్రభుత్వంపై అభ్యంతరాలు ఉన్నప్పటికీ, ఇజ్రాయెల్‌తో చేతులు కలిపి ఇరాన్‌ను నాశనం చేయడం వారి లక్ష్యం కాదు.

ఈ యుద్ధాన్ని ప్రారంభించిన ట్రంప్ వెనక్కి తగ్గకపోతే ఇది కొనసాగుతుంది. అతను ఇరాన్ దాని మిత్రులకు పాఠం నేర్పానని, వారి నగరాలను, చమురు మౌలిక సదుపాయాలను ధ్వంసం చేశానని చెప్పి విజయం ప్రకటించుకోవచ్చు. అయితే, ఇజ్రాయెల్‌పై క్షిపణుల దాడులను ఆపలేకపోయినా, 10వ తేదీన జరిగిన తన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ట్రంప్, గత 10 రోజుల యుద్ధాన్ని చిన్నదిగా పేర్కొంటూ, యుద్ధం త్వరలో ముగుస్తుందని అన్నారు. కానీ ఆయన మాటలకూ చేతలకూ పొంతన లేదు. అందుకే ఆ తరువాత కూడా యుద్ధం కొనసాగడం గమనార్హం. అలాగే, 170 మంది చిన్నారి బాలికలు మరణించిన, మరెంద రో గాయపడిన పాఠశాలపై జరిగిన క్షిపణి దాడి నిజానికి అమెరికా ప్రయోగించిన టోమా హాక్ క్షిపణిదేనని, ముందు తాను చెప్పినట్లుగా అది ఇరాన్ క్షిపణి కాదని చివరకు ఆయన అంగీకరించిన విషయాన్ని విస్మరించలేం. మొదట ఆయన ఈ దాడిని ఇరాన్‌పైనే తోసివేయడానికి ప్రయత్నించడం గుర్తుండే ఉంటుంది.

ఈ యుద్ధంలో అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ప్రపంచ ప్రజాభిప్రాయానికి ఏ మాత్రం ప్రాతినిధ్యం ఇవ్వడం లేదు. ఇజ్రాయెల్ ఇప్పుడు పూర్తిగా ఒక యూదు – దురహంకార దేశంగా మారింది. అందులో పాలస్తీనీయులకు హక్కులు ఉండవు. వారు పొరుగు అరబ్ దేశాల్లో శరణార్థులుగా మాత్రమే జీవించాల్సి వస్తుంది. ఇజ్రాయెల్‌లోని యూదు–దురహంకారులు, అమెరికాలోని క్రైస్తవ ఛాందస వాదులు – ఉదాహరణకు, మైక్ హుకబీ (ఇజ్రాయిల్‌లో అమెరికా రాయబారి) వంటి వారు ఇజ్రాయిల్‌కు నైలు నది నుంచి యూఫ్రటీస్ వరకు భూభాగాలపై "బైబిలు హక్కు" ఉందని ప్రకటించారు. స్థానిక ప్రజలను స్థానభ్రంశం చేసి స్థిరనివాసం ఏర్పాటు చేసుకునే సమాజం (సెటిలర్ కాలనీ దేశాలు) ఉన్నంతకాలం అమెరికా, యూరోపియన్ మిత్రదేశాలు ఇజ్రాయెల్‌కు ఆయుధాలు, డబ్బు, రాజకీయ మద్దతు అందిస్తూనే ఉంటాయని ఆయన అన్నారు. ఇజ్రాయెల్‌కు ఇలా ఆయుధాలు, డబ్బు ఇస్తున్నంతకాలం పశ్చిమ ఆసియాలో సమస్యలు కొనసాగుతూనే ఉంటాయి.

పాలస్తీనా సమస్య ప్రపంచవ్యాప్త అంశం; ఇది ప్రపంచాన్ని వలస పాలన నుంచి విముక్తి చేయాలనే పోరాటంలో భాగం. ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేయడం ద్వారా ప్రపంచం ఎంత పరస్పర సంబంధంతో నడుస్తోందో నిరూపించింది. దీని నుండి పశ్చిమ ఆసియాను వేరుచేయడం సాధ్యం కాదు. మనకు అక్కడి నుంచి కేవలం చమురు, సహజ వాయువు మాత్రమే రావడం లేదు. అక్కడ పనిచేస్తున్న భారతీయ వలస కార్మికులు మన దేశానికి విదేశీ కరెన్సీ ప్రవాహాన్ని పంపుతున్నారు. ఇప్పుడు ఆ ఆదాయం కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

అలీనం(నాన్ అలైన్‌మెంట్) ఆధారంగా పనిచేసే మనదేశ విదేశాంగ విధానం స్థానంలో కొత్తగా ప్రవేశపెడుతున్న బహుళ అనుసంధనాలు (మల్టీపుల్ అలైన్‌మెంట్స్) వ్యవస్థ సరిగా పనిచేయడం లేదు. మన అసలు విదేశాంగ విధానం అయిన అలీన విధానం నుంచి దూరమవడం వల్ల, వాస్తవాల పట్ల తడబడాల్సివస్తోంది. ప్రభుత్వం దీనిని త్వరగా అంగీకరిస్తే మంచిది. అవును, ప్రపంచం ఇప్పుడు బహుళ ధ్రువాల ప్రపంచం. కానీ నూతన వలసవాదం ఇంకా బలంగా ఉంది. మనం మన గతాన్ని, స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటాన్ని మరచిపోలేం. ఒక అమెరికన్ తత్వవేత్త చెప్పినట్టు: 'గతాన్ని గుర్తుంచుకోలేని వారు, దాన్ని మళ్లీ పునరావృతం చేయాల్సి వస్తుంది.' కాబట్టి, "మల్టిపుల్ అలైన్‌మెంట్స్" పేరిట భారత దేశం నూతన వలసవాద ఉచ్చులో పడకూడదు.

ప్రతి దేశం తన భవిష్యత్తును స్వేచ్ఛగా నిర్మించుకునే హక్కు కలిగి ఉందని అందరూ గుర్తించాలి. ఇదే హక్కును ఇరాన్ నేడు వినియోగించుకుంటోంది. ఇరాన్ ఇజ్రాయెల్, అమెరికాలను పూర్తిగా ఓడించాల్సిన అవసరం లేదు. ఈ యుద్ధంలో ఇరాన్ నిలిచి ఉంటే చాలు! అదే దాని విజయం! ప్రస్తుత ఇరాన్ యుద్ధం అసలు అర్థం ఇదే. అందుకే ఇది పశ్చిమ ఆసియా వ్యూహాత్మక పటాన్ని మళ్లీ రూపొందించబోతోంది.

**(అనువాదం: పొగడదొరువు)**

# మోడీ ఇజ్రాయిల్ పర్యటన: ఇరాన్‌పై యుద్ధం



రచయిత ప్రముఖ పాత్రికేయుడు. మూడు దశాబ్దాలుగా మధ్య ప్రాచ్యం, భారత ఉపఖండాల్లో పనిచేస్తున్నారు

**ఇఫ్తికర్ జిలాని**

ఫిబ్రవరి 25వ తేదీన పాత జెరుసలెం నగరంలోని అల్ అక్సా మసీదులోని లౌడ్ స్పీకర్ల ద్వారా రంజాన్ ఉపవాసాన్ని ముగిస్తూ ఇఫ్తార్‌ను ప్రకటించినపుడు అక్కడికి సమీపంలో నివసిస్తున్న అన్సారి కుటుంబం మువ్వన్నెల భారతీయ జెండా నీడలో కూర్చుని ఉంది. అక్కడికి కిలోమీటరు దూరంలోని ఇజ్రాయిలీ పార్లమెంటులో ప్రధానమంత్రి నరేంద్రమోడి చేస్తున్న ప్రసంగాన్ని సంతోషంతో టివీలో చూస్తున్నారు.

భారతదేశ విభజన జరగక ముందు ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ మసీదును జెవియా అల్ హిందియాగా పిలుస్తుంటారు. హెరోడ్ గేటుకు కొన్ని మీటర్ల దూరంలోనే ఇది ఉన్నది. భారతీయ నాయకత్వం ముస్లింల భక్తి భావాలను గౌరవిస్తూ, వారితో కలిసిపోతుండే ప్రత్యేకమైన మసీదు జవియా అల్ హిందియా. 12–13 శతాబ్దాలకు చెందిన సూఫీ గురువు బాబా ఫరిద్ గంజ్ షకర్ భారత ఉపఖండానికి తిరిగి రావటానికి ముందు ఈ మసీదు బయట 40 రోజులు దీక్ష చేశారు. బాబా ఫరీద్ సమాధి పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రాంతంలో ఉన్నది. ఇజ్రాయిల్‌తో రాజకీయ సంబంధాలు లేకపోవటంతో, 1947కు ముందు ఉపఖండలో తనకు ఉన్న ఈ వారసత్వాన్ని, నిర్వహణ బాధ్యతలను భారతదేశం వదులుకుంది.

భారతదేశం ఇజ్రాయిల్‌తో పూర్తిస్థాయి దౌత్య సంబంధాలను ఏర్పాటు చేసుకున్న తర్వాత 1993లో విదేశాంగ మంత్రి ప్రణబ్ ముఖర్జి ఈ మసీదును సందర్శించారు. అప్పటి నుండి ఇజ్రాయిల్, పాలస్తీనాలలో పర్యటించిన ప్రతి మంత్రి, ప్రతి ప్రముఖుడూ జవియా అల్ హిందియా మసీదును సందర్శించటాన్ని తమ కార్యక్రమాలలో భాగంగా చేసుకుంటున్నారు. ప్రస్తుత విదేశాంగమంత్రి ఎస్ జైశంకర్ కూడా ఈ మసీదును మూడుసార్లు సందర్శించారు. జెరుసలెంలోని "భారతీయ సంపద" అంటూ తరచుగా దీనిని ఉదహరిస్తుంటారు. "జెరుసలెంలోని భారతదేశానికి స్వాగతం" అని రాసివున్న వాక్యాలు ఆహ్వానం పలుకుతున్నట్లు అనిపిస్తాయి.

కానీ మోడి ఈ "భారతీయ సంపద"ను వదిలివేశారు. ఇందుకు బదులుగా ఇజ్రాయిలీ టెలివిజన్ సిరీస్‌లోని నటులతో గడపటానికీ, రక్షణ దళాల అనుభవాలను తెలుసుకోవటానికీ ప్రాధాన్యత ఇచ్చారు. ఆయన ఢిల్లీ తిరిగి రావటానికి ముందు నరమేధానికి చిహ్నంగా జెరుసలెంలో ఉన్న యాద్ వాషెమ్ మ్యూజియంను కూడా సందర్శించారు.

ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అంతర్జాతీయంగా ఒంటరి అవుతున్న పరిస్థితులలో అతనికి సహాయం చేయటం మోడి పర్యటన ప్రధాన లక్ష్యాలలో ఒకటని పశ్చిమాసియాలోని రాజకీయ నిపుణులు విశ్లేషించారు. ఇజ్రాయిల్ గాజాపై దాడులు చేస్తున్న గత రెండు సంవత్సరాల కాలంలో ఆ దేశంలో పర్యటించిన కొద్దిమంది విదేశీ ప్రభుత్వాధినేతలలో మోడీ ఒకరు.

పశ్చిమాసియాలో సంయమనం పాటించాలని ఒప్పించటానికి నెతన్యాహుతో తనకున్న సన్నిహిత సంబంధాలను మోడీ వినియోగిస్తారని కొందరిలో ఆశలుండేవి. కానీ ఆ ఆశలు కూడా త్వరగానే ఆవిరయ్యాయి. మోడి ఢిల్లీకి తిరిగి వచ్చిన ఒకరోజు తర్వాత అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ ఇరాన్‌పై రాకెట్ల దాడి ప్రారంభించింది. దాడులు జరిగిన సమయం అత్యంత ప్రధానం. దేశాధినేతల మధ్య వ్యక్తిగత సంబంధాలకు ఉన్న పరిమితిని వెల్లడించటతో పాటు, ప్రజలు భారతదేశాన్ని గురించి చెడుగా ఆలోచించే పరిస్థితులకు ఇది కారణమయింది. ప్రస్తుతం ఇజ్రాయిల్‌తో పెరుగుతున్న భాగస్వామ్య సంబంధాలను, పశ్చిమాసియా దేశాలతో ఉన్న దీర్ఘకాలిక సంబంధాలు, ప్రయోజనాలను భారతదేశం ఏ విధంగా కొనసాగిస్తుందన్న అంశంపై తీవ్రమైన ప్రశ్నలు ముందు కొస్తున్నాయి.

ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా దాడులను భారత ప్రభుత్వం గానీ, మోడి ఖండించలేదు.

### ఇజ్రాయెల్ పార్లమెంటు నెస్సెట్‌లో మోడి ప్రసంగం

ఇజ్రాయిల్ పార్లమెంటులో ప్రసంగిస్తూ గాజాలో 'శాంతికోసం' తీసుకుంటున్న చొరవకు మోడి మద్దతు ప్రకటించారు. పాలస్తీనా సమస్య పరిష్కారంతోనే స్థిరమైన శాంతి లభిస్తుందని పేర్కొన్నారు. ఇజ్రాయిల్‌కు మద్దతు తెలుపటం, పాలస్తీనా సమస్య పరిష్కరించాలని మాట్లాడటం, ఈరెండు అంశాలు సమతూకంలో ఉండేలా జాగ్రత్తగా మాటలను కూర్చటం భారతదేశ వైఖరిగా ఉన్నదని నిపుణులు విశ్లేషించారు. అయినప్పటికీ ఈ పర్యటన మీడియాలో ప్రధాన చర్చగా మారింది. పర్యటన జరిగిన సమయమే పైకి చెప్పని ఎన్నో అంశాలను వెల్లడిస్తున్నది. పాలస్తీనా నాయకులతో పాటు అనేకమంది ఇజ్రాయిల్ నాయకులు కూడా మోడి పర్యటనకు ఎంచుకున్న సమయం సరైనది కాదనీ, అప్పటికే ఖాయమైన ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడికి ఆమోదముద్ర వేయటానికే ఈ పర్యటన అని చెప్పారు.

గాజాలో ఉభయ పక్షాల మధ్య సంప్రదింపులు జరిగి, యుద్ధ విరమణ జరిగిన తర్వాత ఈ పర్యటన జరిగితే అర్థవతంగా ఉండేదని, ఇపుడు ఇరాన్‌పై దాడికి సన్నద్ధమై ఈ ప్రాంతమంతా యుద్ధభూమిగా ఉన్నపుడు ఈ పర్యటన జరపటం సరైనది కాదని పాలస్తీనా రచయిత, కార్యకర్త మహ్మద్ ఆర్టెమా చెప్పాడు. "ఏ మాత్రం న్యాయబద్ధం కాని సమయంలో సందర్శనకు వచ్చిన మోడీ ఇజ్రాయిల్‌కు మద్దతు ఇస్తున్నాడని మీడియాలో ప్రధాన వార్తలుగా వచ్చాయి. ఇటువంటి వార్తలు రాకుండా కూడా ఆ దేశంతో ఆర్థిక, సాంకేతిక సంబంధాలను

**“ ఇజ్రాయిల్‌తో మిత్రుత్వం కోసం సౌది అరేబియా లేదా ఇరాన్ పట్ల శత్రువైఖరిని అవలంభించటం వలన భారతదేశం అనేక చిక్కులను ఎదుర్కోవటంతో పాటు, భారీగా మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. భారతదేశం చారిత్రకంగా ఇరాన్‌తో సత్సంబంధాలను కొనసాగిస్తూ, చాబహార్ పోర్టు లాంటి వ్యూహాత్మకమైన ప్రాజెక్టులలో పెట్టుబడులు పెట్టింది. ఇజ్రాయిల్‌తో వ్యవస్థాగత సంబంధాలు పెంపొందించుకొంటే భారతదేశంపై వత్తిడి పెరుగుతుంది. ”**

అభివృద్ధి చేసుకోవచ్చు'' అని ఆయన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు.

తన భార్య సారాతో కలిసి బెన్ గురియన్ విమానాశ్రయంలో మోడికి స్వాగతం పలకాలని నెతన్యాహు తీసుకున్న నిర్ణయం గొప్ప గౌరవంగా ప్రచారం జరిగింది. ఈ మధ్య కాలంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మాత్రమే అటువంటి స్వాగతం పలికారు. ఇజ్రాయిల్ రాజకీయరంగంలో ఇటువంటి సంఘటనలు సాధారణమైనవిగా పరిగణించరు. తమ విధానాలను బలపరిచేవారికి, సన్నిహితులకు, రాజకీయంగా పూర్తి మద్దతుకు వీటిని సంకేతాలుగా భావిస్తారు.

రక్షణ, పారిశ్రామిక రంగాలలో మరింత లోతైన సంబంధాలు, సహకారాన్ని పెంపొందించుకోవటంలో ఇది నూతన దశ అని ఈ పర్యటనకు ముందు భారతదేశంలోని ఇజ్రాయిల్ రాయబారి వ్యాఖ్యానించారు. పరస్పరం నమ్మకం, సాంకేతిక పరిజ్ఞానంలో భాగస్వామ్యాన్ని పెంచుకోవాలి. నూతన ఆయుధాలను ఉమ్మడిగా ఉత్పత్తి చేయాలని, ఇంతకు ముందే ఉభయులూ కలిసి డ్రోన్‌లు, ప్రేలుడు పదార్థాలను ఉత్పత్తి చేస్తున్నామనీ, ఈ నూతన ఒప్పందం ఉన్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించటాన్ని మరింత విస్తృతం చేస్తుందనీ ఆయన చెప్పారు.

మోడీ పర్యటన సందర్భంగా ఇజ్రాయిల్ ఆకాశ రక్షణ వ్యవస్థలైన ఐరన్ డోమ్, ఐరన్ బీమ్‌లను భారతదేశానికి తీసుకొస్తామన్న ప్రచారం బాగా జరిగింది. 2025, మే నెలలో భారత్–పాకిస్తాన్‌ల మధ్య జరిగిన ఘర్షణలు సాంప్రదాయక ఆయుధ నిరోధక వ్యవస్థలు అత్యంత ఖరీదైనవనీ, తమ అవసరాలకు అనుగుణంగా లేవని స్పష్టం చేసింది. అందువల్ల ఎక్కువ శక్తివంతమైన లేజర్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకొంటే చాలా తక్కువ వ్యయంతో శత్రువు ప్రయోగించే ఆయుధాలను అడ్డుకోవచ్చు. ఇది యుద్ధ వ్యూహాలలో కూడా తీవ్రమైన మార్పులు తీసుకొస్తుంది.

స్టాక్‌హోమ్‌లోని ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఇచ్చిన వివరాల ప్రకారం 2014–24 మధ్య ఇజ్రాయిల్ ఆయుధ ఎగుమతులలో 38 శాతం భారతదేశానికి వచ్చాయి. ఇజ్రాయిల్ నుండి అత్యధికంగా ఆయుధాలు కొనుగోలు చేస్తున్న దేశాలలో భారతదేశం ఒకటిగా ఉన్నది.

రెండు దేశాల జాతీయ భద్రతా సలహాదారుల పర్యవేక్షణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృది చేసుకోవటానికి చొరవ తీసుకోవాలని ఈ పర్యటన సందర్భంలో అంగీకరించారు. ఇది ఈ రంగాలలో ఉభయుల సామర్థ్యాన్ని, భవిష్యత్‌లో తమ సహకారాన్ని మరింత పెంచుతుందని ప్రకటించారు. రెండు పక్షాలు ఈ చొరవను ముందుకు తీసుకుపోవటానికి తీవ్రంగా కృషి చేయాలని నాయకులు చెప్పారు.

గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న దాడులతో ఆగిపోయిన భారతదేశం–మధ్య ప్రాచ్యం–తూర్పు యూరప్ దేశాల (ఐఎంఇసి)మధ్య ఆర్థిక, మౌలిక సదుపాయాల నిర్మాణం, నిర్వహణలో సహకారాన్ని గురించి కూడా మోడి ప్రస్తావించారు. రైలు, ఓడల రవాణా ద్వారా భారతదేశం, పశ్చిమాసియా, యూరప్ దేశాలను కలిపే మౌలిక అవసరాల నిర్మాణం గురించి 2023 సెప్టెంబరు 9న న్యూఢిల్లీలో జరిగిన జి–20 అగ్రనాయకుల సమావేశంలో ప్రకటించారు. రైళ్ళు, ఓడలు, రోడ్డుమార్గం ద్వారా సరుకులు, సేవల వాణిజ్యం నిరాటంకంగా జరగటం కోసం ఉద్దేశించిన ఈ ప్రాజెక్టులో భారతదేశం, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌది అరేబియా, జోర్డాన్, ఇజ్రాయిల్, గ్రీస్ ఉన్నట్లు వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు.

12యు2 గ్రూపుగా పేర్కొనబడే భారత్, ఇజ్రాయిల్, అమెరికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లను అభివృద్ధికి సహజమైన వేదికగా మోడీ పేర్కొన్నారు. దీనికి ప్రతిగా “హెగ్జాగన్” భావనను – భారతదేశం, గ్రీస్, సైప్రస్, ఇంకా పేరు తెలియని మరికొన్ని దేశాలతో కలిపి “తీవ్రవాద సున్ని, షియా కూటమి” కి వ్యతిరేక కూటమిని ఏర్పాటు చేయాలని– నెతన్యాహు ప్రతిపాదించాడు. ఈ కూటమిని ప్రతిపాదించటం ద్వారా ఈ ప్రాంతంలోని సౌది అరేబియా, ఖటార్, ఇరాన్, టర్కీ, భారతదేశానికి పొరుగునే ఉన్న పాకిస్తాన్ దేశాల పేర్లు ఉదహరించకుండానే వాటికి వ్యతిరేకంగా ఉన్నట్లు స్పష్టం చేశాడు.

ఇజ్రాయిల్‌తో మిత్రుత్వం కోసం సౌది అరేబియా లేదా ఇరాన్ పట్ల శత్రువైఖరిని అవలంభించటం వలన భారతదేశం అనేక చిక్కులను ఎదుర్కోవటంతో పాటు, భారీగా మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. భారతదేశం చారిత్రకంగా ఇరాన్‌తో సత్సంబంధాలను కొనసాగిస్తూ, చాబహార్ పోర్టు లాంటి వ్యూహాత్మకమైన ప్రాజెక్టులలో పెట్టుబడులు పెట్టింది. ఇజ్రాయిల్‌తో వ్యవస్థాగత సంబంధాలు పెంపొందించుకొంటే భారతదేశంపై వత్తిడి పెరుగుతుంది. తన వ్యూహాత్మక ప్రయోజనాలను కాపాడుకోవటంతో పాటు, మోడి చేసిన ఇజ్రాయిల్ పర్యటన వలన భారతదేశం ఇరాన్‌కు వ్యతిరేకంగా ఉందన్న భావం పెరగకుండా చూసుకోవాలి.

ఇజ్రాయిల్‌తో భారతదేశ సంబంధాలు మరింతగా బలపడితే ఇరాన్‌తో సంబంధాలను కాపాడుకొనే సమస్య ముందుకు వస్తుంది. పశ్చిమాసియా విధానం బహుళ శక్తులతో సంబంధాలను కొనసాగించటం కాకుండా, క్రమంగా ఒక క్యాంపు వైపుకు మారిపోవటంగా మారుతున్నది.

పర్యటన రెండవ రోజున రెండు దేశాల మధ్య ఆర్థిక, రక్షణ, రాయబార సంబంధాల పెంపుదలకు జరుగుతున్న 16 ఒప్పందాలపై సంతకాలు చేయటాన్ని మోడి, నెతన్యాహు పర్యవేక్షించారు. వ్యవసాయం, భూ పరిశోధన, వారసత్వ సాంప్రదాయాలు, సైన్స్, విద్య, ఆర్థిక, సైబర్ సహకారం, సాంకేతిక పరిజ్ఞానం, రక్షణ, కృత్రిమ మేధ ఒప్పందాలపై సంబంధిత శాఖలకు చెందిన ఉభయ దేశాల మంత్రులు, ఇజ్రాయిల్‌లో భారత రాయబారి జె పి సింగ్ సంతకాలు చేశారు.

“ఇక్కడ సమావేశంలో కలిసిన మనసులు, హృదయాలు ముఖ్యమైన జి2జిలో కూడా ఈ విధంగానే ఉంటాయని, మన ఉభయులతో పాటు మానవాళికి మరింత ప్రయోజనం కలిగించే విధంగా ఈ ఒప్పందాలు

ఉంటాయని" నెతన్యాహు చెప్పాడు.

### నెతన్యాహుకు విలువ కల్పించటం

అంతర్గత రాజకీయాలు, ప్రజల ఆగ్రహం, న్యాయపరమైన అంశాలతో అనేక పశ్చిమ దేశాలు గాజాలో జరుగుతున్న మారణకాండపై ఇజ్రాయిల్‌కు దూరంగా ఉంటున్న వేళ మోడి పర్యటన ఇజ్రాయిల్ నాయకత్వానికి ప్రాముఖ్యత కల్పించింది. ఇజ్రాయిల్ ఒంటరి కాలేదని, యూరప్–అట్లాంటిక్ ప్రాంతాల అవతల కూడా దానికి మిత్రులున్నారనటానికి రుజువుగా మోడి పర్యటన ఉపయోగపడింది. ''నూతన ఆవిష్కరణలు, ప్రజాస్వామ్యం'' గురించి చెపుతున్న భాషను అంతర్జాతీయంగా కూడా ఉపయోగించారు.


"అంతర్గత రాజకీయాలు, ప్రజల ఆగ్రహం, న్యాయపర మైన అంశాలతో అనేక పశ్చిమ దేశాలు గాజాలో జరుగుతున్న మారణ కాండపై ఇజ్రాయిల్‌కు దూరంగా ఉంటున్న వేళ మోడి పర్యటన ఇజ్రాయిల్ నాయకత్వానికి ప్రాముఖ్యత కల్పించింది. ఇజ్రాయిల్ ఒంటరి కాలేదని, యూరప్-అట్లాంటిక్ ప్రాంతాల అవతల కూడా దానికి మిత్రులున్నారనటానికి రుజువుగా మోడి పర్యటన ఉపయోగపడింది. "నూతన ఆవిష్కరణలు, ప్రజాస్వామ్యం" గురించి చెపుతున్న భాషను అంతర్జాతీయంగా కూడా ఉపయోగించారు."

1970వ దశాబ్దంలో ముడి చమురు ఉత్పత్తి చేసే అరబ్ దేశాలు ఇజ్రాయిల్‌కు చమురు సరఫరా చేయటానికి నిరాకరించాయి. ఇరాన్‌లో జరిగిన విప్లవంతో చమురు సరఫరా మార్గాలు భద్రత లేనివిగా మారాయి. 1979లో నార్వే సముద్ర సరిహద్దుల లోపల గణనీయమైన మోతాదులో ముడి చమురు నిల్వలను కనుగొన్నపుడు, పలుకుబడి కలిగిన యూదు సంస్థలు, అమెరికా ఇజ్రాయిల్‌కు ముడి చమురు సరఫరా చేయమని వత్తిడి చేశాయి. కాని ప్రధాని ఓడ్వర్ నార్డ్లీ నిర్ణయం తీసుకొనే ముందు పాలస్తీనా విమోచనా సంస్థ నాయకుడు యాసిర్ ఆరాఫత్‌తో సంప్రదించాడు.

ఇజ్రాయిల్ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అయినా తనకు కావలసిన ముడి చమురును పొందుతుందని, కానీ నార్వే తనకున్న ఆధిక్యతను ఉపయోగించి, పాలస్తీనాతో చర్చలు జరిపేలా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి చేయాలని పరిస్థితిని సమగ్రంగా అంచనా వేసి ఆరాఫత్ చెప్పాడు. 14 సంవత్సరాల తర్వాత ఈ సంబంధాలు రెండు దేశాల ఏర్పాటుకు, ఆరాఫత్ పాలస్తీనా తిరిగి రావటానికి అంగీకరించిన ఓస్లో ఒప్పందానికి దారితీశాయి.

''పరస్పర విశ్వాసం లేకపోవటం, సెటిల్‌మెంట్లను విస్తరించటం, రాజకీయ కల్లోలాల కారణంగా ఓస్లో ఒప్పందం అమలు జరగలేదు. కాని ఇజ్రాయిల్‌తో స్నేహం ఉన్న ఒక చిన్న దేశం పాలస్తీనాతో చర్చలు జరిపేలా ఆ దేశాన్ని ఒప్పించిందన్న వాస్తవం నిలిచి ఉంటుంది" అని మజ్‌దలాని చెప్పాడు.

పెద్ద ఆర్థికవ్యవస్థతో, ఇజ్రాయిల్ నుండి ఎక్కువగా ఆయుధాలు కొనుగోలుచేస్తూ, ప్రపంచ రంగస్థలంపై ముఖ్యమైన పాత్ర నిర్వహించాలని భావిస్తున్న భారతదేశం నార్వే కన్నా ఎక్కువ చేయగలదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. రక్షణ సాంకేతికాభివృద్ధి రంగంలో ఇజ్రాయిల్‌తో భారతదేశ సంబంధాలు చాలా లోతుగా, విస్తృతంగా ఉన్నాయి. తమ శక్తికి అనుగుణంగా రాజకీయ పాత్ర నిర్వహించే అవకాశం పాలస్తీనియన్లకు కల్పించాలని నిశ్శబ్దంగా ప్రయత్నం చేస్తూ, అందరి సమస్యలపై మాట్లాడగలిగిన శక్తి భారతదేశానికి ఉందని భావిస్తున్నారు.



ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు విష కౌగిలిలో నరేంద్ర మోడీ

కేవలం ఒప్పందాల ద్వారా మాత్రమే కాకుండా, ఒక నాయకుడు తన పలుకుబడిని ఉపయోగిస్తున్న తీరు కూడా రాజకీయ చతురతను వ్యక్తం చేస్తుంది. నెసెట్‌లో ఉపన్యసించి జవియా అల్ –హిందియా మసీదుకు వెళ్ళకుండా తప్పించుకోవటం, యద్ వాషెమ్, ఇజ్రాయిల్ నూతన ఆవిష్కరణలకు కాలం వెచ్చించటం ఆ నాయకుడు ప్రస్తుత పరిస్థితుల పట్ల అసంతృప్తిగా ఉన్నాడని కానీ, పాలస్తీనా గౌరవాన్ని కాపాడే విధంగా వ్యవహరిస్తాడనే సందేశం కానీ ఇవ్వదు.

కారీ ఇటువంటి మాటలను ఆచితూచి మాట్లాడుతూ బెజమిన్ నెతన్యాహుకు దేశ రాజకీయాలలో ప్రాధాన్యతను, ప్రపంచ స్థాయిలో ఇజ్రాయిల్ విధానాలకు విలువ పెరిగేలా గరిష్టంగా పెట్టుబడుల ఒప్పందాలను మోడి చేసుకున్నాడని పశ్చిమాసియా రాజకీయ నేతలు భావిస్తున్నారు.

పాలస్తీనా స్వయం నిర్ణయాధికారం ప్రాతిపదికగా వలసవాదానికి వ్యతిరేకంగా భారతదేశం అనుసరించిన గత విదేశాంగ విధానానికి, గాజా, పశ్చిమ తీరంలోని పరిణామాలను పట్టించుకోకుండా ఇజ్రాయిల్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కోసం ప్రస్తుతం అనుసరిస్తున్న విధానానికి మధ్య దూరం పెరుగుతున్నది. ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్‌లో జరుగుతున్న పరిణామాలు, ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్ట్ తీసుకుంటున్న చర్యలపై ప్రపంచదేశాల పర్యవేక్షణ పెరుగుతున్న పరిస్థితులలో దౌత్య విధానాలను విస్తరించటం కష్టంగా మారుతున్నది. నాయకుడు ఒక దేశానికి మద్దతుగా నిలబడటం తమ దేశం సంపాదించిన ప్రతిష్ఠను ఖర్చు చేయటం లాంటిది. మోడీ దానిని ఇజ్రాయిల్‌లో ఖర్చు చేస్తున్నారు.

ఆయన జవియా అల్–హిందియా మసీదులోకి వెళ్ళి జెరుసలెంలో భారతదేశ బహుళత్వ జ్ఞాపకాలను కెమెరాలలో బంధించటానికి అవకాశం ఇచ్చి ఉండాల్సింది. దానిని ఇజ్రాయిల్ వ్యతిరేక చర్యగా భావించటానికి అవకాశం ఉండదని, అన్ని ప్రవాహాలలో విస్తరించిన తన దేశ గతాన్ని గుర్తు చేసుకుంటూ, ప్రపంచంలోని దక్షిణాది దేశాలకు నాయకత్వం వహించాలనే తన ఆకాంక్షను నిశ్శబ్దంగా వెల్లడించినట్లు అయ్యేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

(అనువాదం: ఎ కోటిరెడ్డి)

# అనియత భారత్...అస్థిర ఉపాధి


రచయిత బ్రిటన్‌కు చెందిన సోషలిస్టు ఈక్విటీ పార్టీ జాతీయ మండలి సభ్యురాలు

**జీన్ షావుల్**

అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) 'ఉపాధి-సామాజిక ధోరణులు 2026' అన్న శీర్షికతో ఇటీవల వెలువరించిన నివేదిక నేడు ప్రపంచంలో అత్యధిక కార్మికులు ఎదుర్కొంటున్న దారుణమైన పని పరిస్థితులకు సంబంధించిన స్పష్టమైన చిత్రాన్ని మన ముందుంచింది. ప్రపంచ వ్యాపితంగా 360 కోట్ల మంది అనియత కార్మికులుంటే ఒక్క భారత్‌లోనే 210 కోట్లకు పైగా (60శాతం దాకా) ఉన్నారని అది కుండబద్దలు కొట్టింది. వీరంతా అతి తక్కువ వేతనం, క్యాజువల్ లేబర్‌గా అమానుషమైన పరిస్థితుల మధ్య పనిచేస్తున్నారు. వీరికి ఎలాంటి సామాజిక భద్రత కానీ, చట్టపరమైన హక్కులు కానీ, ఉద్యోగ భద్రత కానీ ఉండదు. ఆరోగ్యం బాగాలేకున్నా సిక్ లీవ్ దొరకదు, వైద్య సదుపాయం కానీ, అశక్తులైనవారికి బీమా కానీ ఉండదు. నిరుద్యోగ భృతి, పించను వంటి వాటి గురించి మరచిపోవాల్సిందే.

గ్లోబల్ సౌత్ అంటే వర్ధమాన, పేద దేశాల్లో ఉపాధి చాలా వరకు అనియత లేదా క్యాజువల్ రంగంలోనే ఉంటుంది. సబ్ సహరన్ ఆఫ్రికా దేశాలలో ఈ అస్థిర ఉపాధి 90 శాతం దాకా ఉంది. దక్షిణ, ఆగ్నేయాసియాలోనూ ఇదే పరిస్థితి. దారుణమైన పని పరిస్థితులకు తోడు తీవ్ర పేదరికం వంటి సమస్యలు వీరిని మరింత కుంగదీస్తున్నాయి.

అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లోను అస్థిర ఉపాధి పెరుగుతోంది. అక్కడ వలసకార్మికులను వ్యవసాయం, సంరక్షణ (కేర్), ఆతిథ్యం, నిర్మాణ రంగాల్లో ఎక్కువగా వినియోగిస్తుంటారు. ప్లాట్ ఫామ్ లేదా గిగ్ ఎకానమీ ద్వారా లాజిస్టిక్స్, డెలివరీలో 'ఆఫ్ ది బుక్స్' సబ్ కాంట్రాక్టింగ్ విధానం జోరందుకుంది. ఒక మాదిరి, అల్పాదాయ దేశాల్లో వేతన చెల్లింపులు మామూలుగానే తక్కువ. ఈ ధోరణి ఇప్పుడు మరింతగా పెరిగిపోయింది. అధికాదాయ దేశాల్లోనూ క్యాజువల్ లేబర్‌ను డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా ఉపయోగించే ధోరణి విస్తరిస్తోంది. వీరిని స్వయం ఉపాధి కార్మికులుగా వర్గీకరించి చెల్లింపుల ప్రక్రియ ప్లాట్‌ఫామ్స్ ద్వారా జరిగేలా చూస్తారు. వీరికి ఒప్పందాలు, నిర్దిష్ట పని గంటలు, సామాజిక భద్రత వంటివేమీ వర్తించవు. ఈ దారుణమైన పని పరిస్థితులు వ్యవస్థీకృతంగా, ఎలాంటి మార్పు లేకుండా అలానే ఇప్పటికీ కొనసాగుతున్నాయని ఐఎల్‌ఓ హెచ్చరించింది. కార్మికులు తరచూ ఇటువంటి అస్థిర నమూనాను ఎదుర్కొంటున్నారు. వారి పనివేళలు సక్రమంగా ఉండవు. డిమాండ్‌ను బట్టి ఎప్పుడు ఏ పని చేయమంటే అది చేయాలి. ఎప్పుడు పొమ్మంటే అప్పుడు పోవాలి. వీరి ఆదాయాలు అనిశ్చితంగా అనేక ఒడుదొడుకులకు గురవుతుంటాయి. ఒక్కొక్కసారి కనీస వేతనం కూడా వీరికి దక్కదు. ప్లాట్‌ఫామ్ అల్గారిథమ్స్ ఏకపక్షంగాను, గందరగోళంగాను ఉంటాయి. కార్మికులకు సరిగా జీతాలు ఉండవు. పని దొరకడమూ కష్టమవుతుంది. స్తబ్దత నెలకొన్నా దాని గురించి గట్టిగా మాట్లాడలేని పరిస్థితి. ఈ పెళుసుతనం తక్కువ అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలకు మాత్రమే పరిమితం కాదు. అధికాదాయ దేశాల్లో ప్లాట్‌ఫామ్ కార్మికులు వేగంగా విస్తరిస్తున్నారు. యువతకు, వలసకార్మికులకు స్థిరమైన ఉద్యోగాలు ఇప్పటికీ అందని ద్రాక్షగానే మిగిలిపోయాయి. ఈ రోజు లేబర్ మార్కెట్‌ను అభద్రతతో కూడిన రిజర్వు కార్మిక సైన్యం ముంచెత్తుతోంది.

క్యాజువల్ కార్మికులపై ఎక్కువగా ఆధారపడే పరిశ్రమలు, రంగాల్లో ముఖ్య మైనవాటి గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

**వ్యవసాయం:** క్యాజువల్ కార్మికులకు ఉపాధి కల్పించే అతి పెద్ద యజమానిగా ఈ రంగం ఉన్నది. ఇక్కడ కాలానుగుణమైన (సీజనల్), ఫ్యామిలీ లేబర్ వివరాలేవీ నమోదుకావు.

**నిర్మాణ పరిశ్రమ**: ఇక్కడ దీర్ఘకాలిక సబ్ కాంట్రాక్టింగ్ చెయిన్ ఉంటుంది. కార్మికుల భద్రతకు సంబంధించి ఉన్న కొద్దిపాటి నిబంధనలు, నియంత్రణలు సైతం పాటించరు.

**మైనింగ్:** ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 80 దేశాలలో 4.5 కోట్ల నుండి 5 కోట్ల మంది దాకా చేతి పనిముట్లతో పనిచేసేవారున్నారు. గనుల తవ్వకాల్లో చిన్న తరహా మైనింగ్ కార్మికులు పాల్గొంటారు. పరోక్షంగా ఈ రంగం (సేవలు, సప్లయి చెయిన్, స్థానిక ఆర్థిక వ్యవస్థ) పై ఆధారపడి మరో 2.7 కోట్ల మంది జీవనం సాగిస్తున్నారు.

**దుస్తులు, వస్త్ర పరిశ్రమ:** ప్రపంచ సప్లయి చెయిన్స్, ఇంటి దగ్గర నేత, చిన్న చిన్న కార్ఖానాలపై ఈ రంగం ఎక్కువగా ఆధారపడి ఉంటుంది.

**చిల్లర వర్తకం, టోకు వ్యాపారం:** వీధి విక్రేతలు, మార్కెట్ వ్యాపారులు, చిన్న దుకాణాదారులు చాలా దేశాల్లో పంపిణీకి వెన్నెముకగా నిలుస్తారు.

**రవాణా, లాజిస్టిక్స్:** ప్రజా రవాణా (పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు) అందరికీ అందుబాటులో లేని లోటును అసంఘటిత రంగంలోని టాక్సీలు, ట్రక్కర్లు, డెలివరీ సేవలు కొంతమేర భర్తీ చేస్తున్నాయి.

**ఇంటి పని, పిల్లల సంరక్షణ:** మహిళలు అత్యధికంగా పాల్గొనే అనియత ఆర్థిక వ్యవస్థల్లో ఇదొకటి.

**పెరుగుతున్న లాభాలు-తగ్గుతున్న కార్మిక వాటా:**

ఒక వైపు కార్మికుల ఆదాయాల్లో ఎలాంటి ఎదుగూ బొదుగూ లేకపోవడమో, తగ్గిపోవడమో జరుగుతుంటే, ఇంకో వైపు కార్పొరేట్ల లాభాలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న వైనం మనకు కనిపిస్తుంది. గ్లోబల్ సప్లయి చెయిన్, అవుట్ సోర్సింగ్ వంటి పద్ధతులే దీనికి ఆజ్యం పోస్తున్నాయి. దళారీ సంస్థలు శ్రమ విలువను కారు చౌకగా కొట్టేయడమే గాక, పన్నులను ఎగవేసి ఆ డబ్బును పన్ను స్వర్గధామాలకు పెద్దయెత్తున తరలించడం ఇందుకొక ముఖ్య కారణమని నిపుణులు చెబుతున్నారు.

**వర్ధమాన దేశాల్లోని మధ్య దళారీలు, సంపన్న దేశాల్లోని బహుళజాతి సంస్థలు ఈ విద్యలో బాగా ఆరితేరాయి**

ఉత్పత్తిలో నిరంతర వృద్ధి ఉన్నప్పటికీ 2025లో లేబర్ గ్లోబల్ వాటా విలువ అంతకుముందుతో పోల్చితే పడిపోయింది. 2019లో కార్మిక వాటా విలువ 53 శాతం ఉండగా, ఇప్పుడది 52.6 శాతానికి పడిపోయింది. దీనిని బట్టి ఏం అర్థమవుతుంది? కార్మిక వాటా దశాబ్దాలుగా అంతకంతకూ దిగజారుతున్నదనేది స్పష్టం. మరీ ముఖ్యంగా 1990 తరువాత ఈ పతనం మరింత జోరందుకుంది. ప్రపంచ జనాభాలో అత్యధిక శాతంగా ఉన్న కార్మిక, కర్షక వర్గం చెమటోడ్చి సృష్టించిన విలువలో అత్యధిక భాగం సంపన్నవర్గాలు కొట్టేస్తున్నాయనేది కాదనలేని సత్యం. ఈ లూటీ ఏటా పెరుగుతోంది. వర్గ అధికారం ఆర్థిక సామ్రాజ్యవాదుల చేతుల్లోకి మారుతున్న చారిత్రిక క్రమాన్ని ఇది సూచిస్తోంది. కార్మికుల్లో చాలా మందికి నిజ వేతనాలు చాలా నెమ్మదిగా పెరగడమో, అసలు పెరగకపోవడమో జరుగుతోంది. అల్పాదాయ దేశాల్లో పరిస్థితి మరీ దారుణం. ఈ ధోరణి దశాబ్దాలుగా కొనసాగుతున్నది. 2022-24 సంవత్సరాల మధ్య ద్రవ్యోల్బణం తీవ్రంగా ఉన్న సమయంలో సైతం నిజవేతనాల్లో మెరుగుదల చాలా అథమ స్థాయిలో ఉంది. ద్రవ్యోల్బణం పెరుగుదల వల్ల తమ లాభాలకు ఎలాంటి ధోకా లేకుండా చూసుకునేందుకు కార్పొరేట్లు కార్మికుల నిజవేతనాల్లో కోత పెట్టాయి.

> **"అధిక నిరుద్యోగం, బలహీనమైన సంఘటిత లేబర్ మార్కెట్లు, పెద్ద యెత్తున యువ జనాభా కలిగి ఉన్న ప్రాంతాల్లో గిగ్ వర్కు వేగంగా విస్తరిస్తోంది. ఈ రంగం 2034 నాటికి 2.1 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోవచ్చని ఓ అంచనా. నేడు అమెరికా అతి పెద్ద జాతీయ గిగ్ నెట్‌వర్కును కలిగి ఉంది. 7.64 లక్షల మంది లేదా మొత్తం శ్రామిక శక్తిలో 36 శాతం మంది ఆదాయం 1.2 లక్షల కోట్ల దాకా ఉంటుంది."**

### విస్తరిస్తున్న అనియత రంగం, ఉపాధి లేమి

అనేక దేశాల్లో అనియత రంగం, క్యాజువల్ లేబర్‌ను తీసుకునే ధోరణి పెరుగుతోంది. 2026లో ప్రపంచ నిరుద్యోగం 18.6 కోట్లకు చేరినట్లు ఒక అంచనా. కార్మిక శక్తిని తగినంతగా వినియోగించుకోవడంలో వెనుకబాటు, ఉద్యోగాల కొరత వంటి వాటిని పరిగణనలోకి తీసుకుంటే నిరుద్యోగుల సంఖ్య 40 కోట్ల పై మాటే. ఉత్తర అమెరికాలోనూ నిరుద్యోగం పెరుగుతోంది. క్యాజువల్ లేబర్ విధానం అమలులో డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఇప్పుడు కీలక పాత్ర పోషిస్తోంది. ఊబర్, డెలివరూ, అప్‌వర్కు, ఫైవర్, అమెజాన్, మెకానిక్ టర్క్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో దాదాపు 15.4 కోట్ల మంది కార్మికులు పనిచేస్తున్నారు. పని ఆఫ్‌లైన్‌లో ఉన్నపుడు కూడా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా శ్రమను కేటాయించడం, నిర్వహించడం, సంప్రదింపులు జరపడం వంటివి చేయాల్సి వస్తోంది. ఈ విధమైన కార్మికులు 43.5 కోట్ల మంది దాకా ఉంటారు.

ప్లాట్‌ఫామ్ లేబర్ అనేది ఒక సామూహిక గ్లోబల్ కార్మిక నిర్వహణ వ్యవస్థగా మారిపోయింది. ఇది మిగులు శ్రమను పీల్చడం, వేతనాలు కుదించడం, దశాబ్దాల పోరాటం ద్వారా సాధించుకున్న హక్కులను హరించి వేయడం, శ్రమ దోపిడీకి అనువుగా లేబర్ మార్కెట్‌ను సడలించడం వంటి వాటిని ఆచరణలో పెట్టడంలో కీలక సాధనంగా మారింది.

అధిక నిరుద్యోగం, బలహీనమైన సంఘటిత లేబర్ మార్కెట్లు, పెద్ద యెత్తున యువ జనాభా కలిగి ఉన్న ప్రాంతాల్లో గిగ్ వర్కు వేగంగా విస్తరిస్తోంది. ఈ రంగం 2034 నాటికి 2.1 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోవచ్చని ఓ అంచనా. నేడు అమెరికా అతి పెద్ద జాతీయ గిగ్ నెట్‌వర్కును కలిగి ఉంది. 7.64 లక్షల మంది లేదా మొత్తం శ్రామిక శక్తిలో 36 శాతం మంది ఆదాయం 1.2 లక్షల కోట్ల దాకా ఉంటుంది. అయినప్పటికీ కెనడా, ఆస్ట్రేలియా, జపాన్, దక్షిణ కొరియాల్లోని ప్లాట్‌ఫామ్ కార్మికుల్లో అత్యధిక భాగం యువకులు, వలసకార్మికులే. ప్లాట్‌ఫామ్ వర్కులో రైడ్ హెయిలింగ్, డెలివరీ, కేర్ వర్కు, డిజిటల్ ఫ్రీలాన్సింగ్ వేగంగా విస్తరిస్తోంది. యూరప్‌లో అత్యంత అభివృద్ధి చెందిన ప్లాట్‌ఫామ్ ఆర్థిక వ్యవస్థలు ఊబెర్, డెలివరూ, జస్ట్ ఈట్, అమెజాన్‌తో సహా అనేక ఫ్రీలాన్స్ ప్లాట్‌ఫామ్‌లు బ్రిటన్‌లో ఉన్నాయి. ఉపాధి స్థితి, హక్కులు, సంఘటితం కావడం వంటి అంశాలపై చట్టపరమైన వివాదాలను ఇవి తరచూ రేకెత్తిస్తున్నాయి.

### నయా ఉదారవాద విధానాలు- అనియత ఆర్థిక వ్యవస్థ పెరుగుదల

అనియత ఆర్థిక వ్యవస్థ విస్తరణ మూలాలు 1980లలో ప్రారంభమైన నయా-ఉదారవాద విధానాల్లో లోతుగా పాతుకుపోయి ఉన్నాయి. భారత్‌లో 1990ల నుండి అంటే ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ నిర్దేశిత వ్యవస్థాగత సర్దుబాటు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినప్పటి నుండి వెలువడిన ఐఎల్ఓ నివేదికలను క్షుణ్ణంగా పరిశీలిస్తే ఎలాంటి సామాజిక భద్రత లేని ముదనష్టపు అవుట్‌సోర్సింగ్ విధానాన్ని ప్రభుత్వాలు ఎలా ముందుకు తీసుకొచ్చిందీ స్పష్టమవుతుంది. 1979లో అమెరికాలో వడ్డీ రేట్లు విపరీతంగా పెరగడం, విదేశీ రుణ చెల్లింపులు తలకు మించిన భారంగా పరిణమించడం, ఎగుమతి ఆదాయాలు పడిపోవడం వీటన్నిటి పర్యవసానంగా ఏకంగా ప్రభుత్వాలే రుణ సంక్షోభంలో చిక్కుకున్నాయి. దీంతో కార్మిక శ్రమ దోపిడీ మరింత తీవ్రతరమైంది. దీనిలో భాగంగానే అవుట్‌సోర్సింగ్, ప్లాట్‌ఫామ్ సేవలు బలవంతంగా రుద్దబడ్డాయి.

ఈ చర్యలు లక్షలాది ప్రభుత్వ రంగ ఉద్యోగాలకు ఎసరుపెట్టాయి. కార్మికులను అనియత, స్వయం ఉపాధి వైపు నెట్టాయి. కార్మికుల సామూహిక బేరమాడే సామర్థ్యాన్ని హరించివేశాయి. ఈ చర్యలకు కార్మిక సంఘాల నుంచి ఎలాంటి తీవ్ర ప్రతిఘటన రాకుండా చూసేందుకు కార్పొరేట్ చట్టాన్ని మరింత కఠినతరం చేశాయి.

అదే సమయంలో ఎన్‌జివోలు తామర తంపరగా పుట్టుకొచ్చాయి. ముఖ్యంగా ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లో ఇవి ఎక్కువగా కనిపిస్తాయి. సర్దుబాటు, పునర్నిర్మాణం, అభివృద్ధి, సుపరిపాలన వంటి వాగాడంబర పదాలతో నయా-ఉదారవాద విధానాలను తెరపైకి తెచ్చినవారే ఈ ఎన్‌జివోలకు నిధులు సమకూర్చడం గమనార్హం. అప్పటివరకు రాజ్యం నిర్వహిస్తూ వస్తున్న విద్య, ఆరోగ్యం, ఆహార భద్రత వంటి సామాజిక బాధ్యతలను ఎన్‌జివోలు చేపట్టాయి. తద్వారా సార్వత్రిక హక్కులుగా ఉన్న వీటిని పథకాల స్థాయికి దిగజార్చాయి. అనియత రంగాన్ని విస్తరించాయి. పేదలకు సూక్ష్మ రుణాలు , జీవనోపాధి, మహిళా సాధికారత, ఇంటికో వ్యాపారవేత్త వంటి

> "ట్రంప్ ప్రభుత్వం ఎడాపెడా విధించిన సుంకాలు ప్రపంచ వ్యాపితంగా ఉపాధికి పెనుముప్పుగా పరిణమించనున్నాయని ఐఎల్ఓ హెచ్చరించింది. 2024 లెక్కల ప్రకారం ఎగుమతులు, సంబంధిత సప్లయి చెయిన్ల ద్వారా 80 దేశాల్లో దాదాపు 46.5 కోట్ల ఉద్యోగాలు విదేశీ డిమాండ్‌పై ఆధారపడి ఉన్నాయి. ఈ సుంకాల వల్ల ఆ అవకాశాలు ఆవిరైపోయే ప్రమాదముందని ఐఎల్ఓ హెచ్చరించింది."

నినాదాలను విస్తృతంగా ప్రచారంలో పెట్టాయి. వ్యవస్థాగత సర్దుబాటు కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు, అలాగే అనియత రంగంలో తీవ్ర దోపిడీకి గురవుతున్న కార్మికులు, ఇతర దగాపడిన ప్రజానీకాన్ని మాటల గారడీతో అవి బురిడీ కొట్టిస్తున్నాయి.

నయా-ఉదారవాద విధానాలను చట్టబద్ధం చేసేందుకే ఎన్‌జివోలు, యుఎస్ ఎయిడ్ వంటి 'సహాయ' పరిశ్రమను తెరపైకి తీసుకొచ్చాయి. కొన్ని రోజుల తరువాత యూరోపియన్ ప్రభుత్వాలు, ఇతర ప్రధాన ఆర్థిక వ్యవస్థలు సహాయాన్ని గణనీయంగా కుదించనారంభించాయి.

### పెరుగుతున్న నిరుద్యోగం-తగ్గుతున్న అవకాశాలు

యువతకు స్థిరమైన ఉపాధి అనేది నెరవేరని కలగానే మిగిలింది. అల్పాదాయ దేశాల్లో ఉపాధి అవకాశాలు ఒక పెద్ద సమస్యగా మారాయని ఐఎల్ఓ పేర్కొంది. 2025లో ప్రపంచ యువతలో నిరుద్యోగం 12.4 శాతానికి పెరిగింది. విద్య, ఉపాధి లేదా శిక్షణ (ఎన్ఇఇటి) లేని యువత 20 శాతం దాకా ఉంది. ఈ అంకెలు తీవ్ర అసమానతలకు సంబంధించిన వాస్తవిక పరిస్థితిని దాచిపెడుతున్నాయి. అధికాదాయ దేశాలతో పోల్చితే అల్పాదాయ దేశాల్లో ఈ అవకాశాల్లేని యువత 17 శాతం అధికంగా ఉంది.

ఉన్నత విద్య, ఇకపై సురక్షితమైన ఉపాధి లేక వేతనాలకు హామీ ఇవ్వదు. యూరప్‌లోని బార్లు, రెస్టారెంట్లలో పనిచేసేందుకు లాటిన్ అమెరికా నుండి వస్తున్న గ్రాడ్యుయేట్లు, మాజీ ఉపాధ్యాయుల సంఖ్య పెరుగుతోంది. స్వదేశంలో వృత్తిపరమైన పాత్రల కన్నా అక్కడ ఎక్కువగా సంపాదిస్తున్నారు. చదువుకున్న డిగ్రీలకు కార్మిక మార్కెట్‌కు మధ్య అంతరాలు ఎంతగా పెరిగిపోయాయో తెలుసుకోడానికి ఇదొక తిరుగులేని ఉదాహరణ.

అలా అని అధికాదాయ దేశాల్లో పరిస్థితి అంతా సవ్యంగానే ఉందని భావించరాదు. అక్కడ కూడా అవకాశాలు తగ్గుతున్నాయని ఐఎల్ఓ హెచ్చరించింది. ముఖ్యంగా కృత్రిమ మేధ (ఎఐ) వచ్చాక కార్మిక డిమాండ్‌ను తగ్గిస్తోందని విశ్వవిద్యాలయ గ్రాడ్యుయేట్లతో సహా యువ కార్మికుల ఉపాధి అవకాశాలను ఇది గణనీయంగా బలహీనపరుస్తుందని ఐఎల్ఓ హెచ్చరించింది.

ట్రంప్ ప్రభుత్వం ఎడాపెడా విధించిన సుంకాలు ప్రపంచవ్యాపితంగా ఉపాధికి పెనుముప్పుగా పరిణమించనున్నాయని ఐఎల్ఓ హెచ్చరించింది. 2024 లెక్కల ప్రకారం ఎగుమతులు, సంబంధిత సప్లయి చెయిన్ల ద్వారా 80 దేశాల్లో దాదాపు 46.5 కోట్ల ఉద్యోగాలు విదేశీ డిమాండ్‌పై ఆధారపడి ఉన్నాయి. ఈ సుంకాల వల్ల ఆ అవకాశాలు ఆవిరైపోయే ప్రమాదముందని ఐఎల్ఓ హెచ్చరించింది.

### కార్మిక రిజర్వు సైన్యం-పెట్టుబడిదారీ సంచయత తర్కం

నిరుద్యోగులు, అరకొర ఉపాధి మాత్రమే కలిగిన జనం ఎంత ఎక్కువగా ఉంటే అంత తక్కువగా వేతనాలిచ్చి వారితో అడ్డమైన చాకిరీ చేయించుకోవచ్చని, కార్మికులను ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు మార్చేయొచ్చని, కార్మికుల డిమాండ్లను తుంగలోతొక్కి యజమానులు తమ లాభాలను గరిష్టంగా పెంచుకోడానికి పెట్టుబడిదారీ వ్యవస్థ నిరంతరం యత్నిస్తూనే ఉంటుందన్న కారల్ మార్క్స్ మహాశయుని విశ్లేషణ నూటికి నూరు పాళ్లు సరైనదని పైన పేర్కొన్న నిర్ధారణలు రుజువు చేస్తున్నాయి.

### కార్మిక రిజర్వు సైన్యం

పెట్టుబడిదారీ విధానంలో నిరుద్యోగులు, అల్పాదాయం గలవారిని కార్మిక రిజర్వు సైన్యంగా మార్క్స్ అభివర్ణించాడు. ఇది యాదృచ్ఛికంగా ముందుకొచ్చిన సమస్య కాదు, పెట్టుబడిదారీ వ్యవస్థ పని తీరుకు సంబంధించిన ముఖ్యమైన అంశమిదని దీనినే సంచయిత సార్వత్రిక నియమంగా మార్క్స్ పేర్కొన్నాడు.

పెట్టుబడి పెరిగే కొద్దీ యంత్రాలు ఎక్కువగా వాడతారు. దీంతో ఉత్పత్తి కోసం అవసరమయ్యే కార్మికుల సంఖ్య సాపేక్షంగా తగ్గుతుంది. అంటే పెట్టుబడి సంచయితం అవసరానికి మించిన కార్మిక రిజర్వు సైన్యాన్ని సృష్టిస్తుంది. ఈ నిరుద్యోగ రిజర్వు సైన్యం పెరగడం వల్ల కార్మికుల మధ్య పోటీ పెరిగి, వేతనాలు తగ్గుముఖం పడతాయి. ఫలితంగా ఉద్యోగంలో ఉన్నవారు ఎక్కువ శ్రమ చేసి, తక్కువ వేతనాలు తీసుకునేలా ఒత్తిడికి గురవుతారు. దీనిని వేతనాల కదలికను నియంత్రించే మూల స్తంభంగా అభివర్ణించాడు.

మరో ముఖ్యమైన అంశం వ్యాపార చక్రాలతో ఈ సేన పరిమాణం మారుతూ వుంటుంది. బూమ్ బాగా వున్నప్పుడు ఉత్పత్తి పెరిగే కొద్దీ నిరుద్యోగులను పనిలో పెట్టుకోవడం, మాంద్యం వంటి పరిస్థితులు నెలకొన్నప్పుడు కార్మికులను బయటకు నెట్టేయడం వంటివి చేస్తుంది. ఈ హెచ్చుతగ్గులే కార్మికుల మనుగడను ప్రశ్నార్థకం చేస్తాయి.

మార్క్స్ ఈ సేనను నాలుగు భాగాలుగా విభజించాడు.

**1. తేలియాడే సేన (ఫ్లోటింగ్ రిజర్వు సేన):** సాధారణంగా పెద్ద ఫ్యాక్టరీలు, ముఖ్యమైన పరిశ్రమల్లో పని చేస్తూ మాంద్యం సమయంలో నిరుద్యోగులయ్యేవారు.

**2. స్తబ్ద సేన:** క్రమ రహితంగా చేసేవారు, తక్కువ జీతాలతో అస్థిరమైన ఉపాధి పొందేవారు..

**3. గుప్త సేన:** వ్యవసాయం వంటి రంగాల్లో వుండి అవసరమైతే పరిశ్రమల్లోకి రావడానికి సిద్ధంగా ఉండేవారు.

**4. పేదరికం:** పనిచేసే శక్తి కోల్పోయినవారు, అనాథలు, నిరాశ్రయులు వంటి అత్యంత దుర్భర స్థితిలో జీవిస్తున్నవారు.


శ్రమ దోపిడీని తీవ్రతరం చేసే అనిశ్చిత, అస్థిర ఉపాధికి మూలమైన నయా-ఉదారవాద విధానాలను తిప్పికొట్టాల్సిందే. ఈ రీత్యా గిగ్ ఎకానమీతో సహా దోపిడీ తీవ్రంగా ఉన్న అన్ని రంగాల్లోని కార్మికులను ఏకం చేసి మోడీ ప్రభుత్వ ముదనష్టపు విధానాలనకు వ్యతిరేకంగా పోరాడాలి.

**(అనువాదం: కె. గడ్డెన్న)**

చరిత్ర

# మధ్యయుగాల సంస్కృతి

## 13-15 శతాబ్దాల మధ్య కాలం



రచయిత ప్రజాశక్తి మాజీ సంపాదకులు

**ఎంవిఎస్ శర్మ**

మధ్య యుగాలను చీకటి యుగంగా హిందూత్వ వాదులు ప్రచారం చేస్తున్నారు. మరోపక్క బ్రిటిష్ పాలకుల కాలపు చరిత్ర రచనలు కూడా భారత ఉపఖండం యావత్తూ అనాగరిక దశలోనే అభివృద్ధి లేకుండా మగ్గిపోయిందని, బ్రిటిష్ వారు ప్రవేశించిన అనంతరమే అభివృద్ధి మొదలైందని ప్రచారం చేసుకున్నారు. అయితే స్వాతంత్ర్యానంతర కాలంలో అనేక పరిశోధనలు మధ్య యుగాలకు సంబంధించిన విలువైన సమాచారాన్ని వెలుగులోకి తెచ్చాయి.

అన్ని కాలాల్లోనూ ఉన్నట్టుగానే మధ్య యుగాల్లో కూడా అభ్యుదయ శక్తులకు, తిరోగామి శక్తులకు నడుమ సంఘర్షణలు జరిగాయి. అదే సమయంలో భిన్న సంస్కృతులకు చెందిన ప్రజలు ఆ సంఘర్షణల మధ్య జీవనయానాన్ని కొనసాగిస్తూనే సామరస్యంతో కలిసి జీవించే విధానాలను క్రమంగా ఆవిష్కరించుకోగలిగారు. ఆ క్రమంలో చెప్పుకోదగ్గ స్థాయిలో సాంస్కృతిక వికాసం జరిగింది. శాస్త్ర సాంకేతిక విజ్ఞానం ఏ విధంగా ఈ కాలంలో పురోగమించిందో గతంలోనే కొన్ని వ్యాసాలలో వివరించాము. ఇప్పుడు నిర్మాణ రంగం, మతం, భాష వంటి అంశాలలో మధ్య యుగాలలో భారత ఉపఖండంలో జరిగిన ముఖ్యమైన పరిణామాలను తెలుసుకుందాం.

మధ్య ఆసియా ప్రాంతం నుండి తొలుత పశ్చిమాసియా ప్రాంతానికి వలసలు పోయిన తురుష్కులు అక్కడ ఇస్లాం మతాన్ని స్వీకరించారు. ఆ తర్వాత అక్కడినుండి (ముఖ్యంగా ఇప్పటి టర్కీ ప్రాంతం నుండి) దఫదఫాలుగా భారత ఉపఖండంలోకి దాడులు చేయడానికి వచ్చిన తురుష్కులు క్రమంగా ఇక్కడే స్థిరపడి పాలకులుగా మారిన వైనాన్ని ఇంతకు ముందు వ్యాసాల్లో తెలుసుకున్నాం. అప్పటికి ఆఫ్రికా, ఐరోపా-ఆసియా ఖండాల మధ్య ఉన్న సూయజ్ జలసంధికి ఇరువైపులా ఉన్న దేశాల్లో ఇస్లాం ప్రబలంగా వ్యాపించింది. మొరాకో (ఉత్తర ఆఫ్రికా) నుండి స్పెయిన్ వరకూ, తూర్పు దిశగా ఇరాన్ వరకూ మధ్య ఉన్న ప్రాంతంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం బాగా అభివృద్ధి చెందింది. ఆసియా, ఐరోపా, ఆఫ్రికా ఖండాలను అనుసంధానించే సూయజ్ కాలువ మార్గం గుండా నౌకల ద్వారా ప్రయాణం, వాణిజ్యం బాగా పెంపొందాయి. అందుకు సంబంధించిన పరిజ్ఞానం కూడా అభివృద్ధి చెందింది. దానితోపాటు ప్రభుత్వ పాలన, కళలు, సాహిత్యం, భవంతుల నిర్మాణం వంటి రంగాలలో కూడా పురోగమించారు. ఇలా మెరుగైన స్థాయిలో పరిజ్ఞానం, అనుభవం ఉన్న తురుష్కులు భారత ఉపఖండం మీదకు దఫదఫాలుగా దండెత్తి వచ్చి ఇక్కడ స్థిరపడే క్రమంలో స్థానిక సంస్కృతితో తలపడ్డారు. దాడులకు, విధ్వంసానికి కూడా కొన్ని సందర్భాల్లో పూనుకున్నారు. ఈ క్రమంలో ఇక్కడున్న భారతీయులలో కూడా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, నిర్మాణ రంగ అనుభవం, ఉన్నత స్థాయిలోనే ఉన్నాయన్నది అనుభవపూర్వకంగా గ్రహించారు. అదే సమయంలో తురుష్కులవద్ద ఉన్న విజ్ఞానం, సాంకేతికతల విశిష్టత గురించి ఇక్కడ భారతీయులకు కూడా తెలియవచ్చింది. ఈ క్రమం సుదీర్ఘకాలం పాటు ఘర్షణల మధ్య కొనసాగింది. అది క్రమంగా పరస్పర అవగాహనకు, సహకారానికి దారి తీసింది. ఇరువైపులా అరాచకవాదం, సనాతన వాదం బలంగా నాటుకునిపోయివుండడం అనేది ఈ ప్రక్రియకు ఆటంకంగా ఉన్నప్పటికీ, ఆ క్రమంలోనే సాంస్కృతిక సమ్మేళనం కొనసాగింది.


**నిర్మాణశైలి**

అంతకు పూర్వం ఉన్న పాలకులు బౌద్ధ, జైన మందిరాలను, ఆరామాలను కూలగొట్టి విష్ణు మందిరాలుగా, శివాలయాలుగా మార్చితే, కొత్తగా వచ్చిన తురుష్కులు వాటిని మసీదులుగా మార్చారు. ఢిల్లీలో కుతుబ్ మినార్ సమీపంలో కువ్వత్-ఉల్-ఇస్లాం మసీదు అంతకు పూర్వ జైన మందిరం, తర్వాత అవి విష్ణు మందిరంగా మారింది. తర్వాత మసీదు అయింది. అజ్మీర్‌లో అర్హాయ్ దీన్ కా ఝోంప్రా అంతకు ముందు బౌద్ధ ఆరామంగా ఉండేది.

ప్రార్థనాస్థలాలమీద మానవుల, జంతువుల శిల్పాలను చెక్కడం ఇస్లాం మత సూత్రాలకు విరుద్ధం. కనుక వాటికి బదులు లతలను, పూవులను, ఖురాన్ బోధనలను చెక్కారు. కొద్ది కాలంలోనే కూల్చివేతలను నిలిపివేసి కొత్తగా భవనాలను నిర్మించడం ప్రారంభించారు. కొందరు పర్యవేక్షకులను పశ్చిమాసియా నుండి రప్పించినా, ఇక్కడ స్థానిక చేతివృత్తులవారినే ఎక్కువగా ఉపయో గించారు.

రోమన్లనుండి స్వీకరించిన ఆర్చీల, గోపురాల నిర్మాణాన్ని ఇక్కడ ఎక్కువగా తురుష్కులు ఉపయోగించారు. వీటి నిర్మాణానికి ఒక రకమైన చెక్కసున్నం అవసరం. నాణ్యమైన చెక్కసున్నం తయారీ తురుష్కుల నుండి ఇక్కడి స్థానికులు స్వీకరించారు. అప్పటికే ఆర్చీల, గోపురాల నిర్మాణం గురించి ఇక్కడి శిల్పులకు తెలిసినా, చెక్కసున్నం తయారీకి సంబంధించి అవసరమైన స్థాయిలో పరిజ్ఞానం లేనందున అటువంటి నిర్మాణాలకు ఎక్కువగా పోలేదు. ఇప్పుడు ఆ పరిజ్ఞానం తోడైంది. దాంతో భారీ కట్టడాల నిర్మాణం పురోగమించింది. నిర్మాణాల మీద ఖురాన్ సూక్తులను, పువ్వులను చెక్కడంతోబాటు, భారతీయులు ఉపయోగించే స్వస్తిక్, గంట, కమలం, ఆకులు వంటి చిహ్నాలను కూడా తురుష్కులు స్వీరించారు. ఎర్రగా ఉండే ఇసుకరాయిని, పాలరాయిని నిర్మాణాల్లో ఎక్కువగా ఉపయోగించారు.

> **❝ ఇస్లాంలో సూఫీలు - వీరినే బాబాలు అంటారు - ఆ మతం ఆవిర్భావ కాలంనుంచీ ఉన్నారు. రాజ్యానికి, సంపదలకు దూరంగా ఉంటేనే దైవానికి దగ్గర కాగలం అనేది వీరి భావన. అందుకే రాజ్యంతో ఎటువంటి సంబంధమూ లేకుండా ఉంటారు. సూఫీల విశాల దృక్పథం ఇస్లాంలోని సనాతన వాదుల ఆగ్రహానికి కారణమైంది. 10వ శతాబ్దం నాటి తొలి సూఫీ గురువుల్లో ఒకరైన మన్సూర్ బిన్ హల్లజ్‌ను సనాతనవాదులు ఉరి తీయించారు. ఐనప్పటికీ ముస్లిం ప్రజల్లో సూఫీ ఆలోచనలు విస్తరించాయి. ❞**



అమీర్‌ఖుస్రో, చైతన్యుడు, గురునానక్, కృష్ణదేవరాయలు

13వ శతాబ్దంలో తురుష్కులు నిర్మించిన అద్భుతమైన కట్టడం కుతుబ్ మినార్. ఇది 71.4 మీటర్ల పొడవున ఉంది. ఈ ధ్వజస్తంభాన్ని నిర్మించడంలో దానిలో గూళ్ళను కూడా చేర్చడం, ఎరుపు, తెలుపు రాళ్ళను డిజైన్‌గా అమర్చిన తీరు, పైభాగంలో పాలరాతి అలంకరణ, అన్నింటికీ మించి స్తంభాన్ని అలల ఆకారంలో నిర్మించడం కుతుబ్‌మినార్‌కు ప్రత్యేక ఆకర్షణలు. కుతుబుద్దిన్ భక్తియార్ అనే తన సూఫీ మతగురువు జ్ఞాపకార్థం దీనిని ఇల్తుమిష్ నిర్మించాడు.

ఆ తర్వాత అల్లావుద్దిన్ ఖిల్జీ ఈ మినార్‌కు ఒక ముఖద్వారాన్ని నిర్మించాడు. దానిని అలయ్ దర్వాజా అంటారు. ఎత్తైన ఆర్చీలతో, వాటిపైన విశాలమైన గోపురంతో ఆ నిర్మాణం చాలా వైభవంగా ఉండేది. గియాసుద్దిన్, మహమ్మద్ తుగ్ధఖ్‌ల కాలంలో తుగ్లకాబాద్ అనే భారీ రాజభవంతి సముదాయాన్ని నిర్మించారు. దాని చుట్టూ నీరు పారేందుకు యమునా నదికి ఒక ఆనకట్ట కట్టి ఆ నీటిని మళ్ళించారు. గియాసుద్దిన్ సమాధిని పాలరాతితో చాలా అందంగా నిర్మించారు. ఢిల్లీ సుల్తానుల రాజ్యం విచ్ఛిన్నమయేనాటికి దేశంలో చాలా చోట్ల నిర్మాణ కార్యక్రమాలు ముమ్మరంగా జరిగాయి. ఆయా ప్రాంతాల ప్రత్యేక నిర్మాణ శైలిని పెంపొందించారు. పాలకులు వైభవోపేతంగా విశాలమైన భవనాలను నిర్మించారు.

**సూఫీ ఉద్యమం**

తురుష్కులు భారత దేశానికి వచ్చేనాటికే ఇక్కడ ఇస్లాం మతం విస్తరించించివుంది. 8వ శతాబ్దంలో సింద్ ప్రాంతంలో, 10వ శతాబ్దంలో పంజాబ్ ప్రాంతంలో ఇస్లాం స్థాపన జరిగింది. ఆనాటికి అరబ్బులు కేరళలో స్థిరపడ్డారు. ఇస్లాం తత్వశాస్త్రం అభివృద్ధి చెందుతున్న రోజుల్లో దానిమీద భారతీయ, గ్రీకు తత్వశాస్త్రాల ప్రభావం తీవ్రంగా పడింది. ఆ ప్రభావమే సూఫీ ఉద్యమానికి నేపథ్యంగా పని చేసింది.

ఇస్లాంలో సూఫీలు - వీరినే బాబాలు అని అంటారు - ఆ మతం ఆవిర్భావ కాలంనుంచీ ఉన్నారు. రాజ్యానికి, సంపదలకు దూరంగా ఉంటేనే దైవానికి దగ్గర కాగలం అనేది వీరి భావన. అందుకే రాజ్యంతో ఎటువంటి సంబంధమూ లేకుండా ఉంటారు. సూఫీల విశాల దృక్పథం ఇస్లాంలోని సనాతన వాదుల ఆగ్రహానికి కారణమైంది. 10వ శతాబ్దం నాటి తొలి సూఫీ గురువుల్లో ఒకరైన మన్సూర్ బిన్ హల్లజ్‌ను సనాతనవాదులు ఉరి తీయించారు. అయినప్పటికీ ముస్లిం ప్రజల్లో సూఫీ ఆలోచనలు విస్తరించాయి.

12వ శతాబ్దం తర్వాత భారతదేశంలో సూఫీ ఉద్యమం విస్తరించింది. ఇటు ముస్లింలను, అటు హిందువులను కూడా ఒకే స్థాయిలో ప్రభావితం చేసింది. ఇరు మతస్తుల్నీ ఒకే వేదికపైకి తీసుకురాగలిగింది. కొన్ని హిందూ మతాచారాలను, యోగా వంటి పద్ధతులను సూఫీలు తమ వ్యవస్థలో అంతర్భాగం చేసుకున్నారు. సూఫీలు పాటించిన ఆరామాల పద్ధతి, పాప పరిహారం కోసం జపం, ఉపవాసం, ప్రాణాయామం వంటి ఆచారాలను పాటించడం బౌద్ధ, హిందూ మతాలు రెండింట్లోనూ కనిపిస్తాయి. సూఫీలు ఈ రెండు మతాలతో ప్రభావితమైనట్టు స్పష్టంగా మనకు తెలుస్తుంది. బుద్ధుడి గాథను సూఫీలు ఇస్లామిక్ గాథగా మార్చుకున్నారు. అమృత్‌కుండ్ అనే సంస్కృత గ్రంథాన్ని పార్శీలోకి అనువదించారు. అందులో యోగానికి సంబంధించిన అంశాలు చాలా ఉన్నాయి. సూఫీ సిద్ధాంతపు మూల సూత్రాలు ఖురాన్ నుంచే గ్రహించబడ్డాయి. కానీ హిందూ యోగుల పద్ధతులతో, దైవం పట్ల దృక్పథంలో,



మీరాబాయి, నామ్‌దేవ్

ఆచారాలలో చాలా భాగాన్ని సూఫీలు స్వీకరించారు. అందువల్లే పరమత సహనం, పరస్పర అవగాహన సాధ్యమయ్యాయి.

**చిష్టీ ఉద్యమం**

13, 14 శతాబ్దాలలో ఉత్తరభారతంలో చిష్టీ ఉద్యమం బాగా విస్తరించింది. క్రీ.శ 1192 లో ఖ్వాజా మొయినుద్దిన్ చిష్టి అనే బాబా భారతదేశానికి వచ్చాడు. ఇక్కడ కొంతకాలం ఢిల్లీ, లాహోర్‌లలో గడిపిన అనంతరం, అజ్మీర్‌కు మకాం మార్చాడు. అక్కడ అతడికి చాలా పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. ప్రజలు అతడిని దైవాంశతో పుట్టినవాడని నమ్మి పూజించేవారు. చిష్టీ గురువుల్లో నిజాముద్దిన్ ఔలియా, నసీరుద్దీన్-చిరాగ్-ఎ-ఢిల్లీ ప్రముఖులు. వీరు అన్ని వర్గాల ప్రజలతోనూ తేలికగా కలిసిపోయారు. హిందూ మతంలోని దిగువ కులాలవారితోనూ అదేవిధంగా కలిసిపోయారు. ప్రజల భాషల్లోనే వారితో సంభాషించేవారు. మత మార్పిడి పట్ల వారు దృష్టి ఎక్కువగా పెట్టలేదు. భక్తి సంగీతం చిష్టీల ప్రధాన సాధనం. ఆ సంగీతాన్ని “సమా’ అనేవారు. ఎక్కువ పాటలను హిందీలోనే రచించేవారు. ఆ విధంగా సామాన్య జనానికి చేరువయ్యారు.

చిష్టీలు ప్రబోధించిన మానవతావిలువలను సిక్కులు తమ ఆదిగ్రంథ్‌లో పేర్కొన్నారు.

సూఫీ ఉద్యమంలోని వివిధ శాఖలు బాబాలు రాజ్యంలో ప్రజల నడుమ సామర

స్యాన్ని నెలకొల్పడానికి తోడ్పడ్డారు. దానితోబాటు ప్రభుత్వం పట్ల ప్రజల్లో సదభిప్రాయాన్ని కూడా కలిగించగలిగారు. దాంతో శాంతిభద్రతలు ఏర్పడ్డాయి. ఈ కారణంగా పాలకులకు ఎంతో ప్రయోజనం కలిగింది.

నేటికీ దేశంలో పలు దర్గాల (సూఫీ బాబాల సమాధులు) దగ్గర జరిగే ఉత్సవాల్లో హిందువులు, ముస్లింలు అందరూ అరమరికలు లేకుండా పాల్గొంటారు.


**భక్తి ఉద్యమం**

తురుష్కుల రాకకు చాలా కాలం ముందే దేశంలో భక్తి ఉద్యమం విస్తృతంగా వ్యాపిస్తూవచ్చింది. వాస్తవంగా 7వ శతాబ్దంలోనే శైవులుగా ఉన్న నయనార్లు, వైష్ణవులైన ఆళ్వార్లు వ్యక్తిగతంగా భగవంతుడిని ఆరాధించడమే ముక్తికి మార్గం అన్న మూల సూత్రాన్ని ప్రచారంలోకి తెచ్చారు. అన్ని కులాలవారు, అన్ని వర్గాల వారు దైవాన్ని ఆరాధించే హక్కు కలిగివున్నారని ప్రచారం చేశారు. సాధారణ ప్రజానీకంలోకి ఈ భావాలను విరివిగా తీసుకుపోడానికి స్థానిక భాషల్లోనే వారు దైవారాధనను నిర్వహించారు. ఇలా స్థానిక భాషల్లో వారి సాహిత్యం ఉన్నందువల్లే ఉత్తరాదికి ఈ ఉద్యమం వ్యాపించ డానికి అది ఆటంకం అయింది. దక్షిణాది నుండి ఉత్తర భారతానికి భక్తి సందేశాన్ని తీసుకుపోయినవారిలో సంత్‌లు, విద్వాంసులు –ఈ రెండు తరహాలవారూ ఉన్నారు.

వారిలో మహారాష్ట్రకు చెందిన **నామ దేవ్** ముఖ్యుడు. 14వ శతాబ్దంలో జీవించిన నామదేవ్ వృత్తి రీత్యా దర్జీ. తర్వాత గజదొంగగా మారాడు. ఆ తర్వాత అతడు సాధువు అయాడు. మరాఠీ భాషలో నామదేవ్ రచించిన కవిత్వం అపారమైన అతడి భక్తి విశ్వాసాలను ప్రతిబింబిస్తుంది. ఇతడు ఢిల్లీలోని సూఫీ గురువులతో కూడా చర్చలు జరిపాడు. రామానుజుడి అనుచరుడైన **రామానందుడు** ప్రయాగకు చెందినవాడు. వివిధ కులాలవారు అందరూ కలిసి సామూహికంగా భోజనాలు చేయకూడదని ఉన్న నిషేధాన్ని తోసిపుచ్చాడు. అన్ని కులాలకూ చెందినవారిని తన శిష్యులుగా చేర్చుకున్నాడు. అతడి శిష్యుల్లో **రవిదాస్** చర్మకారుడు, **కబీర్** నేతపనివాడు, **సేన** మంగలి. **సాధన** కసాయి వృత్తి వాడు.

తురుష్కుల ఆధిపత్యం మొదలై, రాజపుత్రులు ఓటమిపాలవడంతో బ్రాహ్మణాధిపత్యం కూడా బలహీనపడింది. అదే సమయంలో కుల వ్యవస్థను, బ్రాహ్మణాధిపత్యాన్ని సవాలు చేస్తూ భక్తి ఉద్యమాలు

**“ దక్షిణాది నుండి ఉత్తర భారతానికి భక్తి సందేశాన్ని తీసుకుపోయినవారిలో సంత్‌లు, విద్వాంసులు -ఈ రెండు తరహాల వారూ ఉన్నారు. వారిలో మహారాష్ట్రకు చెందిన నామ దేవ్ ముఖ్యుడు. 14వ శతాబ్దంలో జీవించిన నామదేవ్ వృత్తి రీత్యా దర్జీ. తర్వాత గజదొంగగా మారాడు. ఆ తర్వాత అతడు సాధువు అయాడు. మరాఠీ భాషలో నామదేవ్ రచించిన కవిత్వం అపారమైన అతడి భక్తి విశ్వాసాలను ప్రతిబింబిస్తుంది. ”**



ఢిల్లీలోని కుతుబ్ మీనార్

దేశమంతటా ఊపందుకున్నాయి. సనాతన హిందూ మతంతో ఏమాత్రమూ తృప్తి చెందని ప్రజలు భక్తి ఉద్యమాన్ని పూర్తిగా బలపరిచారు. 15–16 శతాబ్దాల మధ్య భక్తి ఉద్యమం బాగా విస్తరించింది.

కుల వ్యవస్థను, సనాతన వాదులను తీవ్రంగా వ్యతిరేకించి హిందూ‌ముస్లిం ఐక్యతను గట్టిగా సమర్థించినవారిలో కబీర్, నానక్ అగ్రగణ్యులు. కబీర్ ఒక ముస్లిం నేత పనివాని ఇంట పెరిగాడు. తండ్రి వృత్తినే చేపట్టాడు. కాశీలో ఉన్నప్పుడు హిందూ, ముస్లిం సాధువులకు దగ్గరయాడు. రాముడు, హరి, అల్లా, ఇలా ఏ పేర్లతో పిలిచినా దేవుడు ఒక్కడే అని ప్రచారం చేశాడు. విగ్రహారాధన, తీర్థయాత్రలు, నదుల్లో పుణ్యస్నానాలు, పూజలను ఒక తంతులా నిర్వహించడం వంటి పద్ధతులను తీవ్రంగా వ్యతిరేకించాడు. కబీర్ లక్ష్యం ప్రేమ అనే మతాన్ని ప్రచారం చేయడం, తద్వారా అన్ని మతాల ప్రజలనూ కలపడం. అందుకు అడ్డంగా ఉన్న హిందూ–ఇస్లాం మత సూత్రాలను కబీర్ వ్యతిరేకించాడు. వర్ణ వ్యవస్థను కబీర్ తీవ్రంగా నిరసించాడు. కులం, మతం, వర్ణం రంగు ఆధారంగా వ్యక్తుల మధ్య వివక్షత చూపడం తప్పు అని ఎదిరించాడు. పేదవారితో సన్నిహితంగా మెలిగేవాడు.

భక్తికి మరో రూపమే ప్రేమ అని ప్రబోధించిన మరొక కవి, సంస్కర్త ఒడిశా–బెంగాల్ ప్రాంతవాసి అయిన **చైతన్యుడు.** రాధాకృష్ణుల మధ్య సంబంధం ఎటువంటి సామాజిక నియమాలతోనూ నిమిత్తం లేకుండా ఎలా ప్రేమ రూపంలో వ్యక్తమైందో అదే మాదిరిగా ప్రతీ భక్తుడూ, భక్తురాలూ దైవారాధనను ప్రేమతత్వంతో చేపట్టాలని ప్రచారం చేశాడు. తన ప్రచారానికి సంగీతాన్ని ప్రధాన సాధనంగా ఎంచుకున్నాడు. కుల, మత అంతరాలను నిరసించాడు.

ఇదే కోవలో **మీరాబాయి, నరసింహ మెహతా** (గుజరాత్), **సూరదాస్** (ఉత్తరప్రదేశ్) నడిచారు. శూద్రకులాలనుండి ఎక్కువమంది శిష్యులను వీరంతా తమ ఆశ్రమాల్లో చేర్చుకున్నారు.

1469లో జన్మించిన నానక్ రావీ నదిని ఆనుకునివున్న తల్వండి గ్రామంలో జన్మించాడు. పార్శీ భాషను అభ్యసించాడు. కానీ తండ్రి వృత్తి అయిన అకౌంటెన్సీని చేపట్టలేదు. ఎక్కువ సమయాన్ని సాధువులతో, సంత్‌లతో గడిపే వాడు. భక్తిగీతాలను రచించి ఆలపించే వాడు. తన ప్రబోధాలతో ఎక్కువమందిని ఆకర్షించాడు. శ్రీలంక, మక్కా, మదీనాలలో కూడా నానక్ ఎక్కువగా పర్యటించాడు.

అందరికీ ఒకే దైవం అనే సిద్ధాంతాన్ని నానక్ బలపరిచాడు. వ్యక్తిగత ప్రవర్తన విలువలతో కూడినదైవుండాలని చెప్పేవాడు. విగ్రహారాధన, తీర్థయాత్రలు వంటి తంతులను వ్యతిరేకించాడు. హిందూ, ముస్లిం మతస్తుల నడుమ దూరాన్ని తగ్గించాలని నానక్ అభిలషించాడు. ఈ క్రమంలోనే సిక్కు మతాన్ని స్థాపించాడు.

> **“ అరబిక్‌లోనే ముస్లిం సాహిత్యం ఎక్కువగా వచ్చింది. అటు స్పెయిన్ నుంచి ఇటు బాగ్దాద్ వరకూ అరబిక్‌నే ఉపయోగించే వారు. అయితే తురుష్కులు పార్శీ భాష పట్ల ఎక్కువ మక్కువను ప్రదర్శించారు. పార్శీలోనే పరిపాలనా వ్యవహారాలు, సాహిత్యం ఎక్కువగా సాగాయి. భారతదేశం లోని ముస్లిం విద్వాంసులవరకే అరబిక్ భాష పరిమితంగా ఉండేది. అయితే అరబిక్ భాషలో కూడా శాసనాలను రూపొందించేవారు. పార్శీ భాషలో ఫిరదౌసి, సాది వంటి గొప్ప కవులు ఎన్నో ఉన్నతమైన రచనలను చేశారు. ”**

అయితే, హిందూ, ఇస్లాం మతాలలో ఉన్న సనాతనవాదులు ఈ భక్తి ఉద్యమాన్ని స్వీకరించి అనుసరించారని, ఈ ఉద్యమాలు ప్రబోధించిన మార్పులను ఆహ్వానించారని చెప్పడానికి లేదు. ఛాందస శక్తులన్నీ ఏకమై సనాతన ధర్మ రక్షణకు పూనుకున్నారు. కొన్ని నియమ నిబంధనలను సడలించి తిరిగి బ్రాహ్మణాధిపత్యంతో కూడిన ధర్మాన్నే అనుసరించడం ప్రారంభించారు. ఇదే మాదిరిగా ఇస్లాం మతఛాందసవాదులు కూడా వ్యవహరించారు. అయితే, భక్తి ఉద్యమాల ప్రభావం సమాజం మీద నేటికీ బలంగానే ఉంది.

### సాహిత్యారాలలితకళలు

**సంస్కృత సాహిత్యం :** సాహిత్యానికి ప్రధాన మాధ్యమంగా సంస్కృతమే ఉండేది. ఉపఖండంలో సంస్కృత వాడుకభాషగా అతి తక్కువ శాతం ప్రజానీకం ఉపయోగించి నప్పటికీ దానినే ప్రధాన మాధ్యమంగా పండితులు, కవులు, తత్వవేత్తలు ఉపయోగించారు. బహుశా ప్రాంతీయ పరిమితులను దాటి తమ భావాలకు ప్రచారం లభించాలన్న ఉద్దేశ్యం ఉండవచ్చు. కుల వ్యవస్థ అత్యధికులుగా ఉండే శూద్రులను, అస్పృశ్యులను, మహిళలను విద్యకు దూరం చేయడం కూడా ప్రాంతీయ భాషల కన్నా సంస్కృతానికి ప్రాధాన్యత పెంచింది. రామాయణ, మహాభారత గ్రంథాలు ఇప్పుడు లభిస్తున్నవి దాదాపుగా 11వ, 12వ శతాబ్దాలలో రాయబడినవే. తత్వ శాస్త్రం, కవిత్వం. నాటకం, వైద్యం, ఖగోళ శాస్త్రం, సంగీతం ఈ కాలంలో ఎక్కువగా వెలువడింది. సంస్కృత సాహిత్యం ఎక్కువగా వెలువడింది మాత్రం దక్షిణభారతంలోనే. దాని తర్వాత బెంగాల్, మిథిల, పశ్చిమ భారతం ఉంటాయి.

**భారతీయ గ్రంథాలను పార్శీలోకి, అరబిక్‌లోకి అనువదించి తెలుసుకోడానికి తురుష్క పాలకులు శ్రద్ధ చూపారు, కానీ అదే తరహా శ్రద్ధ అరబిక్, పార్శీ గ్రంథాలను సంస్కృతం లోకి అనువదించే ప్రయత్నం భారతీయ పండితులెవరూ చేయలేదు. ఇది ఒక విచిత్రం. సనాతనవాదం, సాంప్రదాయ వాదం సంస్కృత పండితుల్లో ఎంత ప్రబలంగా ఉండేదో దీనిని బట్టి తెలుస్తుంది.** ఇలా ముడుచుకు పోయే దృక్పథం అనుసరించడం వలన సంస్కృత సాహిత్యంలో సృజనాత్మకత కొరవడింది. నూతన దృక్పథం లేని అతి సామాన్య రచనలు ఎక్కువగా వెలువడ్డాయి.

### అరబిక్, పార్శీ సాహిత్యం

మహమ్మద్ ప్రవక్త అరబిక్ భాషను ఉపయోగించాడు. అరబిక్‌లోనే ముస్లిం సాహిత్యం ఎక్కువగా వచ్చింది. అటు స్పెయిన్ నుంచి ఇటు బాగ్దాద్ వరకూ అరబిక్‌నే ఉపయోగించేవారు. అయితే తురుష్కులు పార్శీ భాష పట్ల ఎక్కువ మక్కువను ప్రదర్శించారు. పార్శీలోనే పరిపాలనా వ్యవహారాలు, సాహిత్యం ఎక్కువగా సాగాయి. భారతదేశం లోని ముస్లిం విద్వాంసులవరకే అరబిక్ భాష పరిమితంగా ఉండేది. అయితే అరబిక్ భాషలో కూడా శాసనాలను రూపొందించేవారు. పార్శీ భాషలో ఫిరదౌసి, సాది వంటి గొప్ప కవులు ఎన్నో ఉన్నతమైన రచనలను చేశారు. పార్శీ సాహిత్యా నికి లాహోర్ కేంద్రంగా ఆవిర్భవించింది. ప్రముఖ పార్శీ కవి **అమీర్ ఖుస్రో** ఉత్తరప్రదేశ్ లో 1252లో జన్మించాడు. “హిందూస్తాన్‌నా జన్మభూమి. ఇది నాకు స్వర్గం లాంటిది. సంవత్సరం పొడవునా ఈ భూమి పచ్చగా, పూలతో కళకళలాడుతూవుంటుంది. ఇక్కడ మేధావులు, పండితులు అనేకమంది ఉన్నారు” అని ఖుస్రో ప్రశంసించాడు. ఖుస్రో కొత్త సాహిత్యశైలిని పార్శీలో సృష్టించాడు. దానిని సబక్-ఎ-హింద్‌గా ప్రశంసిస్తారు. ఖుస్రో హిందీ భాషను కూడా బాగా మెచ్చుకున్నాడు. అతడు మంచి సంగీతకారుడు కూడా. ఖుస్రో ప్రముఖ సూఫీ గురువు నిజాముద్దీన్ ఔలియా శిష్యుడు. 1325లో నిజాముద్దీన్ మరణించినట్టు తెలియగానే ఖుస్రో కూడా తనువు చాలించాడు.

కవిత్వానికి తోడు పార్శీలో చరిత్ర రచన కూడా సాగింది. పార్శీ భాష అభివృద్ధి చెందడంతో మన దేశం మధ్య ఆసియా దేశాలతో సాంస్కృతిక సంబంధాలను పెంపొందించుకో గలిగింది. దేశ రాజకీయాల్లో సంస్కృతం, పార్శీ భాషలు రెండూ పాలకవర్గాల, ఉన్నత వర్గాల భాషలుగా పరస్పర అనుబంధంతో పని చేశాయి. పార్శీ భాషలోకి అనువదించబడిన సంస్కృత కాల్పనిక సాహిత్యానికి విశేషమైన ఆదరణ లభించింది.

### ప్రాంతీయ భాషలు

8వ శతాబ్దం నాటికి హిందీ, మరాఠీ, బెంగాలీ, తెలుగు, తమిళం కన్నడం తదితర ప్రాంతీయ భాషలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. బ్రాహ్మణులు తమ హోదాను, ప్రతిష్టను కోల్పోవడంతోబాటు, భక్తి ఉద్యమం ప్రధానంగా ప్రాంతీయ భాషలనే ఉపయోగించడం కూడా ఇందుకు దోహదం చేసింది. దాంతో పాలకులు కూడా ప్రాంతీయ భాషలను సమాంతరంగా ఆదరించవలసిన పరిస్థితి వచ్చింది. సంస్కృతానికి తోడు పాలనా వ్యవహారాల్లో ప్రాంతీయ భాషలను కూడా ఉపయోగించారు. ప్రాంతీయ భాషల్లో ఎంతో గొప్ప సాహిత్యం వెలువడింది. విజయ నగర రాజ్యంలో తెలుగు భాషకు లభించిన ఆదరణ ప్రత్యేకంగా చెప్పుకోదగ్గది. బెంగాల్‌ను పాలించిన ముస్లిం పాలకులు మహాభారతాన్ని, రామాయణాన్ని బెంగాలీలోకి అనువాదం చేయించారు.

### లలితకళలు

ముఖ్యంగా సంగీతం విషయంలో హిందూముస్లిం రీతుల నడుమ గొప్ప సమ్మేళనం జరిగింది. తురుష్కులు తమతోబాటు విశిష్టమైన అరబిక్ సంగీత సాంప్రదాయాలను తీసుకువచ్చారు. రబాబ్, సారంగీ వంటి వాయిద్యాలను కూడా తీసుకువచ్చారు. ఖుస్రో ఎన్నో కొత్త రాగాలను ప్రవేశపెట్టాడు. సూఫీ ఉద్యమం, భక్తి ఉద్యమం సమ్మేళనం ఎన్నో కొత్త రాగాలను, కొత్త సంగీత ధోరణులను సృష్టిం చింది. వేరు వేరు ప్రాంతాల సంస్కృతులు వినూత్న, ఉన్నత స్థాయి సాంస్కృతికాభివృద్ధికి దోహదం చేస్తాయన్నది భారతీయ సంగీత వైశిష్ట్యం ప్రపంచానికే చాటిచెప్పింది. ముస్లింలది పరాయి సంస్కృతి అని నేడు విద్వేష భావాలను రెచ్చగొట్టే వారి చారిత్రిక దృష్టి ఎంత అల్పమైనదో మన గత వారసత్వమే రుజువు చేస్తోంది.

**(తరువాయి వచ్చే సంచికలో)**

మీడియా

# సాంస్కృతిక అక్షరాశ్యత పెంచాలి

**మనోజ్ కుమార్ ఝా**



రచయిత ఆర్‌జెడికి చెందిన రాజ్యసభ మాజీ సభ్యుడు. సంకీర్ణ రాజకీయాల గొప్పతనం, భారత ప్రజాస్వామ్యంపై అనేక వ్యాసాలు, పుస్తకం రాశారు.

"విషయాలు ఎంత ఎక్కువగా మారితే అవి అంతగా మారకుండా ఉంటాయి" అని ఇంగ్లీషులో ఒక నానుడి ఉంది. జర్మనీకి చెందిన ఫ్రాంక్‌ఫర్ట్ స్కూల్ మేధావుల విశ్లేషణలో ఈ నానుడి ప్రతిధ్వనిస్తుంది. సామాన్య ప్రజలు నిరంకుశ ఉద్యమాలకు ఎందుకు మద్దతిస్తారు అన్న విషయాన్ని అర్థం చేసుకోడానికి ఈ మేధావులు ప్రయత్నించారు. (సామాజికశాస్త్రం, క్రిటికల్ థియరీకి సంబంధించిన నిష్ణాతులతో ఏర్పడిందే ఫ్రాంక్‌ఫర్ట్ స్కూల్). 1900 దశాబ్దం ప్రారంభంలో ఫాసిజం ప్రజల మద్దతు ఎలా పొందగలిగింది అని వీరు అధ్యయనం చేశారు. వీరి అధ్యయనంలో తేలిందేమంటే, నిజమైన ప్రజా సంస్కృతికీ, 'సాంస్కృతిక పరిశ్రమ' ఉత్పత్తి చేసే సంస్కృతికీ ముఖ్యమైన తేడా ఉందని.

నేటి భారతీయ మీడియానూ, డిజిటల్ సమాచారాన్నీ పరిశీలిస్తే ఫ్రాంక్‌ఫర్ట్ స్కూల్ మేధావులు ఎంత దూరదృష్టితో ఈ 'తయారుచేయబడిన సమ్మతి, సాంస్కృతిక వక్రీకరణ' గురించి హెచ్చరించారో అర్థమవుతుంది. ప్రజల చైతన్యాన్ని తమకనుకూలంగా మార్చుకోడానికి నియంతృత్వ ఉద్యమాలు ఎలా సంప్రదాయ మీడియానూ, కొత్త మీడియానూ ఉపయోగించుకుంటాయో అర్థం చేసుకోడానికి ఈ మేధావులు ప్రతిపాదించిన సైద్ధాంతిక అంశాలు మనకు సాధనాలుగా ఉపయోగపడతాయి.

నిజమైన ప్రజా సంస్కృతి ప్రజా సమూహాలనుండి సద్యోజనితం (స్పాంటేనియస్)గా ఉద్భవిస్తుందని థియోడర్ అడోర్నో, మాక్స్ హార్క్‌హీమర్ అనే తత్వవేత్తలు తాము రాసిన "డయలెక్టిక్ ఆఫ్ ఎన్‌లైటెన్‌మెంట్" అనే గ్రంథంలో చెప్పారు. ప్రజాసమూహాల నిజమైన బాధలు, అవసరాలు, ఆశలనుండి ప్రజా సంస్కృతి పుట్టుకొస్తుందని చెప్పారు. దానికి భిన్నంగా ప్రధాన స్రవంతి మీడియా, సమాచార సంస్థలు తయారు చేసే పాపులారిటీ అనేది అధికారంలో ఉన్న వారి ప్రయోజనాలను పరిరక్షిస్తుంది. ఇక్కడ, నిజమైన సాంస్కృతిక వ్యక్తీకరణను తయారుచేయబడిన సమ్మతిగా, కృత్రిమ పాపులారిటీని ప్రజా మద్దతుగా మార్చేస్తారు. అంటే వాస్తవాన్ని ఉల్టాసీదా చేస్తారన్నమాట.

### హిందీ చలన చిత్ర పరిశ్రమ

మనం హిందీ చలన చిత్ర పరిశ్రమతో ప్రారంభిద్దాం. ఇక్కడ చాలా వరకు సినిమాలు ప్రేక్షకులను వినోదపరచడం కోసం కాకుండా, ఏదో ఒక రాజకీయ సందేశం ఇవ్వడానికో, సమాజంలో చీలికలు తీసుకురావడానికో నిర్మించబడతాయి. మన భారత దేశం చారిత్రకంగా దేనికోసమైతే ఆరాటపడింతో దాన్ని ఈ సినిమాలు వమ్ముచేస్తాయి. మన రాజ్యాంగ విలువలకు వ్యతిరేకంగా నిలుస్తాయి. కొన్ని సినిమాలకు పెద్ద ఎత్తున ప్రభుత్వ మద్దతు కూడా ఉంటుంది. పెద్ద పెద్ద బడ్జెట్‌లతో నిర్మించబడతాయి. అన్ని చోట్లా ప్రదర్శించబడతాయి. కాకపోతే ఒకటే షరతు అవి కొన్ని భావజాలాలను ప్రచారం చేయాలి, అంతే.

మరోవైపు దీనికి భిన్నమైన భావజాలాన్ని ముందుకు తీసుకువచ్చే, లేదా పాలకులకు ఇష్టంలేని ప్రశ్నలను లేవనెత్తే సినిమాలకు రిలీజ్ చేయడానికి థియేటర్లు దొరకవు. తరచు ఇటువంటి సినిమాలకు ప్రభుత్వ సెన్సార్‌షిప్పు సర్టిఫికేట్ లభించదు. అథవా, లభించినా వీధిలో వీరంగాలు వేసే 'సాంస్కృతిక పోలీసులు' అడ్డుకుంటారు. సినిమాల్లో ఎటువంటి కథలు చెప్పాలో ప్రభుత్వం, లేక బలం ఉన్న గ్రూపులు నిర్ణయించే పరిస్థితే వస్తే అప్పుడు ప్రజలు జరుగుతున్న వాస్తవాల పట్ల ఎటువంటి దృక్పథాన్ని ఏర్పాటు చేసుకోవాలో వారే నిర్దేశిస్తారు. దీని తరువాత అన్ని నియంతృత్వ సమాజాల్లో జరిగేట్లే 'సాంస్కృతిక పరిశ్రమ' సమ్మతిని వండి వార్చే పనిముట్టుగా మారిపోతుంది.

ఫ్రాంక్‌ఫర్ట్ మేధావులు సరిగ్గా మనల్ని ఈ దృగ్విషయం గురించే హెచ్చరిక చేశారు. 'కుహనా వ్యష్టీకరణ' (సూడో ఇండివిడ్యుయలైజేషన్) ద్వారా ప్రచార సినిమాలు ఎలా పనిచేస్తాయో ఈ ఫ్రాంక్‌ఫర్ట్ మేధావులు వివరించారు. ఈ సినిమాలు విభిన్నంగా కనిపిస్తాయి కానీ వాస్తవంలో ఒకే రకమైన సందేశాన్ని ఇస్తూ ఉంటాయి. కాశ్మీరీ ఫైల్స్ (2022), కేరళ స్టోరీ (2023) విభిన్నమైన కథలతో తీసిన సినిమాలే కానీ వాటి వెనుకనున్న కథనం మాత్రం ఒకటే..భయం, ప్రజల మధ్య విభజన. (ఇప్పుడు ఇటువంటి కథనంతోనే కేరళ స్టోరీ –2 విడుదల చేస్తున్నారు.)

నియంతృత్వ ప్రచారం అనేది అబద్ధాలను వ్యాపింపజేయడం కన్నా ప్రమాదకరమైంది. అది ప్రజలలోని సహేతుక ఆలోచనా జ్ఞానాన్ని నాశనం చేస్తుంది. ప్రేక్షకులకు భావోద్వేగంతో కూడిన కథలను సరళమైన రీతిలో నిరంతరాయంగా చెబుతూ ఉంటే వారిలో సంక్లిష్ట ప్రక్రియలను అర్థం చేసుకునే సామర్థ్యం తగ్గిపోతుంది. వాళ్లు ఈ ప్రపంచాన్ని 'ప్రమాదాలు', 'శత్రువులు' అనే దృష్టితో మాత్రమే చూడ్డం ప్రారంభిస్తారు. దాని వల్ల అనేక రకాల వాదనలను ఆమోదించే భారత దేశపు దీర్ఘకాలిక సంప్రదాయం మంటగలిసి పోతుంది.

### ప్రజాభిప్రాయాన్ని విషతుల్యం గావించడం

ఇవన్నీ చెడ్డ సినిమాలులే అనుకుంటే అక్కడితో అయిపోదు. ఈ సినిమాలు ప్రజాభిప్రాయాన్ని విషతుల్యం గావిస్తాయి. అడోర్నో చెప్పినట్లు అవి "నియంతృత్వ వ్యక్తిత్వాన్ని" సృష్టిస్తాయి. అంటే ప్రతి సమస్యకు సరళమైన జవాబులు, బలమైన నాయకుని కోరుకునే పౌరులను సృష్టిస్తాయి. ఇటువంటి మనస్తత్వం గలవారు మెళకువతో పనిచేయడాన్ని బలహీనతగా, రాజీని ద్రోహంగా పరిగణిస్తారు.

ప్రధాన స్రవంతి వార్తా సాధనాలు ఒక పద్ధతి ప్రకారం రాజ్యం, కార్పొరేట్ ప్రయోజనాలను రక్షించే ప్రచార యంత్రాంగంగా పరిణామం చెందాయి. ప్రభుత్వాన్నీ, దాని

> **" బడా వ్యాపార సంస్థలు తమ స్వప్రయోజనాలు, తమ రాజకీయ మిత్రుల ప్రయోజనాలు నెరవేర్చుకోవడం కోసం వార్తా సంస్థలను పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశంలోని అనేక వార్తా సంస్థల్లో వాటాలు కొనేసింది. ప్రస్తుతం అనేక ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీ గ్రూపు చేతిలో అనేక ప్రాంతీయ వార్తా ఛానళ్లున్నాయి. అనేక డిజిటల్ వార్తా సంస్థల్లో పెట్టుబడులు పెట్టింది. "**

మెజారిటేరియన్, నయా-ఉదారవాద ఎజెండాను సమర్ధించడమే ప్రధాన వార్తా ఛనళ్ల రోజువారీ పనిగా మారిపోయింది. ప్రభుత్వ అవినీతిని కప్పిపుచ్చడం, అది చేసే నిరంకుశ చర్యలను సమర్ధించడం ప్రతిపక్షంపైనా, సమాజంలో బలహీనంగా ఉన్న వర్గాలపైనా ముఖ్యంగా మతపరమైన మైనారిటీలు, పౌర సమాజ సంస్థలపై దాడిచేయడమే వాటి పని.

ఇదంతా ఏదో ప్రమాదవశాత్తు జరిగిన మార్పు కాదు: బడా వ్యాపార సంస్థలు తమ స్వప్రయోజనాలు, తమ రాజకీయ మిత్రుల ప్రయోజనాలు నెరవేర్చుకోవడం కోసం వార్తా సంస్థలను పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నాయి. మన దేశంలో పెట్రోకెమికల్స్ దగ్గరనుండి టెలికమ్యూనికేషన్స్ వరకు అన్ని రకాల వ్యాపారాల్లో భాగస్వాములైన రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశంలోని అనేక వార్తా సంస్థల్లో వాటాలు కొనేసింది. ప్రస్తుతం అనేక ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీ గ్రూపు చేతిలో అనేక ప్రాంతీయ వార్తా ఛానళ్లున్నాయి. అనేక డిజిటల్ వార్తా సంస్థల్లో పెట్టుబడులు పెట్టింది.

టైమ్స్ నౌ, రిపబ్లిక్ టివీ, జీ న్యూస్ వంటివన్నీ ప్రభుత్వానికి జైకొట్టే వందిమాగ దులుగా మారిపోయాయి. ప్రభుత్వం చెప్పే గొప్పలను ప్రశ్నించే క్రిటికల్ జర్నలిజాన్ని అవి ఏనాడో విడిచిపెట్టేశాయి.

### విధేయ మీడియా

దీని ఫలితం ఏమంటే, మన మీడియా వార్తల్లో ప్రభుత్వ వైఫల్యాలు ఏనాడో మాయమై పోయాయి. ప్రధాన వార్తా సమయం అంతా ప్రతిపక్ష నాయకుల వ్యక్తిత్వ హననం కోసం ఉపయోగిస్తున్నారు. ఎంపిక చేసుకున్న కథనాలు ప్రచురిచండం ద్వారా, రెచ్చగొట్టే వ్యాఖ్యల ద్వారా మైనారిటీలను, ముఖ్యంగా ముస్లింలను భూతాలుగా చిత్రీకరిస్తున్నారు. అధికార ధోరణికి భిన్నంగా వ్యవహరించే స్వతంత్ర జర్నలిస్టులు నిరంతర వేధింపులకు గురవుతున్నారు. డబ్బులకూ, బెదిరింపులకూ లొంగని స్వతంత్ర జర్నలిస్టులు డిజిటల్ మీడియాకు వెళ్లిపోయి అక్కడ తమ నిజమైన జర్నలిజాన్ని కొనసాగిస్తున్నారు.

అక్కడ కూడా వారికి నిరంతరం అడ్డంకులు ఎదురవుతున్నాయి. వారి కంటెంట్ డిజిటల్ మీడియా నుండి తొలగిస్తున్నారు. ఛానల్‌ను తొలగిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. మొత్తం మీద అనేక రకాల వేధింపుల ద్వారా వారి నోరు మూయించడానికి ప్రయత్నిస్తున్నారు. అభిసార్ శర్మ, అజిత్ అర్జుమ్ వంటి జర్నలిస్టులు, ది వైర్ వంటి డిజిటల్ మీడియా వేదికలు నిరంతరం సెన్సారు వేధింపుల నెదుర్కోవడం జరుగుతోంది.

డిజిటల్ విప్లవం కమ్యూనికేషన్ రంగాన్ని ప్రజాస్వామీకరిస్తుందని ఒకనాడు అందరూ భావించారు. అది ప్రతి పౌరునికీ గొంతు నిస్తుందనీ, మీడియా సామ్రాట్టుల గుత్తాధిపత్యాన్ని ఛేదిస్తుందనీ అనుకున్నారు. కానీ టెక్నోక్రాట్లు, బడా టెక్నాలజీ కంపెనీలు, మెజారిటేరియన్ రాజకీయాల దుష్టకూటమితో ఆ అవకాశాలు సన్నగిల్లిపోయాయి.

ఫ్రాంక్‌ఫర్ట్ మేధావులు హెచ్చరించినట్లు 'సాంస్కృతిక పరిశ్రమ' అనేది డిజిటల్ రంగంలో కూడా ఏర్పడిపోయింది. ఢిల్లీలో రైతులు నిరసనలు తెలిపినప్పుడు వారికి మద్దతు పలికేవారి గొంతులను ఆల్గోరిథమ్ ఉపయోగించి 'ఎక్స్' వేదిక అణచివేయడం దీనికి ఒక ఉదాహరణ. ఫేస్‌బుక్ అయితే కేవలం అధికార వర్గాల కథనాలు మాత్రమే ఇచ్చేది. ఇవన్నీ చూస్తే ఈ వేదికలు ప్రజాస్వామ్యానికి కాకుండా అధికారానికి ఎలా వంతపాడుతాయో అర్థమవుతుంది. వాట్సాప్‌లో ఫార్వర్డింగ్ మెసేజ్‌లద్వారా మత విద్వేషాలు రెచ్చగొట్టే విషయాలు యథేచ్ఛగా ప్రచారమవుతున్నా వాటిని అడ్డుకోవడం లేదు, కానీ ప్రభుత్వాన్ని ప్రశ్నించే మెసేజ్‌లపైన మాత్రం అనేక విధినిషేధాలు విధిస్తున్నారు. ఇతరులను ధూషించే, ప్రజలను విభజించే విషయాలను ఆల్గోరిథమ్‌లు పెద్దవి చేసి చూపిస్తాయి. ఇతరులను ముఖ్యంగా మైనారిటీలను ద్వేషించే ప్రసంగాలు ట్రెండ్ అవుతాయి ఎందుకంటే వాటికి ఎక్కువ క్లిక్‌లు వస్తాయి. మరోవైపు ప్రజలను ఆలోచింపజేసే రాజకీయ విషయాలు భావోద్వేగం కలిగించవు కాబట్టి వాటివల్ల పెద్దగా వ్యాపార ప్రకటనలు రావు, కాబట్టి వాటిని ఎక్కడో పాతిపెట్టేస్తారు.

### 'డిజిటల్ డివైడ్'

దేశంలో నెలకొన్న "డిజిటల్ డివైడ్" (డిజిటల్ అసమానత) అధికారాన్ని మరింతగా కేంద్రీకరిస్తోంది. గ్రామీణ ప్రజలు తరచూ స్థానిక రాజకీయ నెట్‌వర్క్‌లు నిర్వహించే వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా సమాచారాన్ని అందుకుంటారు. ఈ గ్రూపులు తమ స్వంత సమాచార మార్గాలను అనుసరిస్తాయి కాబట్టి వాస్తవాన్ని అవి పూర్తి భిన్న వైఖరుల్లో అందిస్తాయి.

టెక్నాలజీ అన్నిటికీ పరిష్కారం చూపుతుందని విధాన నిర్ణేతలు భావిస్తారు కానీ ప్రస్తుతం ఉన్న అసమానతలను ఇది ఏ విధంగా ప్రభావితం చేస్తుందో అర్థం చేసుకోరు. అటువంటి టెక్నోక్రాటిక్ బుర్రలున్న వారు సంక్లిష్టమైన సామాజిక సమస్యలను కూడా ఆల్గోరిథమిక్ పరిష్కారాల క్రిందకు దిగజార్చేస్తారు. వాటిని పరిష్కరించడం కోసం టెక్నోక్రాటిక్ మేధావి బృందాలు లేదా 'వాలంటీర్' గ్రూపులతో భాగస్వామ్యం పెట్టుకుంటారు. డిజిటల్ ఇండియా వంటి ప్రభుత్వ కార్యక్రమాలు పారదర్శకంగా ఉంటాయని కబుర్లు చెప్పినప్పటికీ వాస్తవానికి అవి అత్యంత ఆధునిక నిఘా వ్యవస్థలుగా మారిపోయాయి. సేకరించిన పౌరుల సమాచారాన్ని ఉపయోగించుకుని వాళ్లను భాగస్వాములను చేయాల్సింది పోయి వారిలో అసమ్మతి ఎక్కడుందో కనుక్కోడానికి ఉపయోగిస్తున్నారు.

ఈ విధంగా ప్రభుత్వ అధికారం, కార్పొరేట్ లాభాపేక్ష, మెజారిటేరియన్ సైద్ధాంతిక భావజాలాలు కూటమిగా ఏర్పడి ఇంటర్‌నెట్‌ను ఒక ప్రజాస్వామిక వేదికగా కాకుండా సామాజిక నియంత్రణ సాధనంగా మార్చేశాయి. సంప్రదాయ మీడియాపై ఆధిపత్యం వహిస్తున్న శక్తులను డిజిటల్ వేదికల్లోకి కూడా అనుమతించడంతో డిజిటల్ డెమోక్రసీ కల కల్లగా మిగిలిపోయింది. చైతన్య పూర్వకమైన ప్రతిఘటన లేకుండా ఉంటే టెక్నాలజీ అనేది స్వేచ్ఛను ప్రసాదించకపోగా నియంతృత్వానికి సేవ చేస్తుంది.

సినిమా, ఇంటర్‌నెట్‌లు పదేపదే సరళతరమైన కథనాలను సమర్పిస్తుండడంతో అవి ప్రేక్షకులను సంక్లిష్టతలను అర్థం చేసుకోలేని నెడుతున్నాయి. దాంతో చర్చ, రాజీ, సూక్ష్మాంశాలను పట్టుకోవడం వంటి సంస్థాగతమైన క్రమాన్ని అనుసరించేంత ఓపిక పౌరులకు లేకుండా పోతోంది. దానివల్ల స్వతంత్ర జర్నలిజం అనేది "నకిలీ వార్త"గా పరిగణించబడుతోంది. అకాడమిక్ పరిశోధన "ఉన్నత వర్గాలకు అనుకూలంగా" మారిపోయింది. పౌర సమాజపు సంస్థలు "విదేశీ ఏజెంట్లు"గా పరిగణించబడుతున్నాయి. న్యాయ సమీక్షలను "జుడీషియల్ యాక్టివిజం" అంటున్నారు. పార్లమెంటరీ చర్చ, బాధ్యతకోసం ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్లను "టైమ్ వేస్టు"గా మార్చేశారు. సంస్థాగతమైన ప్రక్రియలను రక్షణ కవచాలుగా కాకుండా అడ్డంకులుగా భావిస్తున్నారు.

**మితవాద ఉద్యమాలు**

నియంత్రించబడిన, నిత్యం నిఘానీడలో ఉండే మీడియా వాతావరణం మితవాద ఉద్యమాలకు సారవంతమైన నేలగా ఉంటుంది. ఇక్కడ జనించే మితవాద ఉద్యమాలు ప్రజాస్వామ్య సంస్థలను ఒక పద్ధతి ప్రకారం నాశనం చేస్తాయి. దీంతోబాటే పరిపాలనపై సంస్థాగత అదుపాజ్ఞలు లేకుండా చేయడం జరుగుతుంది.

మితవాద నాయకులు నేరుగా 'ప్రజల అభిప్రాయానికి ప్రాతినిధ్యం వహిస్తున్నామనే' పేరుతో ఈ పరిస్థితిని తమకు అనుకూలంగా మలుచుకుంటారు. వాళ్లు సంప్రదాయంగా మధ్యవర్తుల మాదిరిగా పనిచేసే జర్నలిస్టులు, న్యాయమూర్తులు, సివిల్ సర్వెంట్లు, విద్యావేత్తలను పక్కకు నెట్టేస్తారు. వీరంతా నాయకులకూ, ప్రజలకూ మధ్య అవినీతిపరులైన అడ్డుగోడలని వారిపై నిందలు వేసి అడ్డుతొలగించుకుంటారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నిర్వహించే "మన్ కి బాత్" కార్యక్రమం దీనికి చక్కని ఉదాహరణ. ఇందులో ప్రజలకూ ఆయనకూ మధ్య ఎటువంటి అడ్డుగోడలేకుండా నేరుగా ప్రజలతో మాట్లాడుతున్నట్లు భ్రమ సృష్టిస్తారు. కానీ వాస్తవానికి ఆయనే తను చెప్పాలనుకున్నది ఏకపక్షంగా చెప్పుకుపోతారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అరుదుగా నిర్వహించే పత్రికా ఇంటర్వ్యూలు కూడా ఇలాగే ఉంటాయి. ఉదాహరణకు 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆయన న్యూస్18 జర్నలిస్టుకు ఇచ్చిన ఇంటర్వ్యూ అంతా ముందుగా తయారు చేసుకున్న స్క్రిప్టు ప్రకారం నిర్వహించబడింది.

> **❝ నియంత్రించబడిన, నిత్యం నిఘానీడలో ఉండే మీడియా వాతావరణం మితవాద ఉద్యమాలకు సారవంత మైన నేలగా ఉంటుంది. ఇక్కడ జనించే మితవాద ఉద్యమాలు ప్రజాస్వామ్య సంస్థలను ఒక పద్ధతి ప్రకారం నాశనం చేస్తాయి. దీంతోబాటే పరిపాలనపై సంస్థాగత అదుపాజ్ఞలు లేకుండా చేయడం జరుగుతుంది. ❞**




డిజిటల్ ప్రపంచంలో మన ఆలోచనలకు అనుగుణమైన సమాచారమే మనకు వచ్చేట్లు ఆల్గోరిథిమ్‌తో నడిచే ప్రసారాలు సాగుతుంటాయి. వ్యతిరేక వైఖరులు మనకు చేరకుండా చేస్తాయి. అంటే ప్రతి వ్యక్తి చుట్టూ ఆయన ఆలోచనలకు అనుగుణమైన సమాచారం మాత్రమే తిరుగుతూ, వ్యతిరేకమైన ఆలోచనలు రాకుండా చేసే వాతావరణాన్ని ఈ ఆల్గోరిథిమ్స్ సృష్టిస్తాయన్నమాట. వాట్సాప్ ద్వారా నీకు కావలసిన "నిజం" నీకు అందుతుంటే ఇంక ఎవరికైనా జర్నలిస్టుల అవసరం ఏముంటుంది? ఎవరు అమాయకుడో, ఎవరు నేరస్తుడో నీ సోషల్ మీడియానే నీకు చెబుతుంటే ఇంక ఎవరైనా కోర్టులను ఎందుకు నమ్మాలి?

విచిత్రమేమంటే, ఈ మితవాద జనాకర్షక నేతలు అవినీతిపరులైన పాలకులకు వ్యతిరేకంగా సామాన్య ప్రజల పక్షాన నిలబడేట్లు చెబుతారు. కానీ నిజానికి ఆ పేరుతో వారు తమ చేతుల్లో అసాధారణమైన అధికారాలు పోగుచేసుకుంటారు. ఈ అధికార కేంద్రీకరణను నిలువరించే సంస్థలను వారు నాశనం చేస్తారు. అంటే పత్రికా స్వేచ్ఛ, ఎన్నికల వ్యవస్థ సమగ్రత, పౌర హక్కులు మొదలైన అన్నీ వీరి పాలనలో దిగజారిపోతాయి. కానీ విచిత్రంగా వారి మద్దతుదారులు తాము ఇంకా ఎక్కువ ప్రజాస్వామ్యాన్ని అనుభవిస్తున్నట్టు నమ్ముతారు. పౌరులు తమ సమస్యలకు వివిధ సంస్థలే కారణమనుకునేట్లుగా నియంత్రిత మీడియా ఒప్పిస్తుంది మరోవైపు ఈ సంస్థలను నాశనం చేసే నాయకులను రక్షిస్తుంది. ఈ మితవాద నాయకులు ఒకవైపు నిర్నిరోధమైన అధికారాన్ని చెలాయిస్తూనే మరోవంక బయట ఉండి వ్యవస్థకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడే యోధులుగా చూపెట్టబడతారు.

**చరిత్ర చెప్పే గుణపాఠాలు**

ఒకానొక చారిత్రక సందర్భంలో ఎంతో జనరంజకంగా, ఇంకా చెప్పాలంటే గొప్ప నేతగా కనిపించేవారు తరువాత మానవాళికి ఎనలేని హానిచేసే నియంతలని తేలిన సందర్భాలు చరిత్రలో అనేకం ఉన్నాయి. వలస వాదాన్ని ప్రజలకు నాగరికత నేర్పే గొప్ప అవకాశంగా కీర్తించారు. బానిసత్వాన్ని ఆర్థిక అనివార్యతగా సమర్థించారు. వర్ణ వివక్షతను సామాజిక వ్యవస్థ రక్షకురాలిగా కొనియాడారు. ఈ వ్యవస్థలన్నీ

> **“ మన దేశంలో పరిపాలనను శీఘ్రస్థాయిలో డిజిటీకరణ చేయడం వల్ల, అంటే ఆదార్ నుండి డిజిటల్ పేమెంట్లవరకు జరుగు తున్న పరిణామాల వల్ల ప్రభుత్వ పాలనలో సామర్థ్యం, పారదర్శకత పెరుగు తుందని సంబరపడ్డారు. అయితే, ఈ వ్యవస్థల వల్ల ప్రభుత్వ నిఘా సామర్థ్యం కూడా పెరుగుతుందనీ, డిజిటల్ ప్రపంచానికి దూరంగా ఉండిపోయిన ప్రజలు అభివృద్ధికి దూర మయ్యే ప్రమాదమూ పెరిగిందని టెక్నాలజీ నిపుణురాలైన ఉషా రామనాథన్ డిజిటల్ గవర్నెన్స్‌పై చేసిన పరిశోధనా పత్రంలో తెలిపారు. ”**

తమతమ కాలాల్లో మద్దతుపొందాయి. కానీ ఇందులో ప్రతి ఒక్కటీ మానవ గౌరవాన్ని మంటగలిపిన వ్యవస్థగా చరిత్ర నిరూపించింది.

అలాగే భారత దేశంలో వలస పాలన దేశంలో పురోగతినీ, సాంస్కృతిక పునరుజ్జీవనాన్నీ తీసుకువచ్చిందని సమర్థించారు. దాన్ని అలా సమర్థించిన పశ్చిమదేశాల మేధావులు భారత సమాజాన్ని వెనుకబడిన సమాజమనీ, దానికి పశ్చిమదేశాల సారథ్యం కావాలనీ చెప్పారు. ఈ రకమైన కథనం ప్రజామోదాన్ని పొందడమే కాకుండా భారత దేశాన్ని బ్రిటన్ ఒక పద్ధతి ప్రకారం చేసిన దోపిడీని కప్పిపుచ్చిందని ఎడ్వర్డ్ సెడ్ అనే పాలస్తీనా-అమెరికన్ విద్యావేత్త 'ఓరియెంటలిజం' అనే తన గ్రంథంలో వివరించాడు. భారత దేశం నుండి బ్రిటిష్ వారు బలవంతంగా సుమారు (నేటి ధరల్లో) 45 లక్షల కోట్లు దోచుకుపోయిన విషయాన్ని వారి ఈ ఉదారత కప్పిపుచ్చిందని ఆర్థిక-చారిత్రకవేత్త ఉత్సా పట్నాయక్, ఇతర చరిత్ర కారులు వెల్లడించారు.

మంచి మనసుతో తీసుకున్న విధానాలు కూడా కొన్ని సందర్భాల్లో చాలా మూల్యానికి కారణమైనాయి. భారత దేశంలో ప్రవేశపెట్టిన హరిత విప్లవం వల్ల వ్యవసాయ ఉత్పాదకత పెరిగి ఆహార భద్రత ఏర్పడిందని సంబర పడ్డారు. అయితే దాని వల్ల జీవ వైవిధ్యానికీ, సంప్రదాయ వ్యవసాయ సముదాయాలకూ దీర్ఘకాలిక నష్టం వాటిల్లిందని తరువాత పరిశోధనలు తెలిపాయి.

వర్తమాన భారత దేశంలో పరిపాలనను శీఘ్రస్థాయిలో డిజిటీకరణ చేయడం వల్ల అంటే ఆదార్ నుండి డిజిటల్ పేమెంట్లవరకు జరుగుతున్న పరిణామాల వల్ల ప్రభుత్వ పాలనలో సామర్థ్యం, పారదర్శకత పెరుగు తుందని సంబరపడ్డారు. అయితే, ఈ వ్యవస్థల వల్ల ప్రభుత్వ నిఘా సామర్థ్యం కూడా పెరుగుతుందనీ, డిజిటల్ ప్రపంచానికి దూరంగా ఉండిపోయిన ప్రజలు అభివృద్ధికి దూరమయ్యే ప్రమాదమూ పెరిగిందని టెక్నాలజీ విధాన నిపుణురాలైన ఉషా రామనాథన్ డిజిటల్ గవర్నెన్స్‌పై చేసిన పరిశోధనా పత్రంలో తెలిపారు.

### పాపులారిటీ, నైతిక యోగ్యత

ఈ ఉదాహరణలన్నీ చెబుతున్న దేమంటే, పాపులారిటీ అనేది నైతిక యోగ్యతతో సమానం కాదని. పెద్ద ఎత్తున ప్రజలను ఆకర్షించి, ప్రజా వెల్లువలో అధికారం చేపట్టిన హిట్లర్, ముస్సోలినీ వంటి నాయకులు అనుసరించిన విధానాలు, పద్ధతులు ప్రజలను విపరీతమైన ఈతిబాధల్లోకి నెట్టాయి. అద్భుతమైన నాజీల ర్యాలీలూ, ప్రచార యంత్రాంగమూ వ్యక్తి ఆరాధనను ఎంతగా పెంచాయంటే ఆ ప్రభుత్వం చేసిన దుర్మార్గాలను చూడలే నంతగా.. అని 'హిట్లర్ మిథ్య: మూడవ రీచ్‌లో భ్రమ వాస్తవం' అన్న తన గ్రంథంలో చరిత్రవేత్త ఇయాన్ కెర్షా రాశారు. నాజీలు చివరికి మహా వినాశనం సృష్టించారు. కానీ ఇప్పటికీ ప్రపంచంలో అనేక మంది మాటల మాంత్రి కులు ప్రజాకర్షణ పొంది అధికారంలోకి వస్తుండడం చూస్తున్నాం. నిరంకుశులైన నాయకులు తరచూ..సంక్లిష్టమైన సందర్భాల్లో సమ్యలను చిటికిన వేలితో నిర్మాణాత్మకంగా పరిష్కరించగల సమర్థులుగా పోజు పెట్టి ప్రజామద్దతుతో అధికారంలోకి వచ్చేస్తుంటారు. అస్థిరమైన సమయాల్లో స్థిరత్వాన్ని సాధించగలం అనే వారి మాటలకు ప్రజలు దాసోహం అయిపోతుంటారు. స్థిరత్వం, సరైన మార్గనిర్దేశం కోరుకునే ప్రజలను వారు దేశభక్తి పూరిత భాషతో ఆకర్షిస్తారు. ఎన్నికల్లో గెలుపొందిన అటువంటి నాయకత్వం ప్రజలకు ఏదో గొప్ప మేలు చేస్తున్నట్లు కనిపిస్తుంది.

అయితే, అటువంటి నాయకులు ప్రజాస్వా మ్య సంస్థలను బలోపేతం చేయకపోగా వాటిని ఒక పద్ధతి ప్రకారం బలహీనపరచడం ద్వారా తమ స్థానాన్ని పటిష్టపరుచుకుంటారు. మీడియా, న్యాయవ్యవస్థ, పౌర సమాజాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని అధికారాన్ని కేంద్రీక రిస్తారు, జవాబుదారీ తన్నాన్ని తగ్గించేస్తారు. ప్రజామద్దతును వారు విమర్శను తిరస్కరించే యంత్రాంగంగా మార్చేస్తారు. అసమ్మతిని తరచూ దేశద్రోహంగా పరిగణిస్తారు. ప్రజాస్వామిక సంస్థలు క్రమంగా ప్రజలకు సేవ చేసే స్థానం నుండి పాలకునికి సేవ చేసేవిగా మారిపోతాయి. అధికారంలో ఉన్న వారి

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

జవాబుదారీతనాన్ని కొనసాగించే సాధనాలకు బదులు అధికారం చేతిలో పనిముట్లుగా మారిపోతాయి.

ప్రజాస్వామ్య సాంప్రదాయాలు నాశనం కావడం అనేది ఒక్కసారిగా కాకుండా క్రమక్రమంగా జరుగుతుంది. పౌరులు జాగ్రత్తపడ్డం ప్రారంభిస్తారు, అసమ్మతిని వ్యక్తచేయడానికి భయపడతారు. అధికార విధానాలను ప్రశ్నించడం వాటితో విబేధించడాన్ని ప్రజలు తగ్గిస్తున్న కొద్దీ ప్రజల్లో చర్చ దిగనాసిపోతుంది. ఆరోగ్యవంతమైన అసమ్మతిద్వారా వ్యక్తమయ్యే ప్రజాస్వామిక సంస్కృతి నెమ్మదిగా తగ్గిపోయి దాని స్థానంలో నిర్లిప్తత చోటుచేసుకుంటుంది.

ఈ నష్టం ప్రజలందరికీ కనిపించే సరికి పరిస్థితిని వెనక్కు మళ్లించడం కష్టతరమైన సవాలుగా మారిపోతుంది. స్వేచ్ఛ, న్యాయం లేని అభివృద్ధి – అదంటూ ఒకటుంటే – అది నిలకడలేని అభివృద్ధిగా మారిపోతుంది. భిన్నత్వం లేని పాక్షిక ఐక్యత పెళుసుమారి పోతుంది. నిరంకుశ పాలకుల వారసత్వం మన సంస్థలను నాశనం చేస్తుంది, పౌరుల నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. నిస్పృహకు గురయ్యే పౌరులు తమ స్వేచ్ఛను పునరుద్ధరించుకునే క్రమం నుండి పక్కకు వైదొలగుతారు.

ప్రజలు తక్షణ సదుపాయం, ప్రచారార్భాటంలో కొట్టుకుపోయి తాత్కాలిక భావోద్వేగాలతో ఓట్లు వేస్తుంటారు. కానీ పాపులారిటీని ప్రాథమిక కొలబద్దగా తీసుకుంటే పప్పులో కాలేస్తామనీ, ప్రమాదంలో కూడా పడతామనీ చరిత్ర మనల్ని హెచ్చరిస్తోంది. మరి పాపులారిటీ మాత్రమే మనల్ని నడిపించకుండా ఉండాలంటే మనం ఎటువంటి ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంభించాలి?

**సరైన పద్ధతులను ఎంచుకోవడం**

మనం న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, ఆత్మగౌరవం మొదలైన విలువలపై ఆధారపడి సమీక్షించుకోవడంలోనే పై ప్రశ్నలకు జవాబు దాగి ఉంది. నాయకులు తక్షణం భావోద్వేగాలను ఎంతవరకు రేకెత్తించారు అన్నదానిమీద కాకుండా వారిని వారి ఆలోచనలు, సృజనాత్మకత మొదలైన విలువలు చరిత్రను ఎంతవరకు ప్రభావితం చేశాయి అన్న అంశాలమీద ఆధారపడి అంచనావేయాలి. ఇందులో కీలకమైన ప్రశ్నలు: వారి ప్రభావం మనిషిలోని శక్తిని మేల్కొల్పుతుందా లేక దానికి అడ్డంకులు సృష్టిస్తుందా? అది అర్ధవంతమైన స్వేచ్ఛలను విస్తృతపరుస్తుందా లేక కుంచింపజేస్తుందా? అది మానవుని ఆత్మగౌరవాన్ని పెంచుతుందా లేక తుంచుతుందా?

**“ మనకి ఏక గొంతుతో హర్షాతిరేకాలు వ్యక్తం చేసే దేశం కావాలా లేక వాదనకూ, ప్రశ్నలకూ, అసమ్మతికీ తావుండి అదే సమయంలో మౌలికంగా ఏకాత్మికమైన దేశం కావాలా? ఒక నాయకుని చేతిలో అధికారాన్ని పెట్టడం కాకుండా స్వేచ్ఛగా ఆలోచించే, మాట్లాడే, తమ భవిష్యత్తును ఐక్యతతో చురుకుగా నిర్మించుకునే ప్రజా సమూహపు సమిష్టి బలమే ప్రజాస్వామ్యం అంటే. ”**

ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవాలంటే మనం తక్షణ ఆకర్షణలను అధిగమించి నాయకుని పరిపాలనా సామర్థ్యాలు, విధానాలవల్ల తలెత్తే పర్యవసానాలను బేరీజు వేసుకోవాలి. పైకి కనిపించే పాపులారిటీని ఆరాధించడం కాకుండా ఈ పాపులారిటీ కోసం ప్రజాస్వామ్య సంస్థలు, క్రమాలు ఎంత మూల్యం చెల్లిస్తున్నాయి అని మనం ప్రశ్నించుకోవాలి.

మనకి ఏక గొంతుతో హర్షాతిరేకాలు వ్యక్తం చేసే దేశం కావాలా లేక వాదనకూ, ప్రశ్నలకూ, అసమ్మతికీ తావుండి అదే సమయంలో మౌలికంగా ఏకాత్మికమైన దేశం కావాలా? ఒక నాయకుని చేతిలో అధికారాన్ని పెట్టడం కాకుండా స్వేచ్ఛగా ఆలోచించే, మాట్లాడే, తమ భవిష్యత్తును ఐక్యతతో చురుకుగా నిర్మించుకునే ప్రజా సమూహపు సమిష్టి బలమే ప్రజాస్వామ్యం అంటే.

అందువల్ల నియంతృత్వ పోకడలను నిజమైన ప్రజాతంత్ర ప్రభుత్వంగా పొరబడకుండా జాగ్రత్త వహించడం పౌరుల బాధ్యత. తక్షణం చూస్తే నిర్ణయాత్మకమైన, సమర్ధవంతమైన నాయకత్వంగా కనిపించే నాయకత్వం దీర్ఘకాలంలో ప్రజాస్వామ్యాన్ని వమ్ము చేయవచ్చు.

**సాంస్కృతిక అక్షరాశ్యతను పెంపొందించడం అవసరం**

మళ్లీ మనం ఫ్రాంక్‌ఫర్ట్ మేధావి వర్గం దగ్గరకు వద్దాం. ప్రజాస్వామ్య సమాజంలోని పౌరులు “సాంస్కృతిక అక్షరాశ్యత” అనేదాన్ని అంటే ఏది సహజంగా వచ్చిన పాపులారిటీ, ఏది నిర్మించిన పాపులారిటీ అనే విషయాన్ని గుర్తించే సామర్థ్యాన్ని పెంపొందించాలని వాళ్ళు చెప్పారు. ముఖ్యంగా చాలా ఆధునిక పద్ధతుల్లో ప్రచారం, డిజిటల్ విస్తరణ జరుగుతున్న కాలంలో అటువంటి వివేచన చాలా అవసరం.

ప్రజలకు విమర్శనాత్మక చైతన్యం ఉండాలని ఫ్రాంక్‌ఫర్ట్ మేధావి బృందం నొక్కి చెప్పింది. అంటే అర్ధం ప్రజలు రాజకీయాల్లో అర్ధవంతంగా పాల్గొనడానికి ఓటింగ్ హక్కులుండడమొక్కటే సరిపోదు, ప్రజా సంస్కృతి రాజకీయ వాస్తవికతను తీర్చిదిద్దేటటువంటి అంతర్గత యంత్రాంగాలను అర్ధం చేసుకుని అవసరమైతే ప్రతిఘటించే సామర్థ్యాన్ని పౌరులు పెంపొందించుకోవడమే నిజమైన ప్రజాస్వామ్యం. భారత దేశంలోని భిన్నత్వం గల ప్రజాస్వామ్యంలో అటువంటి స్వతంత్ర భావజాలం గల పౌరులను తయారుచేసుకోవడం అత్యంత కీలకం. దాని వల్ల రాజకీయాలు కేవలం సాంస్కృతిక మెజారిటేరియనిజంగా మారిపోకుండా కాపాడగలుగుతాం. నిజమైన భిన్నత్వానికీ, విమర్శనాత్మక భాగస్వామ్యానికీ అవకాశం ఉండే ప్రజాస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకోగలుగుతాం.

ఫ్రాంక్‌ఫర్ట్ మేధావులు సాంస్కృతిక పరిశ్రమ గురించి దశాబ్దాల క్రితమే రాశారు. వారు రాసిన అంశాలు భారత దేశంలో ఈనాడు తయారుచేయబడుతున్న సమ్మతి (మ్యాన్యుఫాక్చర్డ్ కన్‌సెంట్)ని అర్ధం చేసుకుని ప్రతిఘటించడానికి మనకు తోడ్పడతాయి. విచ్ఛిన్నకరమైన కథనాలను వండివారుస్తున్న బాలీవుడ్ సినిమాలు కానీయండి, లేకుంటే కొంపలు తగలబెట్టే అబద్ధాలను గొంతుచించుకుని చెప్పే టెలివిజన్ వార్తలు కానీయండి లేక ప్రజల మధ్య విబేధాలను పెంచిపెద్దవి చేసే సోషల్ మీడియా ఆల్గోరిథమ్స్ కానీయండి...వీటన్నిటిలో పూసల్లో దారంలా కనిపించే సాంస్కృతిక దౌర్భాగ్యం ఒక్కటే.


ఈ పద్ధతులను గుర్తించి, క్రింది స్థాయిలో నిజమైన కృషికీ తయారు చేసిన పాపులారిటికీ మధ్య, సంస్థాగతమైన జవాబుదారీతనానికీ ప్రజాకర్షక వాగాడంబరానికీ మధ్య, విమర్శనాత్మక ఆలోచనా విధానానికీ భావోద్వేగంతో ఆడుకోవడానికీ మధ్య తేడాను అర్ధం చేసుకోగల మన సామర్థ్యం మీదనే ప్రజాస్వామ్య భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.

**(అనువాదం: ఎస్. వెంకట్రావు)**

# ఎప్‌స్టీన్ ఫైల్స్:

## పెట్టుబడిదారీ వ్యవస్థ దిగజారుడుకు దర్పణం

**ఎ కోటిరెడ్డి**



పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంతగా కుళ్ళిపోయిందో, బూర్జువా పార్టీల నాయకులు, దేశాధినేతలు, మంత్రులు, కార్పొరేట్ బాస్‌లు, బడా వ్యాపారులు, సమాజంలో వివిధ రంగాలలో ఉన్నత స్థానాలలో ఉన్నవారు ఏ విధంగా దిగజారిపోయారో జెఫ్రి ఎప్‌స్టీన్ ఫైళ్ళు ప్రపంచానికి వెల్లడి చేశాయి. ఎపిస్టీన్ అమెరికాలో ద్రవ్య వ్యాపారిగా పనిచేస్తున్న ముసుగులో మహిళలను వ్యభిచారంలోకి దించటం, బాలికలపై లైంగిక వేధింపులు, బలవంతంగా వ్యభిచారం చేయించటం తదితర నేరాలకు పాల్పడ్డాడు. ఈ విధమైన నేరపూరిత చర్యలలో ట్రంప్‌తోపాటు అనేకమంది దేశాధినేతలు, ఉన్నతస్థాయిలో ఉన్నవారు భాగస్వాములు అయ్యారు. మనదేశానికి సంబంధించి మోడి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న హర్‌దీప్‌సింగ్ పురి, కార్పొరేట్ సంస్థ యజమాని అనిల్ అంబాని పేర్లు కూడా ఎప్‌స్టీన్ ఫైళ్ళలో దర్శనం ఇచ్చాయి.

మహిళల పట్ల అత్యంత హీనమైన నేరాలకు పాల్పడిన ఎప్‌స్టీన్, బ్యాంకింగ్, ద్రవ్యరంగాలలో ప్రవేశించటానికి ముందు డాల్టన్ స్కూల్‌లో లెక్కల ఉపాధ్యాయునిగా తన జీవితాన్ని ప్రారంభించాడు. అనేక దశాబ్దాల పాటు శత కోటీశ్వరులకు పన్నులు, ఎస్టేట్ సేవలు అందిస్తూ, ప్రముఖులతో కూడిన ఒక కూటమిని తన చుట్టూ ఏర్పాటు చేసుకున్నాడు. మహిళలను బలవంతంగా వ్యభిచారంలోకి దించటం, మైనర్ బాలికలను భయపెట్టి వ్యభిచారం చేయిస్తున్నాడని 2008లో అతనిపై వచ్చిన ఆరోపణలు రుజువు కావటంతో శిక్ష పడింది. కానీ ప్రాసిక్యూటర్లతో రాజీ చేసుకోవటం ద్వారా జీవితకాలం జైలు శిక్షకు దారితీసే ఫెడరల్ నేరారోపణల నుండి తప్పించుకోగలిగాడు. (అమెరికాలో నేరపూరిత చర్యలకు పాల్పడిన వారిని రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని కోర్టులలో విచారణ జరుపుతారు. ప్రభుత్వానికి, రాజ్యాంగానికి వ్యతిరేకంగా నేరాలు చేసిన కేసులను కేంద్ర ప్రభుత్వ కోర్టులలో విచారణ జరుపుతారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కోర్టులు పక్క పక్కనే పని చేస్తుంటాయి.) దానితో జీవిత కాల శిక్షకు బదులుగా 18 నెలల జైలు శిక్షతో బయటపడ్డాడు. శిక్ష అనుభవించిన కాలంలో కూడా ఆఫీస్ పని పేరుతో రోజుకు 12 గంటల చొప్పున వారానికి ఆరురోజుల పాటు జైలు నుండి బయటకు రావటానికి అవకాశం కల్పించారు. ఈ విధంగా 13 నెలల జైలుశిక్ష అనుభవించిన తర్వాత ప్రొబేషన్ (సత్ప్రవర్తనతో జైలునుండి విడుదలై, బయట కోర్టు పర్యవేక్షణలో ఉండటానికి అవకాశం కల్పించటం)పై విడుదలయాడు. ఇటువంటి నీచమైన నేరాలకు పాల్పడిన కరుడుగట్టిన నేరస్తునిపై శిక్ష అనుభవించిన కాలంలో కూడా అధికారులు ఎంత ఉదారంగా వ్యవహరించా రన్నది అతను శిక్ష అనుభవించి, విడుదలైన తీరు వెల్లడిస్తున్నది.

2000 సంవత్సరంలో సెక్స్ వ్యాపారం చేయమని మైనర్ బాలికలను ప్రోత్సహించాడనే ఆరోపణలతో తిరిగి 2019లో అరెస్టు చేశారు. అతనిపై విచారణ ప్రారంభం కాకముందే మన్‌హట్టన్‌లోని ఫెడరల్ జైలులో పోలీసు కస్టడిలో ఆత్మహత్య చేసుకున్నాడు. అతని ఆత్మహత్యపై అనేక అనుమానాలు ఉన్నాయి.

**ఎప్‌స్టీన్ ఫైల్స్ ఎలా వెలుగు చూశాయి?**

పారదర్శకత, జవాబుదారీతనం తదితర అంశాలలో వచ్చిన వత్తిడితో తప్పనిసరి పరిస్థితులలో ఎప్‌స్టీన్ ఫైల్స్‌ను బహిరంగ పర్చటానికి అమెరికన్ కాంగ్రెస్ ఆమోదం తెలిపింది. 2025 జనవరిలో ట్రంప్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎప్‌స్టీన్ మరణం సున్నితమైనదిగా మారింది. అంతకు ముందు ఈ అంశంపై కేంద్రీకరించవద్దని ట్రంప్ రిపబ్లికన్‌లకు చెప్పాడు. కానీ తర్వాత తన వైఖరి మార్చుకున్నాడు. 2025, డిసెంబరు 12వ తేదీన హౌస్ ఓవర్ సైట్ కమిటీలోని డెమొక్రాట్లు ఎప్‌స్టీన్ అక్రమాలకు సంబంధించిన ఫోటోలను విడుదల చేశారు. మాజీ ట్రెజరి సెక్రెటరీ లారి సమ్మర్స్, ప్రపంచ కుబేరులలో ఒకడైన బిల్‌గేట్స్, సినీరంగంలో ప్రముఖ పాత్ర నిర్వహిస్తున్న వూడి అల్లెన్, ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సలహాదారు స్టీవ్ బానన్ తదితరులు ఆ ఫోటోలలో ఉన్నారు.


ఓవర్ సైట్ కమిటి విడుదల చేసిన డాక్యుమెంట్లతో పాటు ఎప్‌స్టీన్‌కు సంబంధించిన మొత్తం డాక్యుమెంట్లను విడుదల చేయటానికి న్యాయ విభాగానికి 30 రోజుల సమయం ఇస్తూ కాంగ్రెస్ బిల్లును ఆమోదించింది. 2025, నవంబరు 19న ఈ బిల్లుపై ట్రంప్ సంతకం చేయటంతో చట్టంగా మారింది. ఫిబ్రవరి నెల మొదట్లో ఇదే కమిటి ఎప్‌స్టీన్ ద్రవ్య లావాదేవీలకు సంబంధించి జెపి మోర్గాన్ ఛేజ్, డచ్‌బ్యాంకుల డాక్యుమెంట్లను బహిరంగ పర్చింది. కరీబియన్‌లోని అతని స్వంత దీవిలో జరిగిన అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన వీడియోలు, ఫోటోలను విడుదల చేసింది. 2014లో ఎప్‌స్టీన్ కామర్స్ సెక్రటరి హోవర్డ్ లుట్నిక్‌తో వ్యాపార లావాదేవీలు నిర్వహించిన వాటితో పాటు అనేక ఫైళ్ళను అమెరికా న్యాయ విభాగం బహిరంగపర్చింది.

**ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో పేర్లున్న వివిధ దేశాల నాయకులు**

బాలలను లైంగిక కార్యకలాపాలకు వినియోగించిన నేరంలో ఎప్‌స్టీన్ నేరస్తుడని 2008లోనే రుజువైనప్పటికీ, 2019లో చనిపోయే వరకు అనేక దేశాలకు చెందిన నాయకులు, వ్యాపారులు, సెలబ్రిటీలు, రాజ కుటుంబాలకు చెందినవారు అతనితో సంబంధాలు కొనసాగించారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో వీడియోలు, ఆడియోలు, ఫోటోలు, ఈ మెయిల్ సందేశాలు ఉన్నాయి. న్యాయశాఖ ఈ ఫైల్స్‌ను ఆన్‌లైన్‌లో విడుదల చేసిన మరుచటి రోజు అందులో నుండి 16 డాక్యుమెంట్‌లు అదృశ్యమయ్యాయి. మాయమైన వాటిలో ప్రస్తుత

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఆయన భార్య మెలానియా ట్రంప్ ఎప్‌స్టీన్‌తో ఉన్న ఫోటోలు ఉన్నాయి. యాక్టర్-సింగర్ దయానా రోస్, మైకెల్ జాక్సన్, ఆస్కార్ అవార్డు పొందిన కెవిన్ స్పేసి, రోలింగ్ స్టోన్స్, అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్‌క్లింటన్ తదితరులతో కలిసి ఎప్‌స్టీన్ గ్రూప్‌గా, విడిగా ఫోటోలు దిగాడు. డచ్ యువరాణి సారా పెర్గుసన్ ఈ ఫోటోలలో ఉన్నది. ఆమె మాజీ భర్త, బ్రిటిష్ మాజీ రాజు అండ్రూ పేరు తరచుగా ఈ ఫైల్స్‌లో కనిపిస్తున్నది. ఎప్‌స్టీన్ 6-8 సంవత్సరాల వయసున్న ఒక బాలికను కరెంటు షాకులతో హింసిస్తుంటే అండ్రూ చూసి ఆనందించాడని ఎఫ్‌బిఐ విడుదల చేసిన ఫైల్స్‌లో పేర్కొన్నది. అమెరికా మాజీ ట్రెజరి సెక్రెటరీ లారి సమ్మర్స్, అమెరికా హెల్త్ సెక్రెటరీ రాబర్ట్ ఎఫ్ కెన్నెడి జూనియర్, ఇజ్రాయిల్ మాజీ ప్రధాని ఎహుద్ బారక్, ఎలాన్ మస్క్, బిల్‌గేట్స్ వీటిలో ఉన్నారు. ట్రంప్ రెండవ భార్య మర్ల మేపుల్స్, ట్రంప్ కుమార్తె టిఫాని ట్రంప్ కూడా ఉన్నారు. ప్రపంచంలో పెట్టుబడిదారీ విధానానికి అగ్రస్థానంలో ఉండి, విధానపరంగా దిశానిర్దేశం చేస్తున్న అమెరికన్ సమాజంలో అధికారం, పదవులు, సంపదలు, పేరు ప్రతిష్ఠలు ఉన్నవారు మహిళలు, బాలికలపై నేరాలకు పాల్పడిన ఎప్‌స్టీన్ లాంటి తార్పుడు గాడికి ఖాతాదారులుగా ఉన్నారంటే ఆ సమాజం ఏ విధంగా పతనమైందో అర్థం చేసుకోవచ్చు. గతంలో 2016-20 సంవత్సరాలు, తిరిగి 2025 జనవరి నుండి అమెరికా అధ్యక్షునిగా కొనసాగుతున్న ట్రంప్, ఆయన ఇద్దరు భార్యలు, కుమార్తె ఒకే తార్పుడుగాడికి ఖాతాదారులుగా ఉండటం బూర్జువా వ్యవస్థ బాగుచేయటానికి వీలులేనంతగా అథ:పాతాళానికి జారిపోయిందన్న వాస్తవాన్ని వెల్లడి చేస్తున్నది.

**"భారతశతకోటీశ్వరుల్లో ఒకడైన అనిల్ అంబాని పేరు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో వెల్లడైంది. భారతదేశానికి రాబోయే అమెరికా రాయబారి నుండి ప్రధాని మోడితో అమెరికా ఉన్నతాధి కారుల సమావేశాలు ఏర్పాటు చేయటం వరకు వారి సంభాషణల్లో ఉన్నాయి. ట్రంప్ తొలిసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన రెండు నెలల తర్వాత 2017, మార్చి 16న ట్రంప్ సర్కిల్ లోని ఉన్నతాధి కారులైన జారెడ్ కుర్చనర్, స్టీవ్ బానన్‌లతో కలవ టానికి "నాయ కత్వం" సహాయం కోరిందని అనిల్ అంబాని పంపిన మెసేజ్‌లో పేర్కొన్నాడు."**



2000వ సంవత్సరంలో అమెరికాలోని ఫ్లొరిడాలో ఎప్‌స్టీన్‌తో కలిసి ఫోటోలో ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆయన భార్య మెలానియా

### ఎప్‌స్టీన్ ఫైల్స్ బయటపడ్డ తరువాత పదవులు కోల్పోయినవారు

2026, ఫిబ్రవరిలో వెల్లడైన ఫైల్స్ 30 లక్షల పేజీలకు పైగా ఉన్నాయి. ఎప్‌స్టీన్ ఫైల్స్‌ను బహిరంగ పరచిన తర్వాత వాటిలో పేర్లున్న అనేక దేశాలకు చెందిన రాజకీయ నాయకులు, రాజ కుటుంబాలకు చెందిన వారు, ఉన్నతస్థాయి అధికారులు తమ పదవులకు రాజీనామా చేశారు. ప్రపంచ ఆర్థికఫోరం ప్రెసిడెంట్ బోర్జ్ బ్రెండే రాజీనామా చేస్తాడని ఫిబ్రవరి 26న ప్రకటించారు. స్లోవేనియా మంత్రి మిరోస్లావ్ లాజక్, నార్వే రాయబారి మోనా జుల్, యుకె హౌస్ ఆఫ్ లార్డ్స్ మెంబర్ పీటర్ మండెల్ సన్, ప్రపంచంలో అత్యంత ప్రఖ్యాతి చెందిన హార్వర్డ్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ లారెన్స్ హెచ్ సమ్మర్స్, హయత్ హొటల్స్ యజమానికి వారసుడైన థామస్ ప్రిట్జకర్, గోల్డ్‌మాన్ శాక్స్ లాయర్ కథి ఉమ్లర్, డిపి వరల్డ్ ఛైర్మన్, సిఇవో సుల్తాన్ అహ్మద్ బిన్ సులాయం, తదితరులు తమ పదవులకు రాజీనామా చేసినవారిలో ఉన్నారు. ఎప్‌స్టీన్ 2003-04 సంవత్సరాలలో యుకె లేబర్ పార్టీ ప్రధాన కార్యదర్శి మండెల్ సన్‌కు మూడు దఫాలుగా 75,000 డాలర్లు చెల్లించినట్లు ఈ ఫైల్స్‌లో వెల్లడికావటంతో రాజీనామా చేశాడు. ఆస్ట్రేలియా మాజీ ప్రధాని కెవిన్ రుడ్ పేరు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉన్నది. బ్రిటన్ మాజీ యువరాజు అండ్రూ పదవులతో పాటు రాజ కుటుంబానికి చెందిన బిరుదులను కూడా కోల్పోయాడు. నార్వే రాజకుటుంబానికి వారసుడైన హోకన్‌ను వివాహమాడిన రాజకుమారి మెట్టే మారిట్ పేరు 1000 సార్లకు పైగా చోటు చేసుకుంది. ఎప్‌స్టీన్, మారిట్‌కు మధ్య అనేక ఇమెయిల్స్ నడిచాయి.

### ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో మోడీ

భారతీయ శతకోటీశ్వరులలో ఒకడైన అనిల్ అంబాని పేరు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో వెల్లడైంది. భారతదేశానికి రాబోయే అమెరికా రాయబారి నుండి ప్రధానమంత్రి నరేంద్ర మోడితో అమెరికా ఉన్నతాధికారుల సమావేశాలు ఏర్పాటు చేయటం వరకు వారి సంభాషణలలో భాగంగా ఉన్నాయి. ట్రంప్ మొదటిసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన రెండు నెలల తర్వాత 2017, మార్చి 16వ తేదీన ట్రంప్ సర్కిల్‌లోని ఉన్నతాధికారులైన జారెడ్ కుర్చనర్, స్టీవ్ బానన్‌లతో కలవటానికి "నాయకత్వం" సహాయం కోరిందని అనిల్ అంబాని పంపిన మెసేజ్‌లో పేర్కొన్నాడు. ట్రంప్‌ను కలవటం కోసం మోడి అమెరికా రావటానికి తగిన సలహా ఇవ్వమని కూడా కోరాడు. ఇజ్రాయిల్ అనుసరించాల్సిన వ్యూహంపై జరుగుతున్న చర్చలు మోడి పర్యటన తేదీలను నిర్ణయించటాన్ని ప్రభావితం

> **“ ప్రస్తుత కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పురి పేరు కూడా ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉన్నది. 2015-17 సంవత్సరాల మధ్య మన్‌హట్టన్ లోని ఎప్‌స్టీన్ నివాసంలో మూడుసార్లు పురి ఆయనను కలిశాడు. తాను కేవలం వ్యాపారం, పెట్టుబడులకు సంబంధించిన అంశాలను చర్చించటానికి మాత్రమే ఎప్‌స్టీన్‌ను కలిశాని హర్దీప్‌సింగ్ పురి బుకాయిస్తున్నాడు. ”**

చేస్తున్నాయని ఎప్‌స్టీన్ పేర్కొన్నాడు. 2017, జూన్ 26వ తేదీన మోడి అమెరికా పర్యటనలో ట్రంప్‌ను కలుసుకున్నారు. ఆ తర్వాత వారం రోజులకు, జులై 6వ తేదీన మోడి ఇజ్రాయిల్‌లో పర్యటించారు. మోడి ఇజ్రాయిల్ పర్యటించిన జులై 6 తర్వాత ఎప్‌స్టీన్ జబర్‌వై అనే గుర్తు తెలియని వ్యక్తికి పంపిన ఇ మెయిల్‌లో “భారత ప్రధాని మోడి సలహా తీసుకున్నాడు. అమెరికా అధ్యక్షుని ప్రయోజనాలను నెరవేర్చటానికి ఇజ్రాయిల్‌లో ఆడిపాడాడు. వారు కొన్ని వారాల క్రితం కలిశారు. అది పని చేసింది” అని పేర్కొన్నాడు.

ఈ అంశాలను పరిశీలిస్తే తమ ప్రపంచ వ్యూహంలో భారతదేశాన్ని పావుగా వినియోగించుకోవటానికి ట్రంప్, అమెరికా నాయకత్వం వ్యూహం రూపొందించిందని, దానికి అనుగుణంగా భారతదేశ ప్రధాన మంత్రి మోడిని ఉపయోగించుకున్నదని ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో పేర్కొన్న అంశాలు స్పష్టం చేస్తున్నాయి. అమెరికా, ఇజ్రాయిల్‌లు మధ్యప్రాచ్యంలో తమ ప్రయోజనాలను నెరవేర్చుకోవటానికి అవసరమైన వ్యూహాన్ని రూపొందించాయి. దాని అమలులో భారతదేశాన్ని కూడా భాగస్వామిని చేయటం కోసం మోడిని అమెరికా పర్యటనకు ఆహ్వానించారు. ఎప్‌స్టీన్ ద్వారా అనిల్ అంబాని మోడి అమెరికా పర్యటనకు అవసరమైన ఏర్పాట్లు చేశాడు. మోడి ఇజ్రాయిల్ పర్యటన కార్యక్రమాన్ని రూపొందించారు. అమెరికా పర్యటన అనంతరం వారి పథకానికి అనుగుణంగా మోడి ఇజ్రాయిల్‌లో పర్యటించారు. మన విదేశాంగ విధానంలో భాగమైన స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు మద్దతు ఇచ్చే అంశాన్ని మోడి పక్కన పెట్టారు. పాలస్తీనా ప్రభుత్వం, అధికారులను పట్టించుకోలేదు.

మన రాజకీయ, విదేశాంగ విధానాలను నిర్ణయించటం, అమలు చేయటంలో ఎటువంటి బ్రోకర్లు వేలు పెడుతున్నారో కూడా ఈ ఫైల్స్‌లోని అంశాలు స్పష్టం చేస్తున్నాయి. విశ్వగురు పేరుతో డబ్బా కొట్టుకొంటుంటే, దళారులు మనదేశ విదేశాంగ విధానంలో జోక్యం చేసుకొంటున్నారు.

ప్రస్తుత కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పురి పేరు కూడా ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉన్నది. 2015-17 సంవత్సరాల మధ్య మన్‌హట్టన్ లోని ఎప్‌స్టీన్ నివాసంలో మూడుసార్లు పురి ఆయనను కలిశాడు. తాను కేవలం వ్యాపారం, పెట్టుబడులకు సంబంధించిన అంశాలను చర్చించటానికి మాత్రమే ఎప్‌స్టీన్‌ను కలిశాని హర్దీప్‌సింగ్ పురి బుకాయిస్తున్నాడు.

**అనిల్ అంబానికి భారీ లబ్ది**

ఫ్రాన్స్ నుండి యుద్ధ విమానాల కొనుగోలు కాంట్రాక్టులలో భాగస్వామిగా చేయటం ద్వారా అమెరికా పర్యటనకు ఏర్పాట్లు చేస్తున్న అనిల్ అంబానిని మోడి బాగానే సత్కరించారు. ఫ్రాన్స్ నుండి రాఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేయటం కోసం 2016లో భారతదేశం-ఫ్రాన్స్ మధ్య ఒప్పందం జరిగింది. అప్పటికే ఆ ఒప్పందంపై జరుగుతున్న చర్చలలో భారతదేశంలో నిర్మించే రాఫెల్ యుద్ధ విమానాలను ప్రభుత్వ సంస్థ అయిన హిందుస్థాన్ ఎరోనాటిక్స్ లిమిటెడ్(హాల్) భాగస్వామ్యంతో తయారు చేయాలని నిర్ణయించారు. కానీ అప్పటికి ఉనికిలో లేని అనిల్ అంబాని విమానాల తయారి సంస్థను యుద్ధ విమానాల నిర్మాణంలో భాగస్వామిగా చేయాలని ఒప్పందంలో పేర్కొన్నారు. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా! మోడి తలచుకొంటే అనిల్ అంబాని లబ్ది పొందటానికి ఆటంకాలు ఉంటాయా!

**మహిళలు, బాలికలతో బలవంతంగా వ్యభిచారం చేయించిన ఎప్‌స్టీన్**

ఎప్‌స్టీన్ బీచ్‌ఫ్రంట్ మేన్షన్‌లో మసాజ్ చేయటంలో పాల్గొన్న 30 మంది మహిళలతో తాను సంభాషించానని, అతను మహిళలు, బాలికలను వ్యభిచారంలోకి దించిన తీరును వారు వివరించారని ఫ్లోరిడాకు చెందిన ఒక డిటెక్టివ్ పేర్కొన్నాడు. మహిళలు, బాలికలను ఎప్‌స్టీన్ వద్దకు చేర్చటంలో ఎప్‌స్టీన్ స్నేహితురాలు జిస్‌లేన్ మాక్స్‌వెల్ ముఖ్యమైన పాత్ర నిర్వహించింది. బాధితులలో కొందరు ఫిర్యాదు చేయటంతో ఆమెపై కోర్టులో కేసు నడుస్తున్నది. తాను సంభాషించిన మహిళలలో ఇద్దరికి మాత్రమే మసాజ్ చేయటంలో అనుభవం ఉన్నదని, ఎక్కువ మంది 18 సంవత్సరాల కన్నా తక్కువ వయసు వారేనని అతను పేర్కొన్నాడు. తన వద్దకు వచ్చి మహిళకు వారి స్నేహితులను కూడా తీసుకురమ్మని ఎప్‌స్టీన్ డబ్బు ఇచ్చేవాడు. 18 సంవత్సరాల లోపు వారిలో ఎక్కువ మందిని లైంగిక కార్యకలాపాలలో వినియోగించటానికి ఎప్‌స్టీన్ అనుసరించిన పద్ధతులలో ఇది ఒకటి.

**నిపుణుల కమిటి విచారణ**

ఎప్‌స్టీన్ చేసిన నేరాలపై విచారణ జరపటం కోసం ఐక్యరాజ్యసమితి నియమించిన స్వతంత్ర నిపుణుల బృందం ఎప్‌స్టీన్ చేసిన నేరాలు మహిళకే కాకుండా మానవత్వానికే మచ్చగా ఉన్నాయని నివేదికలో పేర్కొంది.

**(మిగతా 35వ పేజీలో)**

**చదవండి! చదివించండి!!**

# Marxist

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సైద్ధాంతిక త్రైమాస ఆంగ్ల పత్రిక**

వెల: ఒక ప్రతి రూ. 50

ప్రతులకొరకు

**The Manager,**

The Manager, Marxist, A. K. Gopalan Bhawan
27-29 Bhai Vir Singh Marg, New Delhi 110001
Phone: (91-11) 23348725; Email: pdpbln@gmail.com
Marxist is also available online at: https://cpim.org/the-marxist

టెక్నాలజీ

# కార్పొరేట్ల కోసం డేటా సెంటర్లు - ప్రజల వనరులపై దాడి



కవితా కబీర్ వ్యంగ్య రచయిత్రి. ప్రస్తుతం ఆమె ది వైర్ వెబ్ పత్రికలో 'క్రాక్నామిక్స్', 'డిజిటల్ అరెస్ట్' కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**కవితా కబీర్**

ప్రజలు నిరసనలు వ్యక్తం చేయడంతో న్యూజెర్సీ రాష్ట్రంలోని ఒక నగర కౌన్సిల్ ఎఐ డేటా సెంటర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి చివరిలో ఓటు వేసింది. ఈ డేటా సెంటర్ నిర్మాణం వల్ల కరెంటు, నీటి బిల్లులు భారీగా పెరుగుతాయినీ, స్థానిక పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందనీ ప్రజలు భావిస్తున్నారు. ఇప్పుడు ఆ ప్రాంతంలో ప్రతిపాదించిన డేటా సెంటర్‌కు బదులుగా 600 కొత్త అపార్ట్‌మెంట్లు నిర్మించాలని నిర్ణయించారు. వాటిలో 10 శాతం చౌక ధరలో గృహాలు నిర్మిస్తారు. వీటితోపాటుగా గిడ్డంగులు, చిన్న వ్యాపారాల కోసం స్థలాలు, అలాగే ఒక పార్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

అమెరికాలో కొత్త డేటా సెంటర్ ప్రాజెక్టులు ఆలస్యం కావడం లేదా రద్దు కావడం ఇదొకటి మాత్రమే కాదు. 'డేటా సెంటర్ వాచ్' అనే సంస్థ మే 2024 నుండి మార్చి 2025 మధ్య అమెరికాలోని 28 రాష్ట్రాలలో భారీ స్థాయి డేటా సెంటర్ ప్రాజెక్టులకు ఎదురవుతున్న వ్యతిరేకతను ట్రాక్ చేసింది. దాని ఫలితంగా 6,400 కోట్ల డాలర్ల విలువైన డేటా సెంటర్ ప్రాజెక్టులు నిలిపివేయబడ్డాయి లేదా ఆలస్యమయ్యాయి. ఇంకా ఆసక్తికరమైన విషయం ఏమిటంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన "మాగా" (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) మద్దతుదారులు కూడా డేటా సెంటర్లకు వ్యతిరేకంగా ఈ ఉద్యమంలో చేరారు. 'పబ్లిక్ ఫస్ట్' నిర్వహించిన తాజా సర్వే ప్రకారం ట్రంప్‌కు ఓటు వేసిన వారిలో సుమారు 60 శాతం మంది ఎఐ అభివృద్ధి వేగంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సుమారు 80 శాతం మంది టెక్నాలజీపై నియంత్రణ ఉండాలని భావిస్తున్నారు. అమెరికాలోని రైతులు కూడా తమ భూములను డేటా సెంటర్ల కోసం ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో అమెరికాలో ఎఐ రంగాన్ని ముందుకు నడిపిస్తున్న పెద్ద టెక్ కంపెనీలు ఇప్పుడు ఇతర దేశాల్లో తమ డేటా సెంటర్లను విస్తరించేందుకు చూస్తున్నాయి. భారతదేశం టెక్ కంపెనీలకు రెడ్ కార్పెట్ వేసి ఆహ్వానం పలుకుతోంది. ఎఐ సదస్సు కంటే ముందుగానే 2026 బడ్జెట్‌లో డేటా సెంటర్లు స్థాపించే విదేశీ కంపెనీలకు 20 సంవత్సరాల పాటు పన్ను మినహాయింపు ఇవ్వాలని మోదీ ప్రభుత్వం ప్రకటించింది. డేటా సెంటర్లు, ముఖ్యంగా ఎఐ డేటా సెంటర్లు భారీగా విద్యుత్తును, నీటిని వినియోగిస్తాయని తెలిసిందే. అంచనాల ప్రకారం 2024లో భారతదేశంలోని డేటా సెంటర్లు సుమారు 15,000 కోట్ల లీటర్ల నీటిని వినియోగించాయి. ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో (సుమారు 5,000) డేటా సెంటర్లు ఉన్న అమెరికా, 2021 ఒక్క ఏడాదిలోనే 16,370 కోట్ల గ్యాలన్లు అంటే సుమారు 62,000 కోట్ల లీటర్ల నీటిని వినియోగించాయి. ఇది ఒక చిన్న పట్టణానికి అవసరమైన వార్షిక నీటి అవసరంతో సమానం.

కంపెనీలు చాలా సందర్భాల్లో తాము ఉపయోగించే నీరు, విద్యుత్ పరిమాణాన్ని తక్కువగా చూపుతుంటాయి. ఇంకా అనేక దేశాల్లో వాటి వినియోగాన్ని తప్పనిసరిగా వెల్లడించాలనే నిబంధనలు కూడా లేవు. ఉదాహరణకు 2023లో గూగుల్ తన డేటా సెంటర్లు 610 కోట్ల గ్యాలన్ల నీటిని వినియోగించాయని వెల్లడించింది. కానీ ఈ అవసరం తరువాతి సంవత్సరాల్లో మరింత పెరిగింది.

నేడు భారతదేశంలో 270 కంటే ఎక్కువ డేటా సెంటర్లు ఉన్నాయి. మహారాష్ట్ర 85 డేటా సెంటర్లతో అగ్రస్థానంలో ఉండగా, తమిళనాడులో 35, కర్ణాటకలో 32 ఉన్నాయి. కర్ణాటకలో ఉన్న 32 డేటా సెంటర్లలో 31 బెంగళూరులోనే ఉన్నాయి. అందులో ఏడు డేటా సెంటర్స్ ఒక్క వైట్‌ఫీల్డ్ ప్రాంతంలోనే ఉన్నాయి. ఈ పరిస్థితిలో బెంగళూరులో నీటి సమస్యను అధ్యయనం చేయడం చాలా ముఖ్యం. ఐటి నగరంగా ప్రసిద్ధి చెందిన ఈ నగరం ఇప్పుడు తాగునీటి కొరతతో "ట్యాంకర్ సిటీ"గా మారుతోంది. సమీప భవిష్యత్తులో తాగునీరు అయిపోయే అవకాశం ఉన్న నగరాల జాబితాలో బెంగళూరు నగరం ముందువరుసలో ఉంది.

'డెలాయిట్' అధ్యయనం ప్రకారం ఒక మెగావాట్ సామర్థ్యం ఉన్న డేటా సెంటర్ రోజుకు సుమారు 68,500 లీటర్ల నీటిని వినియోగిస్తుంది. 20 మెగావాట్ సామర్థ్యం ఉన్న ఒక డేటా సెంటర్‌కు రోజుకు సుమారు 14 లక్షల లీటర్ల నీరు అవసరమవుతుంది. ఇది 27,000 కుటుంబాలు కలిసి ఒక రోజులో వినియోగించే నీటికి సమానం. 2020లో భారతదేశంలోని డేటా సెంటర్ల మొత్తం సామర్థ్యం 520 మెగావాట్లు మాత్రమే ఉండేది. 2025 నాటికి అది 1.5 గిగావాట్లకు పెరిగింది. 2030 నాటికి ఇది 4.5 నుంచి 6.5 గిగావాట్లకు చేరుకోవచ్చని అంచనా.

భూమిపై ఉన్న మొత్తం నీటిలో కేవలం 3% మాత్రమే తాగునీరు. అందులో కేవలం 0.5% మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉంది. అదే నీటిని మనం వ్యవసాయం, పరిశ్రమలు, ఇతర అవసరాల కోసం కూడా ఉపయోగిస్తాము. ఇందులో ఎంత భాగాన్ని మనం డేటా సెంటర్లకు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నామో ప్రకటించలేదు. విద్యుత్ వినియోగం విషయంలో కూడా పరిస్థితి అంతే తీవ్రంగా ఉంది. ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ నివేదిక ప్రకారం భారతదేశంలోని డేటా సెంటర్లు సుమారు 10-15 టెరావాట్-గంటల (టిడబ్ల్యుహెచ్) విద్యుత్‌ను వినియోగిస్తున్నాయి. 2030 నాటికి ఇది 40-45 టెరావాట్ గంటలకు పెరిగే అవకాశం ఉంది. ఒక టెరావాట్ అంటే 1000 గిగావాట్లు. ఇది లక్షలాది ఇళ్లకు విద్యుత్ అందించగల సామర్థ్యంతో సమానం.

2030 నాటికి దేశంలో మొత్తం విద్యుత్ డిమాండ్‌లో డేటా సెంటర్ల వాటా సుమారు

> ❝ డేటా సెంటర్ల విద్యుత్ వినియోగంపై ఇప్పటికే అనేక నివేదికలు వెలువడ్డాయి. వాటిని కార్బన్ ఉద్గారాలతో పోల్చుతు న్నారు. డేటా సెంటర్లు ఒక ప్రాంతంపై భారం మాత్రమే కాకుండా, పర్యావరణానికి కూడా పెద్ద సవాల్‌గా మారుతుంది. ఉదాహరణకు బ్రిటన్‌లో డేటా సెంటర్లు గృహ సంక్షోభానికి కారణమయ్యాయి. అక్కడ విద్యుత్ గ్రిడ్ సామర్థ్యం పూర్తిగా నిండిపోవడంతో కొత్త ఇళ్ల నిర్మాణాల అనుమతులు ఆలస్యం అవుతోంది. నీరు, విద్యుత్ లేని పరిస్థితిలో కొత్త ఇళ్లు నిర్మించకోవడం సాధ్యం కాదు. ❞

2.5% నుంచి 3% వరకు ఉండొచ్చు. ఇదిపెద్ద శాతంలా అనిపించకపోవచ్చు. కానీ ఇది ఇప్పటికే ఓవర్లోడ్ అయిన రాష్ట్ర గ్రిడ్లను ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో, గ్రిడ్స్‌పై పీక్ లోడ్ 5% నుండి 20% వరకు పెరగవచ్చు. విద్యుత్ పునరుత్పాదక శక్తి ఇక్కడ కొంత మేరకు సహాయపడి ఉండేది, కానీ పునరుత్పాదక ఇంధనాలలో గణనీయమైన పెట్టుబడులు ఉన్నప్పటికీ, అక్కడ ఉత్పత్తి అయిన విద్యుత్తు, గ్రిడ్లకు చేరడం లేదు. ఎందుకంటే ట్రాన్స్‌మిషన్ మౌలిక సదుపాయాలు బలహీనంగా ఉన్నాయి.

డేటా సెంటర్ల విద్యుత్ వినియోగంపై ఇప్పటికే అనేక నివేదికలు వెలువడ్డాయి. వాటిని కార్బన్ ఉద్గారాలతో పోల్చుతున్నారు. డేటా సెంటర్లు ఒక ప్రాంతంపై భారం మాత్రమే కాకుండా, పర్యావరణానికి కూడా పెద్ద సవాల్‌గా మారుతుంది. ఉదా హరణకు బ్రిటన్‌లో డేటా సెంటర్లు గృహ సంక్షోభానికి కారణమయ్యాయి. అక్కడ విద్యుత్ గ్రిడ్ సామర్థ్యం పూర్తిగా నిండిపోవడంతో కొత్త ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం ఆలస్యం అవుతోంది. నీరు, విద్యుత్ లేని పరిస్థితిలో కొత్త ఇళ్లు నిర్మించకోవడం సాధ్యం కాదు.

2025 డిసెంబర్‌లో లండన్ అసెంబ్లీ ప్లానింగ్ అండ్ రీజెనరేషన్ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం పశ్చిమ లండన్‌లో కొన్ని కొత్త హౌసింగ్ ప్రాజెక్టులు విద్యుత్ గ్రిడ్ పూర్తి సామర్థ్యానికి చేరుకోవడంతో తాత్కాలికంగా ఆలస్యమయ్యాయి. 2024లో యూకే మొత్తం విద్యుత్ డిమాండ్‌లో డేటా సెంటర్లు 10 శాతం వాటాను కలిగి ఉన్నాయి, ఇది 2025 –2050 మధ్య 600 శాతం పెరుగుతుందని భావిస్తున్నారు. నీరు, విద్యుత్ సమస్యలు కొంతవరకు మీడియాలో చర్చకు వస్తున్నా, భారీ ఎఐ డేటా సెంటర్లతో తలెత్తే మరికొన్ని సమస్యలు బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**అందులో ఒకటి శబ్ద కాలుష్యం**

డేటా సెంటర్లలో సర్వర్లు, నెట్‌వర్క్ స్విచ్‌లు, రూటర్లు, కూలింగ్ సిస్టమ్‌లు నిరంతరం పనిచేస్తాయి. వీటి వల్ల 80 డిబిఎ కంటే ఎక్కువ శబ్దం ఉత్పత్తి అవుతుంది. ఇది నగర ట్రాఫిక్, హెయిర్ డ్రైయర్ లేదా మిక్సీ శబ్దానికి సమానం. ఈ నిరంతర శబ్దం వల్ల నిద్ర భంగం, తలనొప్పులు, రక్తపోటు, ఆందోళన, వినికిడి సమస్యలు, గుండె సంబంధిత ప్రమాదాలు వంటి ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది.

మరో ఆందోళన ఏమిటంటే? డేటా సెంటర్ల నుండి వెలువడే భారీ స్థాయి ఈ–వేస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాలు). సర్వర్లు, బ్యాటరీలు, నెట్‌వర్క్ పరికరాలను 3–6 ఏళ్లలోపు మార్చాల్సి ఉంటుంది. జనరేటర్లు, ఎయిర్ కండిషనింగ్ సిస్టమ్‌లను ప్రతి దశాబ్దానికి ఒకసారి మార్చాలి. 2024లో 'నేచర్ కంప్యూటేషనల్ సైన్స్' చేసిన అధ్యయనం ప్రకారం, 2030 నాటికి ఈ–వేస్ట్ 12 నుండి 50 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకోవచ్చని అంచనా వేసింది. ఇది 2023లో ఉత్పత్తి అయిన దానికంటే 1000 రెట్లు ఎక్కువ. టెక్నాలజీ వేగంగా మారుతున్నందున మరింత వేగవంతమైన చిప్స్, మెరుగైన పరికరాలు అందుబాటులోకి వచ్చినప్పుడు ఈ డేటా సెంటర్లు తమ వ్యవస్థలను అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంటుంది. దాంతో ఈ–వేస్ట్ మరింత పెరుగుతుంది.

**డేటా సెంటర్లు–ఉద్యోగ కల్పన**

భారత ప్రభుత్వానికి డేటా సెంటర్లు ఆకర్షణీయంగా కనిపించడానికి ఒక కారణం, నిర్మాణ దశలోనే తక్షణ ఉద్యోగాలు వస్తాయని బావించడం. పెద్ద ప్రాజెక్టులు మొదలైతే అభివృద్ధి వస్తుందని ప్రజలు భావిస్తారు. కానీ ఒకసారి డేటా సెంటర్లు నిర్మాణం పూర్తయ్యాక వాస్తవం భిన్నంగా ఉంటుంది. ఒక డేటా సెంటర్ సగటున 20 నుండి 100 మందికి మాత్రమే ఉద్యోగాలను కల్పిస్తుంది.

గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీలు వేలాది ఉద్యోగాలను ఇస్తామని వాగ్దానం చేసిన చిలీ దేశం ఇందుకు ఒక ఉదాహరణ. 'రెస్ట్ ఆఫ్ వరల్డ్' అనే సంస్థ 2012 నుండి 2025 వరకు 17 డేటా సెంటర్ ప్రాజెక్టులపై విశ్లేషణ చేసింది. ఈ డేటా సెంటర్లు తాము ఎంత మందిని నియమించుకున్నామో? స్వయంగా వెల్లడించవు. కాబట్టి వారు దాఖలు చేసిన పర్యావరణ సమీక్ష ఫైళ్ల ఆధారంగా, ఈ సెంటర్లు అన్నీ కలిసి కేవలం 1,547 పర్మినెంట్ ఉద్యోగులను మాత్రమే నియమించుకున్నాయని తేలింది. ఆ ఉద్యోగాలలో ఎక్కువ భాగం సెక్యూరిటీ, క్లీనింగ్ విభాగాల్లోనే ఉన్నాయి.

**ఎఐ–బ్యాక్ ఎండ్ ఉద్యోగాలు**

డేటా సెంటర్ల కంటే భారత్‌లో పెరుగుతున్నది ఎఐ బ్యాక్ ఎండ్ ఉద్యోగాలు. ముఖ్యంగా డేటా అనోటేషన్ ఉద్యోగాలు కోసం ముఖ్యంగా చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని కంపెనీలు సుమారు 70,000 మందిని నియమించుకుంటున్నాయి. వీరి పని ఎఐకి ప్రాథమిక విషయాలు నేర్పడం. ఉదాహరణకు: పిల్లి, పులికి మధ్య తేడా గుర్తించడం, టవల్ ఎలా మడవాలి వంటి వంటి ప్రాథమిక విషయాలను ఎఐకి నేర్పించే వారు వీరే. ఈ డేటా అనోటేషన్ పరిశ్రమ మార్కెట్ విలువ సుమారు 25 కోట్ల డాలర్లు. కానీ ఇటీవల ది గార్డియన్ పత్రిక ఈ రంగంలోని చీకటి కోణాన్ని నివేదించింది. చిన్న పట్టణాల్లోని యువతులతో గంటల కొద్దీ లైంగిక హింసతో కూడిన కంటెంట్‌ను చూపిస్తూ, ఏది అభ్యంతరకరమైన కంటెంట్, ఏది కాదో ఎఐకి నేర్పించేలా చేస్తున్నారు. వీరికి తక్కువ జీతాలతో పాటు, ఉద్యోగ భద్రత కూడా ఉండదు. ఈ పరిస్థితుల్లో వారికి చాలా తక్కువ ప్రత్యామ్నాయాలు మాత్రమే ఉంటాయి. భవిష్యత్తులో డేటా సెంటర్లు పరోక్షంగా సృష్టించే ఉద్యోగాల ముఖచిత్రం ఇదే.

**ప్రత్యామ్నాయం ఉందా :**

ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలపై, ప్రకృతి వనరులపై ఇంత భారీ ఒత్తిడి లేకుండా డేటా సెంటర్లు మరియు ఎఐ విప్లవాన్ని ప్రత్యామ్నాయ మార్గంలో నడపడం సాధ్యమేనా? అంటే అవును అంటున్నారు కొందరు ఎఐ నిపుణులు. చిన్నమోడళ్లపై ఆధారపడిన ఎఐ వ్యవస్థలు కూడా ప్రత్యామ్నాయ పర్యావరణంలో సమర్థవంతంగా నడవగలమనే నమ్మకంతో ఉన్నామని కొంతమంది నిపుణులు భావిస్తున్నారు.

**(అనువాదం: కె. హరికిషోర్)**

రాజకీయ పరిణామాలు

# అభివృద్ధి కోసమే భూములను 22-ఎ జాబితా నుండి తొలగించారా?



రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

**ఎ కోటిరెడ్డి**

ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఎపిఐఐసి)కి కేటాయించిన భూములలో 22–ఎ కింద ఉన్న భూములను నిషేధిత జాబితా నుండి తొలగించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. అందుకు అనుగుణంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ భూముల్లో పరిశ్రమలు పెట్టిన వారు తమ ఆస్తులను బ్యాంకులలో తాకట్టు పెట్టి రుణాలు పొందలేకపోతున్నారు. కాబట్టి రాష్ట్రంలోని 14 జోన్లలో ఉన్న 51,603.46 ఎకరాల ప్రభుత్వ, డికెటి, పట్టా భూములను నిషేధిత జాబితా నుండి తొలగిస్తున్నారు. ఎపిఐఐసి జోనల్ మేనేజర్లు తాసిల్దార్లను కలవటం, కలెక్టర్లకు విజ్ఞప్తులు, 22–ఎ జాబితా నుండి భూములను తొలగిస్తూ ఆదేశాలు జారి చేయటం తదితర క్రమం ఉన్నా, పెట్టుబడిదారుల కోసం కాబట్టి ఇవన్నీ రోజుల వ్యవధిలోనే జరిగినా ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు.

కానీ ఈ భూములను నిషేధిత జాబితా నుండి తొలగించటానికి ప్రభుత్వం చెబుతున్న కారణం అత్యంత ముఖ్యమైనది. పెట్టుబడి దారులు ఈ భూములను బ్యాంకులలో తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవటానికి ఆటంకంగా ఉన్నది కాబట్టి జాబితా నుండి తొలగిస్తున్నట్లు ప్రభుత్వం చెప్పింది. నిజంగా పెట్టుబడిదారులు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకొస్తుంటే పరిశ్రమలు నిర్మించటానికి భూమి కావాలి. కానీ ఆ భూమి ఏ జాబితాలో ఉన్నా అభ్యంతరం ఏముంటుంది? పరిశ్రమపెట్టుకో వటానికి ప్రభుత్వం ఇచ్చిన భూమిని పెట్టుబడి కోసం తాకట్టు పెట్టేవారు రాష్ట్రానికి నిజంగా పెట్టుబడులు తీసుకొస్తారా?

మంత్రివర్గ నిర్ణయం, ప్రభుత్వ వివరణలతో పరిశ్రమల ఏర్పాటు పేరుతో రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను అర్థం చేసుకోవటం సులభమౌతుంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టటానికి పెట్టుబడిదారులు బారులు తీరుతున్నారని, రాష్ట్రాన్ని దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా నిలబెడతామంటున్న ప్రచారంలోని బండారం కూడా బట్టబయలవుతున్నది. నిజంగా అంత పెద్ద మొత్తాలలో పెట్టుబడులు తీసుకొస్తుంటే ప్రభుత్వం ఇచ్చిన భూములు తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవాల్సిన అవసరం ఏముంది? ఎక్కువ మంది ప్రభుత్వం ఇచ్చిన భూములను బ్యాంకులలో తాకట్టు పెట్టి, రుణాలు తీసుకొని, పరిశ్రమలు పెట్టకుండా ఉడాయిస్తున్నారు. వాస్తవం ఏమిటంటే నిజంగానే పరిశ్రమలు పెడుతున్నవారు కూడా భూములు, బ్యాంకుల నుండి రుణాలతో పాటు, ప్రభుత్వం నుండి అనేక రెట్లు అదనంగా రాయితీలు పొందుతూ లాభాలు సంపాదించుకొంటున్నారు మినహా భారీస్థాయిలో పెట్టుబడులు తీసుకురావటం లేదు. ఇటువంటి లావాదేవీలలో మంత్రులు, ఎంఎల్ఎలు, ఎంపిలు, ఉన్నతాధికారులు ఎవరి వాటా వారు తీసుకొని రైతులను, రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు. గతంలో విద్యుత్ ఉత్పతి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెబుతూ, నిర్మాణ ఖర్చు అంచనా ఎక్కువగా చూయించి, ఆ ప్రాతిపదికపై తీసుకున్న అదనపు రుణాలతో నిర్మాణం జరగుతున్నపుడే పెట్టుబడిదారులు భారీగా లాభాలు పొందారని వెల్లడైంది. ఇపుడు కూడా నిర్మిస్తున్నారని చెబుతున్న పరిశ్రమల వాస్తవ వ్యయం ఎంతో, ప్రభుత్వం ఇస్తున్న భూముల విలువ, రాయితీలు, బ్యాంకు రుణాలు తదితరాలు కలిసి ఎంత మొత్తం అవుతాయో పూర్తిగా వెల్లడైతే పరిశ్రమలు, అభివృద్ధి బండారం బయటపడుతుంది.

పరిశ్రమలు తీసుకొస్తున్నామనే పేరుతో ప్రభుత్వం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో రైతుల నుండి బలవంతంగా భూములు స్వాధీనం చేసుకొంటున్నది. మరోవైపున కోట్ల రూపాయల విలువైన భూములను ఎకరం 99 పైసలు చొప్పున పెట్టుబడిదారులకు ఇస్తున్నది. ప్రభుత్వం భూములు లాక్కున్న రైతులు ఒక్కసారిగా సర్వం కోల్పోయి దరిద్రులుగా మారుతుండగా, పరిశ్రమల పేరుతో భూములు కాజేస్తున్న వారు ఎటువంటి కష్టం లేకుండా శత కోటీశ్వరులుగా మారుతున్నారు. ఈ విధానాల వలన పరిశ్రమలు నిర్మించని నకిలి పారిశ్రామిక వేత్తల చేతులలోకి భూములు పోవటంతో పాటు, ఆ భూములను తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవటంతో బ్యాంకులు, ఇతర ప్రభుత్వ ద్రవ్యసంస్థలకు కూడా నష్టం కలుగుతున్నది. దీనితో పాటు నిజంగా పరిశ్రమలు పెట్టే వారి కోసం తిరిగి రైతుల నుండి భూములు తీసుకోవలసి రావటంతో అవసరమైనదాని కన్నా పెద్దమొత్తంలో భూములను వ్యవసాయోత్పత్తి నుండి మినహాయించ వలసి వస్తున్నది. ఇందువలన కొన్ని ప్రాంతాలలో వ్యవసాయం కుంటుపడటంతో పాటు, రాష్ట్రంలో వ్యవసాయోత్పత్తి తగ్గిపోతున్నది.

ప్రభుత్వ చర్యల వలన రాష్ట్రానికి రెండు విధాలుగా నష్టం జరుగుతుంది. ఒకటి, రైతుల నుండి భూములు తీసుకున్న తర్వాత ఆ ప్రాంతంలో వ్యవసాయం చేయటానికి అవకాశం ఉండదు. దీనితో కేవలం భూములు పోగొట్టుకున్న రైతులే కాకుండా, ఆ ప్రాంతంలోని వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, ఇతర వృత్తులు, వ్యాపారాలు చేస్తున్న వారంతా నిరుద్యోగులు అవుతున్నారు. కాబట్టి భూములు సేకరించిన ప్రతిచోటా వేలాది మంది, రాష్ట్రవ్యాపితంగా లక్షలాది మంది కొత్తగా నిరుద్యోగుల జాబితాలో చేరుతున్నారు. రెండవది, ప్రభుత్వం నుండి భూములు తీసుకున్న వారు పరిశ్రమలు పెట్టకపోవటంతో నిరుద్యోగులకు ఉద్యోగాలు రావటం లేదు. పరిశ్రమలు పెట్టిన చోట కూడా స్థానికంగా ఉన్నవారికి కాకుండా వివిధ ప్రాంతాల నుండి వలసలు వస్తున్న వారిని అతి తక్కువ వేతనాలతో ఉద్యోగాలలోకి తీసుకొంటున్నారు. అందువలన భూములు కోల్పోయిన వారితో పాటు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వారు కూడా నిరుద్యోగులుగానే మిగులుతున్నారు. ప్రభుత్వ చర్యల వలన రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య నికరంగా పెరుగుతుంది మినహా ఏ మాత్రం తగ్గటం లేదు. అందువలన పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగాల కల్పన గురించి ప్రభుత్వం

> "శంకుస్థాపనలో పాల్గొన్నవారు మిట్టల్-నిప్పన్ ఉక్కుఫ్యాక్టరీ వలన ఈ ప్రాంతంలో అభివృద్ధి జరుగుతుందని డబ్బా కొట్టారు మినహా విశాఖ ఉక్కుఫ్యాక్టరిని గురించి కనీసం ప్రస్తావన కూడా చేయలేదు. తెలుగు ప్రజలు పోరాటాల ద్వారా సాధించు కున్న, వేలాది మంది రైతులు తమ భూములు ధారపోసి నిర్మించు కున్న విశాఖ ఉక్కుఫ్యాక్టరీ గురించి గానీ, కేంద్రప్రభుత్వ ప్రయివేటీ కరణ యత్నాలకు వ్యతిరేకంగా ఉక్కు కార్మికులు చేస్తున్న పోరా టాలను గురించి గానీ కనీసం ప్రస్తావించటానికైనా ఒక్కరికీ నోరు రాలేదు."

చేస్తున్న ప్రచారానికి, వాస్తవ పరిస్థితులకు సంబంధం ఉండటం లేదు.

**మిట్టల్ స్టీలుప్లాంటుకు శంకుస్థాపన**

మార్చి 23వ తేదీన మిట్టల్-నిప్పన్ స్టీల్‌ప్లాంట్‌కు అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో శంకుస్థాపన చేసిన సందర్భంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ దేశంలోనే అతి పెద్ద ఉక్కుఫ్యాక్టరీ మన రాష్ట్రానికి రావటం అదృష్టం అని పేర్కొన్నారు. దీనితో అనకాపల్లి, ఉత్తరాంధ్రతో పాటు రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తుందని చెప్పుకొచ్చారు. రెండు దశల్లో నిర్మాణమయ్యే ఈ ఫ్యాక్టరీ 1.78 కోట్ల టన్నుల ఉక్కును ఉత్పత్తి చేస్తుందని, 1.35 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు, ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షమందికి ఉద్యోగాలు వస్తాయని గొప్పలు చెప్పారు. నిజంగా ఈ ప్రాజెక్టు ఇంత భారీగా అభివృద్ధికి బాటలు వేస్తుంటే, భూములిచ్చిన రైతులు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వమని అడుగుతుంటే ఇవ్వటానికి ప్రభుత్వానికి అభ్యంతరం ఎందుకుండాలి? భూములు కోల్పోతున్న రైతులకే తగిన పరిహారం ఇవ్వకపోతే అభివృద్ధి జరిగినా ఆ ఫలితాలు దక్కేదెవరికి? న్యాయం చేయాలని పోరాటం చేస్తున్న రైతులను, నాయకులను నిర్బంధించటం ఎందుకు? పోలీసు పహారాలు, బెదిరించటంతో పాటు స్థానిక ప్రజల మధ్య ఘర్షణలెందుకు రేకెత్తిస్తున్నారు? ఒకవేళ వారు చెప్పినట్లు అభివృద్ధి జరిగినా ఇది ఎవరి అభివృద్ధో అర్థం అవుతున్నది కాబట్టే పెట్టుబడిదారులు, అధికారంలో ఉన్న నాయకులు సంబరాలు చేసుకుంటుంటే, భూములు పోగొట్టుకున్న బాధితులు కన్నీరు మున్నీరవుతున్నారు.

**విశాఖ ఉక్కుఫ్యాక్టరిని గురించి పల్లెత్తు మాటలేదు**

శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నవారు మిట్టల్-నిప్పన్ ఉక్కుఫ్యాక్టరీ వలన ఈ ప్రాంతంలో అభివృద్ధి జరుగుతుందని డబ్బాకొట్టారు మినహా విశాఖ ఉక్కుఫ్యాక్టరిని గురించి కనీసం ప్రస్తావన కూడా చేయలేదు. విశాఖపట్టణంలో అసలు ఉక్కుఫ్యాక్టరియే లేదన్నట్లుగా నటించారు. తెలుగు ప్రజలు పోరాటాల ద్వారా సాధించుకున్న, వేలాది మంది రైతులు తమ భూములు ధారపోసి నిర్మించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ గురించి గానీ, కేంద్ర ప్రభుత్వ ప్రయివేటీకరణ యత్నాలకు వ్యతిరేకంగా ఉక్కు కార్మికులు, ప్రజలు చేస్తున్న పోరాటాలను గురించి గానీ కనీసం ప్రస్తావించటానికైనా ఒక్కరికీ నోరు రాలేదు. మూడు లక్షల కోట్ల రూపాయలకు పైగా విలువ కలిగిన, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి పునాదిగా ఉన్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరిని కాపాడటానికి చిటికెన వేలు కూడా కదల్చనివారు రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామంటుంటే నమ్మకం కలుగుతుందా? ఇంకా ప్రారంభమే



అనకాపల్లిలో ఉక్కు ఫాక్టరీ శంకుస్థాపన సందర్భంగా మిట్టల్‌తో చంద్రబాబు, పవన్ మంతనాలు

కాని మిట్టల్ స్టీల్‌కు స్వంత ముడి ఇనుప ఖనిజ గనులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నవారికి స్వంత ముడి ఇనుప ఖనిజం గనులు లేక విశాఖ ఉక్కుఫ్యాక్టరి నష్టపోతుందన్న విషయం తెలియదా! మిట్టల్‌కు విద్యుత్ బిల్లుల నుండి నీటి సరఫరా వరకు రాయితీల వర్షం కురిపిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి విశాఖ ఉక్కుఫ్యాక్టరికి అవసరమైన రాయితీలు ఇవ్వాలన్న ఇంగిత జ్ఞానం లేదు. అభివృద్ధిని గురించి గొప్పలు చెబుతున్న నాయకులు ఉత్తరాంధ్రలోనూ, రాష్ట్రంలోనూ అభివృద్ధికి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ దోహదం చేసిందని తెలియనంతగా కళ్ళు మూసుకున్నారా? మిట్టల్ ప్లాంట్‌ను కడపలో పెడితే రాయలసీమ ప్రాంత అభివృద్ధికి దోహదం చేస్తుందన్న స్పృహ కూడా ఈ పెద్దలకు లేదు. కూటమి ప్రభుత్వం నిజంగా రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుంటే విశాఖ ఉక్కుఫ్యాక్టరిని ప్రైవేటీకరించబోమని కేంద్ర ప్రభుత్వం చేత ప్రకటన చేయించి, స్వంత ఇనుప గనులతో పాటు మిట్టల్ కంపెనీకి ఇస్తున్న రాయితీ లన్నింటినీ విశాఖ ఉక్కు ఫ్యాక్టరికి కూడా ఇవ్వాలి. అపుడు మాత్రమే మిట్టల్ ఉక్కుఫాక్టరిని ఏర్పాటు చేయించటం ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వం చేస్తున్న ప్రచారానికి కొంతైనా విలువ ఉంటుంది. *

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

# దిగజారుతున్న ఆధిపత్యాన్ని నిలుపుకోడానికి అమెరికా చేస్తున్న అరాచకమే నేటి యుద్ధాలు

## సందేహాలు సమాధానాలు



- బి.వి.రాఘవులు

**2026** ఫిబ్రవరి 1,2 తేదీల్లో విజయవాడలో జరిగిన యువకార్యకర్తల రాజకీయతరగతుల్లో అంతర్జాతీయ పరిణామాలపై వివిధ జిల్లాల నుండి వచ్చిన ప్రశ్నల సారాంశాన్నీ, వాటికి సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ఇచ్చిన సమాధానాలను దిగువ ఇస్తున్నాం.

**ప్రశ్నలు:**

**(1)** అమెరికా అంతర్జాతీయ పోలీస్‌గా వ్యవహరిస్తున్న నేటి తరుణంలో ఐక్యరాజ్య సమితికి సంబంధించిన భద్రతా మండలి స్పందించకపోవడానికి కారణం ఏమిటి? గాజా ప్రజలపై ఇజ్రాయిల్ జరుపుతున్న మారణహోమాన్ని ఆపడానికి ఐక్యరాజ్యసమితి ఏం చేస్తోంది? అమెరికా చేస్తున్న దారుణాలను ఐక్యరాజ్యసమితి ఎందుకు అరికట్టలేకపోతుంది? డొనాల్డ్ ట్రంప్ ఐక్యరాజ్య సమితి నుండి వైదొలిగి దానికి సమాంతరంగా ఒక వ్యవస్థను నిర్మిస్తున్నారు ఎందుకు?

**(2)** అమెరికా, వెనిజులాపై దాడి చేసి అధ్యక్షుడు మదురో దంపతులను కిడ్నాప్ చేసింది. సోషలిస్టు దేశమైన చైనా అమెరికాకు ఎందుకు ఇప్పటి వరకు వార్నింగ్ ఇవ్వలేదు? వీటో అధికారం కలిగిన 5 దేశాలలో చైనా, రష్యా కూడా ఉన్నాయి. ఎక్కడైనా జోక్యం చేసుకున్న సందర్భాలుంటే వివరించగలరు. చైనా, రష్యా పాలస్తీనాకు మద్దతుగా ఎందుకు నిలబడలేదు? పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిపై చైనా, రష్యా దేశాల వైఖరి ఏమిటి? మార్కెట్ పోటీ ప్రపంచంలో అమెరికాకు ప్రత్యామ్నాయంగా చైనా కనిపిస్తున్నా కార్మికవర్గ నియంతృత్వం గల సామ్యవాద దేశంగా చైనా కనిపించడం లేదు వివరించగలరు.

**(3)** ప్రపంచంలో డాలర్ పెత్తనంపై తిరుగుబాటు జరుగుతోంది. డాలర్‌ను వ్యతిరేకిస్తే రెండో స్థానంలో ఉన్న కరెన్సీ ఏది? అమెరికా అన్ని దేశాలను బెదిరిస్తుంది, సవాళ్ళు విసురుతుంది, వ్యాపారాలను దెబ్బతీస్తాం అని వార్నింగ్ ఇస్తుంది, ఎందుకని అమెరికా అంత బలంగా ఉందో వివరించగలరు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నాటో దేశాలకు సహకారాన్ని ఎందుకు తగ్గించాలనుకుంటున్నాడు?

**(4)** రష్యా నుంచి చమురు దిగుమతుల విషయంలో నరేంద్ర మోడీ ఎందుకు అమెరికాకు భయపడుతున్నారు?

**(5)** ఉత్తర కొరియా దేశం గురించి కాలేజీ క్లాసులో సామ్రాజ్యవాదం దేశం అని, దేశాక్షుడు నియంత అని చెప్పారు. కానీ మన పార్టీ ఏమో సోషలిస్ట్ దేశం అని చెబుతుంది. ఎందుకని వివరించగలరు? ఉత్తర కొరియా సోషలిస్ట్ దేశం అయితే వంశపారంపరంగా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టడం ఏంటీ? అక్కడ పార్టీ కమిటీల్లో నాయకత్వం ఎన్నిక కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రం ప్రకారం జరగదా వివరించగలరు?

**(6)** మనమందరం సామ్రాజ్యవాద దేశాలకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నాం? కానీ అగ్రనాయకుల పిల్లలే సామ్రాజ్యవాద దేశాలకు వలస వెళ్ళిపోతున్నారు. ఎందుకని?

**సమాధానాలు:**

అంతర్జాతీయ పరిస్థితులపై అడిగిన ప్రశ్నలు చాలా వైవిధ్యపూరితంగా ఉన్నాయి. అనేక అంశాలను లేవనెత్తారు. అంశాలవారీగా వాటికి సమాధానం ఇస్తాను.

(1) ఐక్యరాజ్యసమితి: ఈ అంతర్జాతీయ సంస్థ గురించి, దాని పనితీరు గురించి చాలా ప్రశ్నలలో లేవనెత్తారు. రెండవ ప్రపంచయుద్ధం తర్వాత శాంతి పరిరక్షణకోసం, యుద్ధనివారణ కోసం, దేశాల మధ్య సహకారం, సామరస్యం అభివృద్ధికోసం 1945లో ఇది ఆవిర్భవించింది. గడిచిన ఎనిమిది దశాబ్దాలలో అది నిర్వహించిన పాత్రపై వాదోపవాదాలు నడుస్తూనే ఉన్నాయి. అది కోరలు లేని సంస్థ అని కొందరు తృణీకరిస్తే, చాలా పరిమితులున్నప్పటికీ ప్రపంచ పరిస్థితిని అదుపులో ఉంచడానికి కొంత వరకు తోడ్పడిందని మరికొంతమంది సమర్థిస్తున్నారు. మొత్తంమీద జూస్తే భౌతికంగా శాంతిని కాపాడడంలో పరిమిత పాత్ర అయినా, ప్రపంచశాంతి విషయంలో అది నిర్వహించిన సానుకూలమైన నైతికపాత్రను కాదనలేం. అయితే అమెరికా సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు ఐక్యరాజ్యసమితి ఆటంకంగా ఉందన్న భావం అమెరికా పాలకవర్గాలలో క్రమక్రమేణా బలపడుతూ, దాన్ని బలహీన పర్చడానికి గత కొంతకాలం నుండి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ట్రంప్ అధికారానికి వచ్చిన తరువాత ఆ ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఐక్యరాజ్య సమితి, దాని అనుబంధ సంస్థలకు నిధులను నిలిపివేయడం, సహకారం నిరాకరించడం, కొన్నింటి నుండి వైదొలగడం వగైరా చర్యల ద్వారా బలహీనపర్చుతున్నారు. ఈ మధ్యనే ఐక్యరాజ్యసమితి పాత్రను పూర్తిగా నిరాకరించే విధంగా గాజా పునర్‌నిర్మాణం పేరుతో బోర్డ్ ఆఫ్ పీస్‌ను ట్రంప్ ఏర్పాటు జేశారు. ప్రపంచ వాణిజ్య సంస్థను ప్రక్కకు నెట్టి, ద్వైపాక్షిక ఒప్పందాలను ఏకపక్ష నిర్ణయాలను ట్రంప్ ముందుకు తెస్తున్నారు. వాతావరణ సమావేశాలను బహిష్కరించారు.

వీటన్నింటిని బట్టిజూస్తే ఐక్యరాజ్య సమితి పని, అమెరికా సామ్రాజ్యవాదులు తమకు ఆటంకంగా ఉంది అని భావిస్తున్నట్లు స్పష్టమవుతుంది.

ప్రపంచంలో అనేక ప్రాంతాలలో చెలరేగిన యుద్ధాలను, అంతర్గత సంఘర్షణలను, వివాదాలను పరిష్కరించడంలో (ప్రశ్నలలో పేర్కొనబడిన, ఇజ్రాయెల్ – పాలస్తీనా – ఉక్రెయిన్ – రష్యా అమెరికా – ఇరాన్, వెనిజులాపై అమెరికా అఘాయిత్యం, క్యూబాపై ఆంక్షలు వగైరా) ఐక్యరాజ్యసమితికి చాలా పరిమితులు కన్పిస్తున్నా, ఎక్కువ సందర్భాలలో సరియైన తీర్మానాలుజేసి ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడానికి, నైతిక ఒత్తిడిని పెంచడానికి దాని పాత్ర ఉపయోగపడింది. ఐక్యరాజ్యసమితి పరిపాలనా వ్యవస్థ కీలకమైంది సెక్యూరిటీ కౌన్సిల్‌లోని సభ్య దేశాలకు ఏ తీర్మానాన్నైనా కాదనే హక్కు (వీటో హక్కు) ఈ హక్కు ఉండడం. అమెరికా, దాని మిత్రులు తమ ఆధిపత్య ప్రయోజనాలను కాపాడుకునేందుకు ఉపయోగించుంటున్నాయి. ఉదాహరణకు పాలస్తీనా ప్రజలపై దాడులను వ్యతిరేకిస్తూ ప్రతిపాదించే చర్యలు ప్రతి సందర్భంలోను నిలుపుజేస్తుంటాయి. అదే సందర్భంలో గతంలో సోషలిస్టు సోవియట్ యూనియన్, ఇప్పుడు సోషలిస్టు చైనాలు మూడవ ప్రపంచపు దేశాలకు, పాలస్తీనా ప్రజలకు, ఇంకా అమెరికా ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడే ప్రజలకు అనుకూలంగా తమ వీటో హక్కును వినియోగించాయి. ఇప్పుడు పాలస్తీనాలో జరుగుతున్న

మారణహోమం విషయంలోను చైనా గట్టిగా ఇజ్రాయల్‌ను వ్యతిరేకించింది. అమెరికా సామ్రాజ్యవాదులకు కూడా వీటో హక్కు ఉన్నందున ఇంతకన్నా ముందుకు పోవడం ఐక్యరాజ్యసమితి ద్వారా సాధ్యం కాకపోవచ్చు. మనం గమనించాల్సిన విషయం ఐక్యరాజ్య సమితి ద్వారా కొంత పరిమితంగానైనా, నైతికంగానయినా అమెరికాకు ప్రతిబంధకం జరగడాన్ని అది అంగీకరించలేకపోతున్నది.

(2) అంతర్జాతీయ పరిణామాలలో చైనా, రష్యా పాత్రల గురించి చాలా ప్రశ్నలలో లేవనెత్తారు.

గమనించాల్సిన మొదటి విషయం రష్యా సోషలిస్టు దేశం కాదు. 1989లోనే సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమై, పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరణ అయింది. నేడు రష్యాలో పెట్టుబడిదారి వ్యవస్థ ఉన్నది. అయినా అంతర్జాతీయ, ముఖ్యంగా ఐరోపా రాజకీయా లలో, తమ దేశ ప్రయోజనాల రీత్యా అమెరికా, దాని మిత్ర దేశాలతో కూడిన నాటోతో రష్యా సంఘర్షణ పడాల్సిన పరిస్థితి వచ్చింది. దీనికోసం సోషలిస్టు చైనాతో జతగట్టడానికి సిద్ధమయింది. అమెరికా సామ్రాజ్యవాదులను అదుపులో పెట్టడానికి కొంత మేరకు ఈ పరిణామం తోడ్పడుతుంది. ఈ రెండు దేశాలు కోల్డ్‌వార్ సమయంలో వైరుధ్య దేశాలుగా ఉన్నాయి. ఇప్పుడు సహకరించుకుంటున్నాయి. ఇది ఎంతకాలం కొనసాగితే అంత మంచిది.

ఇక చైనాకు వస్తే, అది సోషలిస్టు దేశం. ఒక వెనుకబడిన దేశంగా ఉండి, క్రమేణా అనేక ప్రతిబంధకాలను ఎదుర్కొంటూ, ప్రయోగాలు జేసుకుంటూ క్రమేణా సోషలిస్టు వ్యవస్థను నిర్మించుకుంటున్నది. ఇంకా అభివృద్ధి చెందిన సోషలిస్టు వ్యవస్థగా ఆవిర్భవించలేదని, దానికి సుదీర్ఘకాలం పడుతుందని చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రకటించిన విషయాన్ని మనం గమనించాలి. అంతర్జాతీయ పరిస్థితుల్లోను ఐక్యరాజ్య సమితిలోను అత్యధిక సందర్భాలలో చైనా ప్రజలవైపు, శాంతివైపు, అమెరికా ఆధిపత్యానికి గురవుతున్న దేశాలవైపు ఉన్నది. అయితే తీర్మానాలుజేయడం, మాటసాయం జేయడం వరకే పరిమితమైతే ఎలా అని అనేకమంది అభిప్రాయపడుతున్నారు. పాలస్తీనా, వెనిజులా, ఇరాన్ వంటి పరిణామాలలో చైనా అమెరికాకు వ్యతిరేకంగా స్పష్టంగానే వైఖరి తీసుకున్నది. ఆ దేశాల ప్రజలకు మానవతా సాయాన్ని అందించడంలో, వారికి అవసరమైన సామాగ్రిని అందించడంలో ముందున్నది. అయితే ఇది సరిపోదు. భౌతికంగా అవసరమైన, నేరుగా రక్షణకోసం సైనిక సాయానికి కూడా సోషలిస్టు దేశమైన చైనా ముందుకు రావాలి కదా అనే వాదనలు ఉన్నాయి. నేటి ప్రపంచ పరిస్థితుల్లో అటువంటి సైనిక జోక్యాలు, సహాయాలు ఎంత వరకు తోడ్పడతాయి అనేది సమస్య. బహుశా ఈ పద్ధతులు ప్రస్తుతం సరిపోవు అని చైనా భావించి ఆ స్థాయికి పోవడానికి సిద్ధం కాకపోయి ఉండవచ్చు.

సోవియట్ యూనియన్ ఉన్న కాలంలో అనేక సందర్భాలలో సైనిక జోక్యంతో ప్రత్యక్ష సాయాలు జరిగాయి. ఆ అనుభవాలు అంత సానుకూలంగా లేవు. అలాగే ఈ అంతర్జాతీయ అనుభవాలనుండి కూడా నేటి సోషలిస్టు దేశాలు అంతర్జాతీయ పరిస్థితుల్లో వ్యవహరించాల్సిన ఎత్తుగడలను నిర్ణయించుకుంటున్నాయి.

(3) అంతర్జాతీయ పరిస్థితుల్లో మారిన, మారుతున్న అమెరికా సామ్రాజ్యవాదుల పాత్రను మనం జాగ్రత్తగా పరిశీలనజేసి అవగాహన జేసుకోవాల్సి ఉంది. ఇంతకుముందే చెప్పుకున్నట్లు ఐక్యరాజ్యసమితిని బలహీనం జేయడం, పూర్తిగా తన ఆధీనంలో ఉండే ప్రత్యామ్నాయ వ్యవస్థలను రూపొందించడం కోసం ప్రయత్నాలు జేస్తున్నది. ఆర్థికంగా అమెరికా ఆధిపత్యానికి నేడు పెద్ద సవాలు ఎదురవుతున్నది. నయా సరళీకరణ దశలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక దీర్ఘకాల సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ఈ దశలో అమెరికా విజ్ఞాన ఆధిపత్యానికి, డాలరు ఆధిపత్యానికి సవాళ్ళు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా చైనా నుండి ఈ పోటీ వస్తున్నది. ఈ పరిస్థితిని ఎదుర్కో వడానికి అంతర్జాతీయ పెట్టుబడి, ప్రపంచంలో అత్యంత అభివృద్ధి నిరోధక నయా–ఫాసిస్టులను ప్రోత్సహిస్తున్నది. అమెరికాలో ట్రంప్ ఈ ధోరణికి ప్రతినిధిగా ముందుకు వచ్చాడు. ప్రపంచ దేశాలపై టారిఫ్ దాడి ప్రకటించడం, రష్యా, చైనా, ఇతర అనేక దేశాలపై ఆంక్షలను విధించడం, వెనిజులా, ఇరాన్‌లపై దాడులు, ఇజ్రాయెల్‌ను ముందుపెట్టి గాజాలో మారణహోమం సాగించడం, ఉక్రెయిన్‌ను ముందు పెట్టి నాటో రష్యాతో యుద్ధం సాగించడం – ఇవన్నీ, దిగజారుతున్న తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి జేస్తున్న ప్రయత్నాలలో భాగం.

ఈ ప్రయత్నాలలో తన మిత్రదేశాలైన సామ్రాజ్యవాదులు కూడా భాగం పంచుకోవా లన్నది అమెరికా వ్యూహం. ఆ దేశాలు కూడా సైనిక ఖర్చులు పెంచాలని, అమెరికా అప్పుల భారాన్ని తగ్గించుకోవడంలో సాయపడాలని అమెరికా ఒత్తిడి తేవడం నాటో సభ్య దేశాలతో ఉద్రిక్తతలకు కారణమవుతున్నది. ఉక్రెయిన్ – రష్యా యుద్ధం తొందరగా పరిష్కారమైతే దృష్టి అంతా చైనాపైకి మళ్ళించాలనేది ట్రంప్ వ్యూహం. అయినా ఐరోపా సామ్రాజ్యవాదుల ప్రయోజనాల రీత్యా ఇది సాధ్యపడడం లేదు. అమెరికా తన ఆధిపత్యాన్ని సుస్థిరంజేసుకోవడం, చైనా నుండి సవాలు నిలవరించడం కోసం అంతర్జాతీయ పరిస్థితుల్లో ఉద్రిక్తతలను రెచ్చగొడుతూనే ఉంటుంది.

అమెరికా సామ్రాజ్యవాదుల పన్నాగాలను ఎండగడుతూ ప్రపంచ ప్రజలను శాంతికోసం సంసిద్ధంజేయడమే అమెరికాను నిలవరించ గలదు. ఆధిపత్యాన్ని ఎదిరిస్తున్న ప్రజలకు, దేశాలకు ఆత్మ విశ్వాసాన్ని కల్గించగలదు.

(4) మనదేశం విదేశాంగ విధానం మన పాలకవర్గాల ప్రయోజనాలకనుగుణంగానే నడుస్తుందనేది మనగమనంలో ఉండాలి. లేకపోతే విదేశాంగ విధానాన్ని అధికారంలో ఉన్న నాయకుల తెలివితేటలకో, ధైర్య సాహసా లకో లేక వాటి లోపాలకో ఆపాదించే ప్రమా దం ఉంది. అమెరికాతో అసమాన వాణిజ్య ఒడంబడిక జేసుకోవడం, 'పాలస్తీనా శాంతి బోర్డు'లో మనదేశం చేరడం, ప్రధాన మంత్రి ఇజ్రాయెల్ సందర్శించడం, ట్రంప్ అవమాన కరంగా మాట్లాడుతున్నా, మోడీ పెదవి విప్పకపోవడం – ఇవన్నీ ప్రధాని మోడీ పిరికి తనం నుండి వచ్చినవనుకోవడం పొరపాటు. అలాగే ఆయన ధైర్య సాహసాలకు, చాణక్య నీతికి తార్కాణాలుగా చిత్రీకరించే ప్రయత్నం కూడా మోసపూరితం. విదేశాంగ విధానంలోని మంచి చెడ్డలను నాయకులకు ఆపాదించి, చర్చ నడపడం, దాని చుట్టూ ప్రదిక్షణం చేయించడం అసలు సమస్యల నుండి, పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాల పాత్ర నుండి దృష్టి మళ్ళించ డానికి, ప్రజలను తప్పుత్రోవపట్టించ డానికి ఉపయోగపడుతుంది.

మనదేశ కార్పొరేటు శక్తులు అంతర్జాతీయ పెట్టుబడి కార్యకలాపాలలో భాగస్వాములవు తున్నారు. ఈ శక్తుల ప్రయోజనాలు ఫైనాన్సు పెట్టుబడితో గట్టి ముడివేసుకుంటున్నాయి. కార్పొరేట్లకు ప్రతినిధిగా ఉన్న బిజెపి సంఘపరివార్, ప్రధాని మోడీ, అంతర్జాతీయ పెట్టుబడి ప్రయోజనాలకు నాయకత్వం వహిస్తున్న ట్రంప్‌తో సయోధ్యగా ఉండడం, ట్రంప్ వాచాలతను దిగమింగుతుండడంలో ఆశ్చర్యం లేదు. హిందూత్వ మతోన్మాదానికి నాయకత్వం వహిస్తున్న మోడీ పాలన మన ఇరుగుపొరుగు దేశాలలో మనలను ఒంటరిపాటుజేస్తున్నాయి. దేశ ప్రజల కొనుగోలు శక్తిని పెంచడం మీద ఆధారపడే దానికన్నా విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంపై ఆధారపడి ఆర్థిక వ్యవస్థ నడపాలనుకుంటున్న వ్యూహం కూడా అమెరికా ముందు మన పాలకులు సాగిలపడేట్టు జేస్తున్నది.

ఈ నేపథ్యాన్ని అర్థంజేసుకుంటే అమెరికా, ముఖ్యంగా ట్రంప్ ముందు మన పాలకులు, (ప్రధానితో సహా) ఎందుకు అణిగి మణిగి ఉంటున్నారో అర్థమవుతుంది.

(5) ఉత్తర కొరియాలో జరుగుతున్న పరిణామాల గురించి మీడియాలో అనేక కథనాలు వస్తున్నాయి. వాటన్నింటిలో ఏవి సరియైనవి, ఏవి నిరాధారమైనవి అని నిర్ధారించుకోవడం కష్టం. వాటిమీద ఆధారపడి, తొందరపడి నిర్ధారణకు రావడం మంచిది కాదు. కొన్ని విషయాలను మాత్రం మనం స్పష్టంగా చెప్పుకోవచ్చు.

ఉత్తర కొరియా అంటే అమెరికా సామ్రాజ్యవాదులకు తీవ్రమైన కోపం. ఒక చిన్న దేశంమీద ఒక అగ్రరాజ్యానికి ఇంత కోపం ఉందంటే ఉత్తర కొరియా నేటి అంతర్జాతీయ పరిస్థితుల్లో సామ్రాజ్య వ్యతిరేక సానుకూల పాత్ర నిర్వహిస్తుందని నమ్మవచ్చు. ఉత్తర కొరియా సోషలిస్టు దేశం. అది సామ్రాజ్యవాద దేశం అని ఎవరు జెప్పినా అవాస్తవమే కాదు, అలా చెప్పేవారికి సామ్రాజ్యవాదం అంటే ఏమిటో తెలియదనుకోవాలి. నిరంతరం అమెరికా, దక్షిణ కొరియా దేశాల నుండి ఒత్తిడి ఎదుర్కొంటున్న ఒక చిన్న దేశంలో సోషలిజం నిర్మాణం లోపరహితంగా పురోగమిస్తుందని చెప్పలేం. అక్కడ ఉత్పత్తి శక్తులు అత్యధికంగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. అధికారాన్ని కమ్యూనిస్టు పార్టీ నిర్వహిస్తున్నది. అందువలన ఆ వ్యవస్థ గురించి పూర్తి స్థాయి నిర్ధారణను బయట నుండి చేయలేం.

అక్కడి కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో అనేక లోపాల గురించి మీడియాలో తరచుగా కొన్ని ప్రస్తావనలు వస్తున్నాయి. వాటిలో కొన్ని నిజాలున్నాయి. వ్యక్తి ఆరాధన గురించి, వంశపారంపర్య నాయకత్వం గురించిన ఆరోపణలలో కొంత నిజం ఉంది. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో వ్యక్తమవుతున్న వక్రీకరణలు ఇవి. వాటిని ఆ దేశ కమ్యూనిస్టు పార్టీ అధిగమిస్తుందని ఆశిద్దాం.

(6) చివరి ప్రశ్నలో అగ్రనాయకుల (బహుశా కమ్యూనిస్టు పార్టీ నాయకులని భావన కావచ్చు) పిల్లలే సామ్రాజ్యవాద దేశాలకు వలస వెళ్ళిపోతున్నారు. ఎందుకని! అడిగారు. మొదటి విషయం సరళీకరణ విధానాల తర్వాత ప్రపంచంలో అన్ని రకాల వలసలు వేగంగా పెరిగాయి. రెండవది పేద దేశాల నుండి విద్యార్థులు, ఉద్యోగార్థుల వలసలు పెరిగాయి. ఉన్నత స్థాయి, అలాగే శ్రమజేసే స్థాయిలోని వారూ ఈ వలసదారుల్లో ఉన్నారు. సహజంగా అభివృద్ధి చెందిన దేశాలు అంటే సామ్రాజ్యవాద దేశాలకు ఈ వలసలు ఎక్కువగా ఉన్నాయి. ఈ మధ్యకాలంలో సోషలిస్టు దేశమైన చైనాకు చదువులకోసం విద్యార్థులు వెళ్ళడం పెరిగింది.

ఈ ప్రక్రియలో కమ్యూనిస్టు కుటుంబాల నుండి కూడా కొంతమంది పిల్లలు, చదువు కోసం, ఉద్యోగాలకోసం వెళ్ళిన సందర్భాలు కన్పడుతున్నాయి. అయితే ప్రచారం జేస్తున్నంత మోతాదులో ఉన్నాయని అనుకోలేం. ఈ పరిణామానికి అనేక అంశాలు కారణం కావచ్చు. ప్రపంచ వ్యాపితంగానూ, దేశంలో వామపక్ష భావజాలం ప్రభావం బలహీనపడడం కావచ్చు, సోషలిస్టు వ్యవస్థ దెబ్బతినడం కావచ్చు, కమ్యూనిస్టు కుటుంబాలలోనే క్రొత్త తరం – తల్లిదండ్రుల భావాలను స్వీకరించడానికి వెనకాడడం కావచ్చు, అక్కడక్కడ ఉద్యమంలో ఉన్న తల్లిదండ్రులు కూడా – మనం జేస్తున్న కృషి సరిపోతుంది, మన పిల్లలను కూడా ఎందుకు రంగంలోకి దించడం అనే నిరాశా ధోరణితో నిర్లిప్తంగా ఉండడం కావచ్చు – ఈ అంశాలన్నింటి మూలంగా అవకాశం ఉంటే విదేశాలకు వెళ్ళాలనే వాతావరణాన్ని పెంచింది. ఇదేదో వ్యక్తిగత నాయకుల తప్పిదం వల్ల మాత్రమే జరుగుతున్నదని అనుకోవడం పాక్షిక దృష్టి అవుతుంది. *

# ఎప్‌స్టీన్ ఫైల్స్

**(28వ పేజీ తరువాయి)**

అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకంగా మహిళలను లైంగిక బానిసలుగా ఉపయోగించుకోవటం, పునరుత్పత్తి అవయవాలను దెబ్బతీయటానికి ప్రయత్నం చేయటం, తాను చెప్పినట్లు నడుచుకోనని మహిళలు, బాలికలను క్రూరంగా హింసించటం, మహిళలు, బాలికలను మాయం చేయటం, తన దుర్మార్గాలను ప్రతిఘటించిన, తను చెప్పినట్లు వినని కొందరిని హత్య కూడా చేయించాడని పేర్కొన్నది.

**ఎప్‌స్టీన్‌తో లావాదేవీలు నిర్వహించిన బ్యాంకులు**

రాజకీయ సంబంధాలతో కోట్లాది డాలర్ల సంపద పోగేసుకున్న ఎప్‌స్టీన్ డిగ్రీ పూర్తిచేయలేదు. అమెరికా మాజీ అధ్యక్షుడు, సాఫ్ట్‌వేర్ రంగంలో అగ్రస్థానంలో ఉన్నవారు, బ్రిటిష్ రాజకుటుంబానికి చెందిన వారితో చెట్టపట్టాలు వేసుకొని తిరిగేవాడు. 1998 నుండి 2013లో సంబంధాలను తెంచుకొనే వరకు ఎప్‌స్టీన్ ప్రైవేటు బ్యాంకు జెపి మోర్గాన్ ఛేజ్‌కు ప్రధాన కస్టమర్‌గా ఉన్నాడు. అప్పటి నుండి మరణించే వరకు డచ్ బ్యాంకుతో లావాదేవీలు కొనసాగించాడు. ఎప్‌స్టీన్ చేస్తున్న అక్రమాలు తెలిసిన తర్వాత కూడా తమ లాభాల కోసం బ్యాంకు అతనితో లావాదేవీలు కొనసాగించిందని ప్రాసిక్యూటర్లు కోర్టులో ఆరోపణలు చేశారు. మైనర్ బాలికలతో బలవంతంగా వ్యభిచారం చేయించటానికి ప్రయత్నించిన కేసులో నేరస్తుడిగా రుజువైన తర్వాత మాత్రమే బ్యాంకు అతనితో సంబంధాలు తెంచుకుంది. ప్రైవేటు బ్యాంకులు, సంస్థలకు డబ్బు సంపాదన, లాభాలు రావటం ప్రధానం కానీ, అవి సక్రమంగానా లేక అక్రమ మార్గంలోనా అన్న అంశాలను పట్టించుకోవని జెపి మోర్గాన్ ఛేజ్, డచ్ బ్యాంకులు వ్యవహరించిన తీరు స్పష్టం చేస్తున్నది.

2019, ఆగస్టులో జైలులో మరణించినపుడు ఎప్‌స్టీన్ సంపద 56 కోట్ల డాలర్లు. డబ్బుతో పాటు ఒక దీవి, ఛార్టర్డ్ విమానం, అనేక విలాసవంతమైన ఆస్తులు కూడా ఉన్నాయి. 7,600 ఎకరాల మెక్సికో రాంచ్, 5 కోట్ల డాలర్లకు పైగా విలువ చేసే మన్‌హట్టన్ టౌన్‌హౌస్, గ్రేట్ సెయింట్ జేమ్స్, లిటిల్ సెయింట్ జేమ్స్ దీవులు అతని ఆస్తులలో ఉన్నాయి.

ఎప్‌స్టీన్ కోటీశ్వరులకు ద్రవ్యసేవలు, పెట్టుబడులు, టాక్స్ ప్లానింగ్, రియల్ ఎస్టేట్ తదితరాలలో సేవలు అందించే వాడిగా పనిచేస్తున్న ముసుగులో మైనర్ ఆడపిల్లలను బలవంతంగా వ్యభిచారంలోకి దింపి, ధనికులకు తార్చటం ద్వారా వారు లైంగిక నేరాలకు పాల్పడేలా చేసేవాడు. ఈ శృంగార సన్నివేశాలను రహస్యంగా చిత్రించి, వాటిని చూయించి, బెదిరించి డబ్బు వసూలు చేసేవాడనే ఆరోపణలు ఉన్నాయి. అతనికి ఉన్న దీవులు, మన్‌హట్టన్‌లోని ఇంటిని ఈ విధమైన లైంగిక నేరాలకు కేంద్రాలుగా వినియోగించేవాడు. శత కోటీశ్వరులైన కొందరు ఖాతాదారులు, పన్ను ఎగవేతలు ఆయన సంపాదనలో ప్రధానమైనవిగా ఉన్నాయి.

**చెడిపోయిన చెట్టుకు కాసిన కాయ ఎప్‌స్టీన్**

పెట్టుబడిదారీ వ్యవస్థకు అవసానకాలం సమీపించిందని అది పనిచేస్తున్న తీరు, తీవ్రమౌతున్న వైరుధ్యాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ సమాజం నైతికంగా ఎంతటి పతనావస్థకు చేరిందనేది ఎప్‌స్టీన్ ఫైల్స్‌లోని ప్రముఖుల ఉదంతాలు వెల్లడించాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ కొనసాగుతుండగా ఈ నైతిక పతనాన్ని నివారించటం అసాధ్యం. ఈ కుళ్ళును కడిగివేయటానికి నూతన, సోషలిస్టు వ్యవస్థ నిర్మాణానికి సాగిపోవటమే మార్గం. *

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 21, Issue: 11 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# ఆనందకర దేశాల జాబితాలో 116వ స్థానంలో భారత్




ప్రపంచంలో ఆనందకరమైన 147 దేశాల జాబితాలో భారత దేశం ఈ ఏడాది కూడా చాలా దిగువ స్థాయిలోనే ఉన్నది. ప్రపంచంలోని అత్యధిక స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) గల దేశాల జాబితాలో నాలుగో స్థానాన్ని ఆక్రమించిన భారత దేశం ప్రజలకు ఆనందకర జీవితాలను ప్రసాదించే విషయంలో మాత్రం అట్టడుగున ఎదుగూబొదుగూ లేకుండా ఉంది. ఆనందకర దేశాల జాబితా 2026లో ఫిన్లాండ్ మొదటి స్థానంలో నిలవగా, చివరి 147వ స్థానంలో ఆఫ్ఘనిస్తాన్ ఉంది. భారత దేశం 2025లో 118 స్థానం నుండి ఈ ఏడాది 116వ స్థానానికి వచ్చింది. విచిత్రమేమంటే ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న పాకిస్తాన్ మన దేశం కన్నా మెరుగ్గా 104వ స్థానంలో ఉంది. నేపాల్ కూడా 99వ స్థానంలో మనకన్నా పాకిస్థాన్ కన్నా కూడా చాలా మెరుగ్గా ఉంది. దక్షిణాసియాలోని ఇతర దేశాలైన బంగ్లాదేశ్ 127వ స్థానం, శ్రీలంక 134వ స్థానంతో మనకన్నా వెనుకబడి ఉన్నాయి.

ప్రపంచంలోనే అగ్రదేశం అయిన అమెరికా ప్రపంచ ఆనందకర దేశాల జాబితాలోని మొదటి పది స్థానాల్లో కూడా లేకపోవడం విశేషం. ఈ జాబితాలో అమెరికా 23వ స్థానంలో నిలవగా ఫిన్లాండ్‌తోపాటు, ఇతర నార్థిక్ దేశాలైన డెన్మార్క్, ఐస్‌లాండ్, నార్వే, స్వీడెన్‌లు అగ్రస్థానాలు ఆక్రమించాయి. జాబితాలో చైనా 65వ స్థానంలో నిలవగా దశాబ్దాలపాటు అమెరికా బాంబుదాడుల విధ్వంసానికి గురైన వియత్నాం 45వ స్థానాన్ని ఆక్రమించింది.

ఆయా దేశాల్లో కనీసం లక్షమందికి తగ్గకుండా ప్రజల జీవన పరిస్థితులను బేరీజు వేసి దేశాలకు 0 నుండి 10 పాయింట్లు ఇస్తారు. ఆ లెక్కన మొదటి ర్యాంకులో ఉన్న ఫిన్లాండుకు అత్యధికంగా 7.8 పాయింట్లు రాగా చిట్ట చివరన నిలిచిన ఆఫ్ఘనిస్థాన్‌కు 1.4 పాయింట్లు వచ్చాయి. భారత దేశానికి 4.5 పాయింట్లు రాగా పాకిస్థాన్‌కు 4.86 పాయింట్లు, నేపాల్‌కు 5.1 పాయింట్లు వచ్చాయి. 65వ స్థానంలో నిలిచిన చైనా 6 పాయింట్లు సాధించగా, వియత్నాంకు 6.4 పాయింట్లు, అమెరికాకు 6.8 పాయింట్లు వచ్చాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా **రూ. 180**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు.......................................................
వీధి.......................................................
గ్రామం.......................................................
మండలం లేదా పట్టణం.......................................................
జిల్లా.......................................................

email : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.